దానాన్ని ఉల్లంఘించిన వారికి, విఘ్నము కల్గించిన వారికి కలిగే పాపాలు; దుష్ఫలితాలు చెప్పబడతాయి. సాధారణంగా "ఈ దానానికి విఘ్నం కల్గించిన వారికి పంచ మహాపాతకములు కల్గును" అని; "తను దానంగా యిచ్చిన లేక యితరులు దానమిచ్చిన భూమిని హరిస్తే అరవై వేల సంవత్సరాలు పేడలో (పెంటలో) పురుగై పుడతాడు" అన్న శాపోక్తి; దీన్ని విఘ్నముగావించినవాడు గంగ ఒడ్డున ఆవుదూడలు చంపిన పాపాన బోదురు; గంగ తీరంలో బ్రాహ్మణుని చంపి, పెద్దకుమారుని కపాలంలో తిన్న పాపాన బోదురు వంటివి కన్పిస్తాయి. ఇక్కడ తెలంగాణాలో కన్పించే మరొక ఆసక్తికర విషయం – శాపోక్తులలో యితర తెలుగు ప్రాంతాల్లో ముఖ్యంగా నెల్లూరు, కడప జిల్లాల్లో కన్పించినట్టు పచ్చిబూతులు, నిఝం బూతులు కన్పించవు. అట్లాగే కడప, ప్రకాశం తదితర ప్రాంతాల్లో శాసనం కింద శాపోక్తికి బదులుగా బూతుబొమ్మలు చెక్కారు. వీటిని 'గధేగల్లు'లంటారట. మాటలలో చెప్పలేని శాపోక్తులని గాడిదలతో బూతులుచెక్కారన్నమాట ముఖ్యంగా విజయనగరకాలంలో. ఇలాంటి గధేగాల్లులు మనకి తెలంగాణాలో చాలా అరుదుగా కన్పిస్తాయి.

ఇక తెలంగాణాలో లభించిన శాసనాల భాషల విషయానికి వస్తే మొదట ప్రాకృత శాసనాలు లభించాయి. ఆ తర్వాత సంస్కృతము, కన్నడము, తెలుగు, పార్శీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో కన్పిస్తాయి. ఒక భాష నుండి మరొక భాషలోకి శాసనాలు జారీ అయిన పరిణామ క్రమ దశలు ఫణిగిరి వంటి ప్రాంతాలలో గమనించవచ్చు. యిప్పటిదాకా లభించిన శాసనాలలో తొలి ప్రాకృత శాసన శకలం "దేవానాం" అన్న మౌర్యుల నాటిది. ఇది మంజీరా పరీవాహ ప్రాంతంలో లభించినది. అట్లే తొలి సంస్కృత శాసనం అభీర వాసుదేవుడు వేయించిన నాగార్జున కొండ శాసనం. తొలి తెలుగు శాసనంబీ 4, 5 శతాబ్దాలుగా గుర్తించబడిన కీసర గుట్టలో లభించిన "తొలుచువాండ్రు" – మనకు రెండు భాగాల్లో యివ్వబడ్డ ద్విభాషా శాసనాలు, (సంస్కృత ప్రాకృతము, కన్నడం, సంస్కృతము, తెలుగు కన్నడము, తెలుగు పార్శీ, యిట్లా) తెలంగాణాలో లభిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో ముఖ్యంగా గత 5, 6 సంవత్సరాల నుండి తెలంగాణాలో శాసన పరిశోధనలపై ఎక్కువ మక్కువ చూపుతున్న యువకులు,

పరిశోధక సంస్థలు కొత్త కొత్త శాసనాలని కనుక్కొని పరిష్కరిస్తున్నారు. వారిలో చెప్పుకోదగ్గవారు కొత్త తెలంగాణా చరిత్ర బృందం వారుబీ ప్రిహా సంస్థవారు. ఆసక్తి కరంగా ప్రిహా సంస్థ బాధ్యుడు డా. యం. ఎ. శ్రీనివాసన్ మంజీరా నదీ పరీవాహ ప్రాంతాన్ని తమ కార్యక్షేత్రంగా అనేక ప్రాకృత శాసన శకలాలు కనుగొన్నారు. వాటిలో ఓ నమోబుద్ధాయ, మాధవ చందా, ఓ జమ, ధమ్మ, దేవానాంబీ హిమ బుదియ ముఖ్యమైనవి. "దేవానాం శాసన శకలం యిక్కడ మౌర్య అశోకుని పాలనని గుర్తు చేస్తుంది. ఇంకా వెతికితే మంజీరా ప్రాంతంలో అశోకుని శాసనమే లభించవచ్చని వీరి నమ్మకం. అట్లాగే ఎపిగ్రఫీ డైరెక్టర్ డా. మునిరత్నం రెడ్డి గారు పరిష్కరించి ప్రకటించిన మక్కట్రావుపేట ప్రాకృత శాసనంలో అహిమక (అస్సక జనపదానికి రూపాంతరం) మహాజన ప్రస్తావన ఉన్నది. దక్షిణ భారత దేశంలోని ఏకైక మహాజన పదం ప్రస్తావన ఉన్న ఏకైక శాసనం మన తెలంగాణాలో లభించడం అత్యంత ఆసక్తికరమైన, గర్వ కారణమైన విషయం. మనకు తెలంగాణకి ఒకవైపు కర్ణాటక, మరొక వైపు మహరాష్ట్రలు సరిహద్దులుగా వున్నాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలో కన్నడ, తెలుగు భాషలలో శాసనాలు లభిస్తున్నాయి గానీ, మహరాష్ట్ర సరిహద్దులలో మరాఠీ శాసనాలు లభించడంలేదు. ఇది పరిశీలించాల్సిన విషయం. శ్రీయుత కందకుర్తి యాదవరావుగారిచ్చిన సమాచారం ప్రకారం నిజామాబాద్లో రెండు మరాఠీ శాసనాలు లభించాయి. అందులో ఒకటి తొలి మరాఠీ శాసనం. అట్లే మరాఠీ భాష మధ్యయుగాల చివరి నుండి వృద్ధి చెందినది. అందుకనే దేవగిరి యాదవుల వంటి వారు మన తెలంగాణాకు వలస వచ్చి స్థిరపడ్డా, తెలుగులోనో, సంస్కృతంలోనో శాసనాలిచ్చారు కానీ మరఠీలో కాదు.

ఇక శాసనాలు వేయించిన రాజవంశాల విషయానికి వస్తే తెలంగాణాను పాలించిన రాజవంశాలన్నింటివి లభిస్తున్నాయి. పూర్వశాతవాహనులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, ఆభీరులు, విష్ణుకుండిలు, వాకాటకులు, బాదామి చాళుక్యులు, వేములవాడచాళుక్యులు, ముదిగొండచాళుక్యులు, వేంగిచాళుక్యులు, రాష్ట్రకూటులు, కళ్యాణీచాళుక్యులు, కాకతీయులు, వారి సామంతులైన విరియాల, మల్యాల, రేచర్లరెడ్డి, చెరకురెడ్డి, కందూరుచోడ, కాయస్థ, గోనరెడ్డి, పరమార, పొలవాస ప్రముఖులు, యాదవ వంశస్థులు, ఆ తర్వాత వచ్చిన పద్మనాయకులు,

గజపతులు, విజయనగర రాజులు, ముసునూరి వంశస్థులు, బహమనీలు, మొఘలులు, కుతుబ్షాలు, అసఫీజా వంశస్థుల శాసనాలు తెలంగాణాలో లభిస్తున్నాయి.

తెలుగు జాతి మొత్తాన్ని ఒకే రాజకీయ ఛత్రం కిందకి తెచ్చి పాలన చేసిన రాజవంశాలు 4. అవి 1. శాతవాహనులు, 2. విష్ణుకుండిలు (ఉత్తర తెలంగాణా మినహా), 3. కాకతీయులు, 4. కుతుబ్షాలు. ఆసక్తికరంగా 'ఈ నాలుగు రాజ వంశాల జన్మ స్థలాలు, విజృంభణ, విస్తరణ తెలంగాణా ప్రాంతంనుండే' అని తెలంగాణా శాసనాలని బట్టి చెప్పవచ్చు. కోటిలింగాల నాణెములు, మక్కట్రావుపేట శాసనాధారంగా శాతవాహనుల జన్మస్థలం కోటిలింగాల అని, అక్కడి నుండే వారు విస్తరించారని చెప్పవచ్చు. అట్లాగే విష్ణుకుండిల తామ్రశాసనాల ఆధారంగా వీరు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట వలిగొండల మధ్యగల తుమ్మలగూడెం అని పిలవబడుతున్న ఇంద్రపాల నగరం లేక ఇందుపురేల. వీరు ఇక్కడినుండే విస్తరించారు. అట్లే కాకతీయులు తొలుత రాష్ట్రకూటులకు, కళ్యాణీ చాళుక్యులకు తెలంగాణాలోని వివిధ ప్రాంతాలలో సామంతులుగా ఉండి, కామవసాని సాయంతో అనుమకొండ ప్రాంతాన్ని పొంది, అక్కడినుండి విజృంభించి విస్తరించారు. ఇక కుతుబ్షాలు తెలంగాణాలోని గోల్కొండ కేంద్రంగా విజృంభించి విస్తరించారు. వీరిలో విష్ణుకుండిల జన్మస్థలం గురించే గొప్ప వివాదాలు, సుదీర్ఘ చర్చలు నడిచాయి.

గతంలో విష్ణుకుండిల జన్మస్థలం ఆంధ్ర ప్రాంతంలోని వినుకొండ, వేల్పూరు, అమరావతి, విజయవాడ,పెదవేగి ప్రాంతాలని భావించి, చరిత్ర రచన గావించారు. కానీ, బి.యన్. శాస్త్రిగారు 1965 జూన్ నెల భారతి మాస పత్రికలో "విష్ణుకుండిన గోవింద వర్మ ఇంద్రపాల నగర తామ్ర శాసనము"ని ఒక వ్యాసము, జులై నెల భారతిలో "విష్ణుకుండిన విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాలనగర తామ్ర శాసనమని మరొక వ్యాసం రాసి, అందులో తాము సంపాదించి, పరిష్కరించిన రెండు కొత్త తామ్ర శాసనాలని ప్రకటిస్తూ విష్ణుకుండిల జన్మస్థలం తెలంగాణా ప్రాంతమని, అదికూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట, వలిగొండ ప్రాంతాల మధ్యనున్న తుమ్మలగూడెం అని, ఈ తుమ్మలగూడెం అసలు

పేరు ఇంద్రపాల నగరమని (ఇందుపురేల) నిరూపించారు. ఈ రాగిరేకులు దొరికిన విధానము, వీటిని ప్రకటించిన తర్వాత జరిగిన పరిణామాల గురించి శాస్త్రిగారు తమ ఆత్మకథ (అముద్రితం)లో రాసుకున్నారు. దాని ప్రకారం ఈ రాగిరేకులు నాగారం గ్రామవాస్తవ్యులైన శ్రీ తుమ్మళి ఆంజనేయులుగారు తమ పొలము పక్కనున్న పాడుబడ్డ బావిలో పూడిక తీయిస్తుండగా లభించాయి. (ఇది 1965 నాటి భారతిలో ప్రచురించబడ్డది). రేకులు పూర్తిగా చిలుముపట్టి, కొన్నిచోట్ల అక్షరాలు చెరిగిపోయి ఉన్నాయి. ఆంజనేయుల గారి నుండి అవి పి. రాజారావు గారి వద్దకు, వారి వద్దనుండి శ్రీ రామమనోహరరావుగారివద్దకు చేరాయి. ఈ రామమనోహర రావుగారు శాస్త్రిగారికి మంచి మిత్రులు. అప్పటి తెలంగాణా ఆంధ్ర మహాసభకి అధ్యక్షులు. బూర్గుల రామకృష్ణరావుగారికి బావమరిది, మందుముల నరసింగరావు గారికి సోదరుడు. శాస్త్రిగారి వద్దకు రాగి రేకులు వచ్చాయి గానీ, వాటికి వుండే కడియం, రాజముద్రికలు ఎక్కడో పడిపోయాయి. వాటికోసం బావిలో మరొక గజంలోతు పూడిక తీయించారు కానీ దొరకలేదు. ఆ చుట్టు పక్కల ప్రాంతమంతా వెతికారు కానీ లభించలేదు. ఈ రాగి రేకులు శాస్త్రిగారి వద్దకు చేరాక, శ్రీమాన్ ఈ యున్న వెంకటవీరరాఘవాచారిగారు శాస్త్రిగారి వద్దకు వచ్చి, "మీరు తెలంగాణా వాళ్ళు కదా! మీకు శాసనాలు చదవడం అందులోనూ బ్రాహ్మీలిపి చదవడం రాదు కదా? ఈ తామ్రశాసనాలని డా. నేలటూరి వెంకట రమణయ్య గారికి యివ్వండి. పరిష్కరించి పెడతారు. అంత పెద్దమనిషి అడిగారు, యివ్వడం సమంజసం కదా"! అన్నారట. దానికి బి. యన్. శాస్త్రి నిరాకరించి, "నాకు శాసనాలు చదవడం వచ్చు. బ్రాహ్మీ లిపి రాకుంటే నేర్చుకొని వీటిని పరిష్కరిస్తాను గానీ, మీకు నేలటూరి వారికి యివ్వను" అన్నారట. ఆ తర్వాత పట్టుదలతో అనతి కాలంలో బ్రాహ్మీలిపిపై పట్టుసాధించి, తుమ్మల గూడెం శాసనాలని పరిష్కరించి 1965 మే నెలలో భారతి మాస పత్రికకు పంపారు. అవి వరుసగా జూన్, జులై నెలలలో ప్రచురించబడ్డాయి. దీంతో చరిత్ర కారుల దృష్టి శాస్త్రిగారి మీద, తుమ్మలగూడెం రాగి రేకుల మీద పడ్డది. అప్పుడే డా.మారేమండ రామారావు శాస్త్రి గారి వద్దకు వచ్చి, ఈ రాగిరేకుల ప్రతులు అచ్చులు తీసుకొని పోయి, "A New light on Vishnukundins" అన్న వ్యాసాన్ని జర్నల్ ఆఫ్ ఇండియన్ హిస్టరీలో ప్రచురించారు. వీరు శాస్త్రిగారి అభిప్రాయంతో కొంత విబేధించారు. దీనితో ఆంధ్రా

చరిత్రకారులు చాలామంది "తెలంగాణాలో విష్ణుకుండిల రాజ్యమేమిటి? వారి జన్మస్థలమేమిటి? రాజధాని ఏమిటి? విష్ణుకుండిల రాజధాని దెందులూరు. విజయవాడ వేల్పూరులు వీరి ఉపరాజధానులు కదా? విష్ణుకుండిల రాగి రేకులన్నీ ఆంధ్ర, తీరాంధ్ర ప్రాంతంలో కదా లభిస్తున్నది? ఈ తుమ్మలగూడెం రాగిరేకులేమిటి? ఇవి దొంగ శాసనాలు, కూటశాసనాలు. శాస్త్రిగారే వీటిని తయారు చేయించారు" అని ప్రచారం చేయడం మొదలెట్టారు. అప్పట్లో శాస్త్రిగారు ఈ విషయంలో అనేక అనుమానాలు, అవమానాలు ఎదుర్కొన్నారు. ఈ ప్రచారాలకి అడ్డుకట్టవేస్తూ శాస్త్రిగారు సుదీర్ఘ వ్యాసాలు రాసి, వుపన్యాసాలు యివ్వాల్సి వచ్చింది. ఈ వివాదాలు నాటి డైరెక్టర్ ఆఫ్ ఎపిగ్రఫీ, గవర్నమెంట్ ఇండియా. డా. ఘాయ్ గారి వద్దకు చేరాయి. ఒక రోజు ఘాయ్గారి నుండి శాస్త్రిగారికి ఒక ఉత్తరం వచ్చింది. దాని సారాంశం – ఘాయ్గారు త్వరలో హైదరాబాద్ వచ్చి ఈ రాగి రేకులు పరిశీలిస్తారని. అనుకున్న ప్రకారమే ఘాయ్గారు హైదరాబాద్ వచ్చి మూడు రోజులు బస చేసి, ప్రతిరోజూ శాస్త్రిగారింటికి వచ్చి, ఈ రాగి రేకులని పరిశీలించి, "ఇవి దొంగశాసనాలు కావు, కూట శాసనాలు కావు, ఒరిజినల్వే, విష్ణుకుండిలవే" అని నిర్ధారణ చేసి, విద్యానగర్లోగల కేంద్ర పురావస్తు శాఖవారిప్రాంతీయ కార్యాలయంలో వీటి ఫోటోలు తీసుకొని పోయారు. ఇంత జరిగినా, ఘాయ్ అంతటివాడు చెప్పినా, యింకా కొందరు చరిత్రకారులు ఈ శాసనాలు దొంగ శాసనాలన్నట్టుగానే రాస్తున్నారు. ఆ మధ్య ఏ.పి. హిస్టరీ కాంగ్రెస్ వారు ప్రచురించిన కాంప్రెహెన్సివ్ హిస్టరీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్లో విష్ణుకుండిల అధ్యాయంలో రచయిత కృష్ణప్రసాద్ వీటిని కూట శాసనాలనే రాశారు. ఎవరేమన్నా పట్టించుకోక శాస్త్రిగారు విష్ణుకుండిల యితర శాసనాలను తుమ్మల గూడెం శాసనాలతో సరిపోల్చుతూ పరిశోధనలు చేసి విష్ణుకుండిల చరిత్ర రచన చేశారు. ఈ రోజున చాలామంది చరిత్ర కారులు విష్ణుకుండిల జన్మస్థలం తుమ్మల గూడెం అని రాయకుండా వుండలేని పరిస్థితి వచ్చింది.

అసలు తెలంగాణలో మొట్టమొదట శాసన పఠనం పరిష్కరణ ఎప్పుడు జరిగింది? ఎవరు చేశారు? అన్న విషయాలు ఆసక్తి కరంగా వుంటాయి. అలాగే ప్రముఖ శాసనాలు బయల్పడ్డ విధానం వాటి ప్రాముఖ్యతలు కూడా ఆసక్తిగానే వుంటాయి.

డా. పరబ్రహ్మ శాస్త్రిగారు తమ "కాకతీయాస్" అన్న గ్రంథంలో తెలంగాణాలో శాస్త్రీయమైన శాసన పరిశోధన 1882లో జె. యఫ్. ఫ్లీట్ హనుమకొండ వేయిస్తంభాల గుడిశాసనం చదివి పరిష్కరించడంతో ఆరంభమైనదని రాశారు. కానీ, దీనిపై యింకా లోతుగా పరిశోధన చేసిన డా. కొండ శ్రీనివాసులు (ఒంగోలు) గారి అభిప్రాయంలో వేయిస్తంభాల గుడిశాసనాన్ని 1882 కంటే ముందే ఫ్లీట్ కన్నా ముందే యితర పండితులు చదివి పరిష్కరించారు. పరబ్రహ్మశాస్త్రి గారు చెప్పినట్లు 1882లో ఫ్లీట్ వేయి స్తంభాల గుడిశాసనం చదవడం వెనక పాల్వంచ రాజావారు రాజా అశ్వారావు గారి పాత్ర వున్నదని చెబుతారు. పాల్వంచ రాజా ధర్మ వెంకట అశ్వారావుగారు తమ సంస్థాన విషయాల వివాదాల గురించి, యితర వ్యవహారాల కోసం ఎక్కువగా కలకత్తాలో అదీ ఆంగ్లేయులతో వుండేవారు. ఆ సమయంలో వారు హనుమకొండ వేయిస్తంభాలగుడి శాసనం గురించి ఆంగ్లేయులకి తెలుపగా జె. యఫ్. ఫ్లీట్ హైదరాబాద్ నిజాం నుండి ప్రత్యేక అనుమతులు పొంది శాసనశిల అచ్చుప్రతులు తీసుకొని, పరిష్కరించి ఇండియన్ యాంటిక్వేరీ వాల్యూం XI, జనవరి 1882లో ప్రకటించారు. వీరు తమకి శాసన ప్రతిబింబాలు తీయడంలో సహకరించిన నిజాం రాజ్య అధికారులకి ధన్యవాదాలు కూడా తెలిపారు. అసలు పాల్వంచ రాజావారు ఈ శాసనంలో తమ సంస్థానానికి చెందిన విషయాలేమైనా వుంటాయేమోనని దీన్ని చదివించారని మరొక గాథ ప్రచారంలో ఉన్నది. డా. కొండ శ్రీనివాసులు గారి అభిప్రాయంలో తెలంగాణాలో శాస్త్రీయంగా శాసన పరిష్కరణ వేయిస్తంభాల గుడి శాసనంతో అయినా అది మెకంజీ దగ్గర నుండి ఆరంభమైంది. ఈ శాసనాన్ని పదిమంది ప్రకటించారు. వీటిని సుమారు 11 మంది విభిన్న గ్రంథాలలో వినియోగించుకున్నారు.

1. కల్నల్ కాలిన్ మెకంజ - Vol XXXII

2. జేమ్స్ ప్రిన్సెప్ – Journal of Asiatic Society of Bengal, Oct 1838

3. సి. పి. బ్రౌన్ – లోకల్ రికార్డ్స్ Vol XLV; XLVI

4. బావుదాజీ – Transcript and Translation of king Rudradeva's Inscription at Anumakonda -The Journal of Bombay branch of Royal Asiatic Society Vol X 1875.

5. J.F ఫ్లీట్ - Indian Antiquery Vol. XI Jan 1882

6. శేషాద్రి రమణ కవులు – రుద్రదేవుని అనుమ కొండ శాసనము – భారతి – ఏప్రిల్ 1929

7. విద్వాన్ కంభంపాటి అప్పన్న శాస్త్రి –అచింతేంద్రవరవిరచితమైన వేయిస్తంభాల గుడిశాసనము – పూలతోట గ్రంధమాల, హన్మకొండ 1934.

8. తెలంగాణా శాసనములు; సంపుటి I – లక్ష్మణరాయ పరిశోధక మండలి హైదరాబాద్; దక్కన్ (1935) వేపా రామేశంగారి ప్రస్తావన

9. యన్. వి. రమణయ్య – No. - 36; Inscriptions of Andhra Pradesh, Warangal District, Hyderabad 1974

10. పి.వి. పరబ్రహ్మశాస్త్రి – Anumakonda Inscription of Kakati Rudradeva - A Review; Journal of the Andhra Historical Research Society Vol XXXVI Part I 1975

11. శివలెంక శ్రీ రామచంద్రమూర్తి – No.-16. Anumakonda Inscritpions -inscriptions of Kakatiyas of Warangal. I. C. H. R., Bangalore 2011.

ఇందులో తెలంగాణా శాసనాలు సంపుటి I లోది అంతకు ముందు ఫ్లీట్ పరిష్కరించినది. అట్లే శ్రీరామచంద్రమూర్తి గారు అంతకు ముందు నేలటూరి వారు పరిష్కరించినది తీసుకున్నారు.

మిగిలిన వారంతా ఎవరి పాఠాంతరం వారే చేశారు. ఇక్కడ మనం గ్రహించాల్సిన విషయం – మన తెలంగాణా శాసనాన్ని యింతమంది వేరువేరుగా గ్రంధస్తం చేయడం, దాన్ని గురించి చర్చించడం ఆసక్తికరమైనదే గాక, అరుదైనది కూడా.

[సహృదయంతో తమ పరిశోధక విషయాలనందించిన డా. కొండ శ్రీనివాసులుగారికి కృతజ్ఞతలు]

అట్లే కోటగిరి తామ్ర శాసనాలు వెలుగు చూసిన విధానం, వాటి ప్రాముఖ్యత ఆసక్తి కరమైనది. అజ్ఘర్ ఆలీఖాన్– నిజామాబాద్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్

(కలెక్టర్) 3 రాగిరేకులు హైదరాబాద్ పంపారు. అవి బోధన్ తాలూకాలోని బిర్కూర్ అనే జాగీర్ గ్రామంలో గల చేపలచెరువులో చేపలు పడుతున్న బాలూగా అనే బోయవానికి వలలో అనుకోకుండా దొరికాయి. అవి ప్రాంతీయ పోలీస్ అధికారికి అందచేయపడ్డాయి. అ పోలీస్ అధికారి వాటిని నిజామాబాద్ జిల్లా అధికారికి పంపారు. వారు వాటిని హైదరావాద్ పురావస్తుశాఖకి పంపారు. అప్పటి పురావస్తు శాఖ డైరెక్టర్ గులాం యాజ్దానీ ఐరోపా టూర్లో వున్నందున అవి ఇన్చార్జిగా వున్న బిగ్రామీకి అందచేయబడ్డాయి. వారు ఆ రాగిరేకులను బార్నెట్కి పంపగా, వారు వాటిని పరిష్కరించమని నిజాం కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ యస్. హనుమంతరావుకి పంపారు. ప్రొఫెసర్ హనుమంతరావు ఛాదర్ఘాట్ హైస్కూల్లో పనిచేస్తున్న పండిట్ లక్ష్మీకాంతశాస్త్రిగారి సాయంతో పరిష్కరించి ఒక లఘు గ్రంధాన్ని (మోనోగ్రాఫ్) తయారు చేశారు. ఈ లోపల ఐరోపా యాత్ర నుండి గులాం యాజ్దానీ తిరిగొచ్చారు. వారికి ఈ రాగిరేకులు పరిష్కరించబడ్డ పాఠము అందచేయబడ్డాయి. యాజ్దానీ వాటిని భారత ప్రభుత్వ శాసన పరిశోధకులు, తెలంగాణా శాసనాలపై మక్కువ ఎక్కువ చూపే హెచ్. కృష్ణశాస్త్రిగారికి పునః పరిశీలనకై పంపారు. వాటిని పరిశీలించిన కృష్ణశాస్త్రిగారు "ఇవి అత్యంత ప్రముఖమైన రాగిరేకులని, వీటిద్వారా కాకతీయ రుద్రమదేవి గణపతిదేవుని భార్యకాదు కుమార్తె అన్న విషయం' రూఢి అవుతున్నదని, అలాగే ఈ తామ్రశాసనాల వల్ల కాకతీయులకు "విరియాల" వంశమనే బలమైన సామంత వంశముండేదని తొలిసారిగా తెలుస్తున్నదని చెప్పారు. అట్లే కృష్ణశాస్త్రిగారు యాజ్దానీని 'ఈ రాగిరేకులపై లఘు గ్రంధాన్ని ప్రచురించమని చెబుతూ పరిష్కరించిన ప్రొఫెసర్ సిరిగురి హనుమంతరావును, పండిట్ లక్ష్మీకాంతశాస్త్రిని బాగుగా పరిష్కరించారని అభినందించారు. పై విషయాలన్నీ కోటగిరి కాపర్ ప్లేట్స్ అన్న లఘు గ్రంథంలో రికార్డయ్యాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం – బిర్కూర్లో దొరికిన రాగిరేకులను "బిర్కూర్ కాపర్ప్లేట్స్" అనకుండా కోటగిరి కాపర్ ప్లేట్స్ అని ఎందుకంటారని? దానికి కారణం ఈ తామ్రశాసనంలో "కోటగిరిలో నివశిస్తున్న కాకతీయ గణపతిదేవుని సామంతుడు 'విర్యాల సూర' కోటగిరిలోని పురుషోత్తమ వైష్ణవాలయానికి, 16 మంది బ్రాహ్మణులకు వెజ్జలాపురంలో భూములు దానం చేసినట్లుగా చెప్పబడ్డది. ఈ విరియాల సామంత సూర కోటగిరినుండి

దానమిచ్చినందున వీటిని “కోటగిరి కాపర్ ప్లేట్స్” అంటాము. ఈ కోటగిరి బోధన్ దగ్గరగల ‘కోడ్గిర్’గా చరిత్రకారులు గుర్తించారు. ఇవి 1925లో నిజాం రాష్ట్ర పురావస్తుశాఖ వారిచే ప్రచురించ బడ్డాయి.

ఇక్కడ గమనించాల్సిన మరొక ఆసక్తికర విషయం. హెచ్. కృష్ణశాస్త్రి ఈ రాగిరేకులు కాకతీయ రుద్రమదేవి గణపతి దేవుని కుమార్తె అని “రూఢి” పరుస్తున్నాయన్నారు. అంటే రాగిరేకులు పరిష్కరింపబడటానికి ముందే రుద్రమదేవి గణపతిదేవుని కుమార్తె అన్న ఆధారం లభ్యమై వుండాలి. అది మల్కాపూర్ శాసనం. 1917లో ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారిచే కనుగొనపడ్డది. అందులో రుద్రమ గణపతిదేవుని కుమార్తె అని రాయబడ్డది. 1917 నాటి ఎ.ఆర్. [వార్షిక నివేదిక]లో ఈ విషయం పేర్కొనబడ్డది. అందుకనే కృష్ణశాస్త్రి 1917 కనుగొనబడ్డ మల్కాపురం శాసనంలోని విషయాన్ని మన కోటగిరి తామ్రపత్రాలు రూఢి పరుస్తున్నాయన్నారు. ఈ మల్కాపురం శాసనం 1927లో ప్రకటించబడ్డది. అట్లే కృష్ణశాస్త్రిగారు ప్రొ. హనుమంతరావుని, పండిట్ లక్ష్మీకాంతశాస్త్రిని ప్రత్యేకంగా అభినందించారు. బహుశ పండిట్ లక్ష్మీకాంతశాస్త్రి హైస్కూలు అధ్యాపకుడు కాగా ప్రొ. హనుమంతరావు నిజాం కళాశాల అధ్యాపకులు. శాసన పరిశోధనలో, పరిష్కరణలో వారి హెూదాలు, ‘అహోలు’ పక్కన పెట్టారు. ఇది మిక్కిలి ఆదర్శప్రాయము. ముఖ్యంగా నేటితరానికి – అలాగే ఈ శాసనం ద్వారా మొదటిసారిగా బయల్పడిన మరో విషయం విరియాల వంశము. అసలు కాకతీయులు అంత గొప్పవారు కావడానికి ఒకానొక కారణం వారికున్న పరాక్రమవంతులైన సామంతులు . అలాంటి వారిలో ప్రముఖులు ఈ విరియాల వంశస్థులు. ఈ విర్యాల వంశానికి చెందినదే కామసాని లేక కామవసాని. ఈమె కాకతీయులకు హనుమకొండ విషయాన్ని యిప్పించడంలో మిక్కిలి సాయపట్టదని గూడూరు శాసనం ద్వారా తెలుస్తున్నది. ఈ విర్యాల వంశమే లేకుంటే, కామవసానియే లేకుంటే కాకతీయులకి హనుమకొండ దక్కేదే కాదని చెప్పవచ్చు.

**ముదిగొండచాళుక్య వంశము :–** 10వ శతాబ్దిలో నేటి ఖమ్మం జిల్లాలోని ముదిగొండని రాజధానిగా పరిపాలన చేసిన రాజవంశం ఈ ముదిగొండ చాళుక్యవంశం. తొలుత వీరు వేంగి చాళుక్యులకు సామంతులుగా వుండి తర్వాత

కళ్యాణిచాళుక్యుల కింద సామంతులుగా, కొంతకాలం స్వతంత్రులుగా కొరివి ప్రాంతాన్ని పరిపాలించారు. అసలు ముదిగొండ చాళుక్య వంశం అన్న వంశం వున్నదన్న విషయం బయల్పడటమే ఆసక్తికరమైనది.

1899 మార్చిలో నిజాం ట్రజరీ ఉద్యోగికి మిత్రుడైన సి. బెండాల్ అనే కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో సంస్కృత ప్రొఫెసర్ నిజాం ట్రజరీలో తనకు కాపర్ ప్లేట్స్ కన్పించినట్లు, వాటిని ఆ అధికారుల సమ్మతితో ప్రతిబింబాలు (ఎస్టాంపేజిలు) తీసుకొని, తిరిగి యిచ్చేసి, పరిష్కరించినట్లు చెప్పుకున్నారు. ఈ తామ్ర శాసనాన్ని 1903 జులై నాటి ఇండియన్ యాంటిక్వేరిలో "గ్రాంట్ ఆఫ్ కుసుమాదిత్య IV అన్న పేరుతో ప్రకటించారు. దీని ద్వారానే ముదిగొండ చాళుక్యవంశం పేరు తొలిసారిగా బయల్పడ్డది.

అట్లే కాకతీయ రుద్రమదేవి మరణ ప్రస్తావన వున్న చందుపట్ల శాసనం వెలుగు చూసిన విధం కూడా ఆసక్తికరమైనదే. గతంలో రుద్రమదేవి క్రీ.శ. 1295 వరకు రాజ్యం చేసినట్లుగా సాహిత్య ఆధారాలతో భావించారు. కానీ, నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని చందుపట్లలో లభించిన శాసనంలో మొదటిసారిగా రుద్రమదేవి మరణప్రస్తావన కన్పిస్తుంది. చందుపట్ల వాస్తవ్యులైన ప్రొ. లక్ష్మణమూర్తి, వారి సోదరుడు శ్రీరంగాచారిగారు 1966 సెప్టెంబర్ నెల భారతికి లేఖ రాస్తూ, తమ గ్రామంలో గల ముత్యాలమ్మగుడి దగ్గరున్న రాయిపై ఏవో అక్షరాలున్నాయని, దాన్ని చదవడానికి తాము విఫలయత్నం చేశామని, అది తమ గ్రామ చరిత్రకు ముఖ్య ఆధారం కావచ్చునని, రాష్ట్ర భూగర్భ విభాగం, పురావస్తు విభాగం వారు దానిని పరిశీలించి, పరిష్కరించి తమ గ్రామ చరిత్ర రచనకు తోడ్పడగలరని రాశారు. తర్వాత రంగాచారిగారు హైదరాబాద్లోని పురావస్తుశాఖ వెంటబడి, తమ ఊరిలో గల శాసనాన్ని పరిష్కరింప చేయడంలో సఫలీకృతులైనారు. సుమారు ఎనిమిదేండ్ల తర్వాత 1974 మే నెల భారతిలో ప్రముఖ శాసన పరిశోధకులు, అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తుశాఖలోని ఎపిగ్రఫీ అధికారి డా. పి.వి.పి. శాస్త్రిగారు "రుద్రమదేవి రణభూమిలో వీర స్వర్గమలంకరించెనా?" అంటూ చక్కటి వాసాన్ని రాస్తూ, చందుపట్ల శాసన పాఠాన్నిస్తూ, దాని ప్రాధాన్యతని తెలిపారు. అంతకుముందు రుద్రమదేవి క్రీ.శ.

1295 వరకు పాలించినదని భావించారు. కానీ ఈ చందుపట్ల శాసనం ద్వారా కాకతీయ రుద్రమదేవి క్రీ.శ. 1289లోనే మరణించినట్లు నిర్ధారణ జరిగింది. శాసనంలో రుద్రమదేవి, ఆమె సైన్యాధికారి మల్లికార్జున నాయుడు శివ సాయుజ్యం పొందగా, వారికోసం 'బంటు పువ్వులముమ్మడి చందుపట్లసోమనాథ దేవరకు భూదానము చేసినట్లుగా చెప్పబడ్డది. రాణి, సేనానాయకుడు ఒకేసారి మరణించడం యుద్ధరంగంలోనో, యుద్ధ సన్నాహ కార్యక్రమాలలోనో లేక శత్రువుల కుట్రలోనో సాధ్యము. కనుక చందుపట్ల శాసనాధారంగా రుద్రమ యుద్ధంలోనో, యుద్ధసన్నాహ కార్యక్రమాల్లోనో మరణించిందని చెప్పవచ్చు. ఈ శాసనంలో రుద్రమ మరణ ప్రస్తావన వున్నదే గానీ, ఎట్లా మరణించింది, ఎక్కడ మరణించింది మున్నగు విషయాలు లేవు. శాసనకాలము 1289 నవంబర్ 27 కావున రుద్రమ 1295 వరకు రాజ్యం చేయలేదని, ఈమె 1289 లోనే మరణించినదని చెప్పవచ్చు. అప్పుడు కాకతీయ రుద్రమ పరిపాలనా కాలము క్రీ.శ. 1262 నుండి 1289 వరకే. ఈ శాసనాన్ని చరిత్ర ప్రియులు శాసన ప్రియులు, మనోహర్ ప్రసాద్, ముక్తేశ్వరరావు, పురుషోత్తమ రెడ్డి వంటి నల్లగొండజిల్లా కలక్టర్లు, శివనాగిరెడ్డి, చెన్నారెడ్డి వంటి పురావస్తుశాఖ సిబ్బంది, చందుపట్ల వివేకానంద యువజన సంఘ సభ్యులు, కోటగిరి దైవాధీనం వంటి పత్రికా ప్రతినిధులు అక్కడే, అది లభించిన ప్రదేశంలోనే ఎత్తైన వేదికను గ్రనైట్ రాళ్ళతో నిర్మించి, దానిపై భద్రపరిచారు. బహుశ మన తెలుగు రాష్ట్రాలలో ఒక చారిత్రక శాసన శిలను, ఒరిజినల్ దాన్ని, లభించిన చోటే భద్రపరచడం ఇదే ప్రథమం. దీని తర్వాత తెలంగాణా ప్రస్తావన తొలిసారిగా కనిపించే తెల్లాపూర్ శాసనాన్ని గూడూరు శాసనాలని కూడా వేదికలు కట్టి చక్కగా భద్రపరచారు. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం మన రాష్ట్ర గవర్నర్ తమిళిసైగారు కూడా ప్రత్యేకంగా "చందుపట్ల శాసనాన్ని సందర్శించి, పూలమాలలు సమర్పించడం". ఈ చందుపట్ల శాసనం గురించి మరొక ఆసక్తికర విషయం – చాలా ఏండ్ల తర్వాత ఎం. ఎ. తెలుగు వారికి దీన్ని పాఠ్యాంశంగా (దూర విద్య విద్యార్థులకు) పెట్టారు. ఇక్కడ బాధాకరమైన విషయం ఏమంటే ఈ చందుపట్ల శాసనం నిజమైనది కాదని, శాసన పాఠానికి చెప్పిన అర్థాలు తప్పని, నాలుగైదేళ్ళక్రితం ముప్పాళ్ళ హనుమంతరావు అనే విశ్రాంత చరిత్రోపన్యాసకులు గుంటూరు నించి ఆంధ్రజ్యోతికి వరుసగా నాలుగైదు వ్యాసాలు రాశారు. కానీ,

దాన్ని అనేక మంది పరిశోధకులు, పండితులు ఖండించి, ముప్పాళ్ళ వారి వాదాన్ని తోసిరాజన్నారు. బహుశ ముప్పాళ్ళవారు ప్రాంతీయ భావాలతో ఈ వాదాలు చేసుంటారనిపిస్తోంది. అన్నట్లు ఈ మధ్యనే మరో రెండు శాసనాలు,రుద్రమమరణం గురించినవి బయల్పడ్డాయి.

తెలంగాణా శాసనాలలో మరొక ఆసక్తికర విషయం శాసన సాహిత్యం. తెలంగాణా శాసనాల్లో చక్కటి తెలుగు, సంస్కృత సాహిత్యం కన్పిస్తుంది. అసలు తెలుగులో మొట్టమొదటి కందపద్యాలు కనిపించేదే తెలంగాణా శాసనాలలో. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బొమ్మలమ్మ గుట్టలోని కుర్క్యాల శాసనంలో మనకి మొదటిసారిగా కందపద్యాలు కనిపిస్తాయి. జినవల్లభుని ఈ శాసనం క్రీ.శ. 945 నాటిది. ఆ తర్వాత కరీంనగర్, పరడ, పానగల్లు, అడవిదేవులపల్లి మున్నగు అనేక శాసనాలలో అద్భుతమైన ఛ్ఛందోసాహిత్యం కనిపిస్తుంది. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని బూధ్పూర్, వర్ధమానపురం శాసనాలలో చక్రబంధాలు వేసిన పద్యాలు కనిపిస్తాయి. కాకతీయుల నాటి శాసనాలలో అద్భుత సాహిత్యం కనిపిస్తుంది. వరంగల్లోని ఉర్సు గుట్టలో రాతిపై సంస్కృత కావ్యాలు చెక్కబడ్డాయి. వీటిని రచించినవాడు నరసింహ ఋషిగా గుర్తించారు. ఈ కావ్యాలలో ఒక దాన్ని సిద్ధోద్వాహం పేర పరబ్రహ్మశాస్త్రిగారు తెలుగులోకి అనువదించారు. ఈ శాసనాల్లోని సాహిత్యం కాళిదాసు కావ్యాలకి ఏ మాత్రం తీసిపోవని పండితుల అభిప్రాయం. రెండు కావ్యాలను గోడలపై చెక్కడం మనకు తెలంగాణాలోనే కన్పిస్తుంది.

* * *

ప్రత్యేక తెలంగాణా ఉద్యమ ఫలితంగా తెలంగాణా ప్రజలు, ముఖ్యంగా యువకులు తమ తమ మూలాలను వెతుక్కునే క్రమంలో చారిత్రక విషయాలను పరిశోధించడం మొదలెట్టారు. దానివల్ల ఒక గొప్పఫలితం వచ్చింది. అదే శాసనాల అన్వేషణ, పరిష్కరణ. దాదాపు ప్రతి గ్రామంలోని యువకులు తమ గ్రామ చరిత్రను, తద్వారా తెలంగాణా చరిత్ర, ఔన్నత్యాలను వెలికి తీసే ప్రయత్నాలు మొదలెట్టారు. దాని ఫలితంగా అనేక నూతన చారిత్రక ప్రదేశాలు, శాసనాలు బయల్పడటం మొదలయ్యింది. పదుల సంఖ్యలో యువకులు, మేధావులు ఈ నూతన

ఆవిష్కరణలలో తలమునకలవుతున్నారు. అలాగే పాత ఆవిష్కరణలకి నూతన అర్థాలు, ప్రతిపాదనలు చెయ్యనారంభించారు. ఇది చాలా గొప్ప శుభపరిణామము. కానీ, ఇక్కడే మరొక సమస్య ఆరంభమౌతోంది. ఒక చారిత్రక స్థలాన్ని, శాసనాన్ని ఎవరికి వారే తామే ముందు చూశామంటే, తామే ముందు కనుగొన్నామని అనవసరమైన తప్పుధోరణులకి తావిచ్చి తెలంగాణా చరిత్ర రచనకి కొంత అడ్డంకులను, సమస్యలను తెచ్చిపెడుతున్నారు. అట్లుగాక, ఎవరు ఏ నూతన అంశాన్ని కనుక్కున్నా, గమనించినా దాన్ని తక్షణమే ప్రాచుర్యంలో వున్న పత్రికలలో ముద్రింప చేస్కుంటే అవసరమైన గొడవలకు తావివ్వని వారమౌతాము. అట్లాగే, ఒకసారి బయల్పడిన శాసనము గానీ, యితర చారిత్రక ఆధారము గానీ, సమాజంలో అందరికీ చెందుతుంది కానీ, ఏ ఒక్కరికీ ప్రత్యేకంగా చెందదు. ఏ ఒక్కరికీ దానిపై ప్రత్యేక హక్కులుండవు. దాని విశ్లేషణపై ఎవరి అభిప్రాయాలు వారివి. పరిష్కరణలో, పాఠ్యపఠనంలో (Reading) బేధాలెక్కువగా వుంటే చక్కగా సామరస్యంగా పరిష్కరించుకుంటే సందేహాలు, సమస్యలు లేని 'తెలంగాణా సమగ్ర చరిత్ర' రచనకి దోహదపడ్డ వాళ్ళమౌతాము. ఉదాహరణకు మెకంజీ మొదటిసారిగా పరిష్కరించి ప్రకటించిన వేయిస్తంభాల గుడి శాసనాన్ని పది మంది వారి వారి పంథాలో పరిష్కరించి, ప్రచురించారు. చిన్న చిన్న బేధాలతో అందరి పరిష్కరణ ఒకే తీరుగా వుండి, ఒకే రకమైన ముగింపుకి వచ్చారు. ఇది ఆరోగ్యకరమైన స్పర్థ, చరిత్ర రచనకి దోహద పడుతుంది.

కల్నల్ మెకంజీ నుండి నేటి వరకు సుమారు 40 మంది శాసన పరిశోధకులు తెలంగాణా శాసనాలను పరిష్కరించి, ప్రకటించారు. వారిలో ఫ్లీట్, మానవల్లి రామకృష్ణ కవి, గడియారం రామకృష్ణ శర్మ, శేషాద్రి రమణ కవులు, సిరిగురి హనుమంత రావు, ఆదిరాజు వీరభద్ర రావు, కంభంపాటి అప్పన్నశాస్త్రి, యింకా పురావస్తుశాఖలో శాసన పరిష్కర్తలుగా నేలటూరి వెంకట రమణయ్య, పి.వి.పి. శాస్త్రి, ముకుందరావు, యన్, రమేశన్, యన్. యస్. రామచంద్రమూర్తి, వెంకటరత్నం మున్నగువారు తెలంగాణా జిల్లాల శాసన సంపుటాలు వెలువరించారు. కానీ, శాసనాల శాస్త్రిగా పేరు పొందిన బి. యన్. శాస్త్రి గారిని వీరి కన్నా ప్రముఖంగా చెప్పాలి. కారణం–పైన పేర్కొనబడిన వారిలో చాలామంది తెలంగాణా ప్రాంతేతరులు, వృత్తిరీత్యా శాసన పరిష్కర్తలు. కానీ, బి. యన్. శాస్త్రి గారు

“తెలంగాణా శాసనాలు పరిష్కరించిన తొలి తెలంగాణా బిడ్డ, శాసన పరిశోధకులు”. వీరు విష్ణుకుండిల తుమ్మలగూడెం శాసనాలను పరిష్కరించడమే గాక తెలంగాణాలోని వందల శాసనాలను పరిష్కరించారు. ఒక్క శాసనాలపైననే 12 గ్రంథాలు వెలువరించారు. శాసన పరిష్కరణ వీరి వృత్తికాదు ప్రవృత్తి. ఆ ప్రవృత్తి కోసమే జీవితం అంకితం చేశాడు. శాసన సంపుటాలతో పాటు ఆంధ్రుల చరిత్రపై మూడు సంపుటాలు, భారత దేశ చరిత్రపై 22 సంపుటాలు, జిల్లా సర్వస్వాలు వెలువరించారు. కొన్ని విశ్వవిద్యాలయాలు, మరికొన్ని అకాడమీలు చేయాల్సిన పనిని శాస్త్రిగారొక్కరే ఒంటి చేత్తో నిర్వహించారు. వీరి తర్వాత మరలా ఈ మధ్య కాలంలో తెలంగాణాలో జన్మించిన ఔత్సాహికులు కొందరు శాసన పరిశోధన, పరిష్కరణ చేస్తున్నారు. వారిలో పేర్కొన వలసినవారు. ద్యావనపల్లి సత్యనారాయణ, శ్రీ రామోజు హరగోపాల్లు.

**ప్రస్తుతం తెలంగాణా శాసన పరిశోధకులు చేయవల్సిన కార్యక్రమాలు** :

1. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్నగర్, మెదక్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ మున్నగు ఆరుజిల్లాల శాసన సంపుటాలు వెలువడ్డాయి కానీ, ఉమ్మడి రంగారెడ్డి, ఖమ్మం, అదిలాబాద్, హైదరాబాద్ జిల్లాల శాసనాలు వెలువరించాలి. అదిలాబాద్ జిల్లా సర్వే చేయాలి, శాసనాలు సేకరించాలి.

2. తెలంగాణాలో లభించిన ప్రాకృత శాసనాలను ప్రత్యేకంగా ముద్రించాలి

3. ఇంటర్, డిగ్రీ స్థాయిలో ఎపిగ్రఫీని విద్యార్థులకు పరిచయం చేస్తూ సిలబస్ని రూపొందించాలి.

4. అట్లాగే లిపి శాస్త్రం మీద, శాసనాధ్యయనం మీద శిక్షణ తరగతులు నిర్వహించాలి.

ఏది ఏమైనా కొమర్రాజు లక్ష్మణరావు పంతులు గారు ఒక శతాబ్ది క్రితం చెప్పినట్టు “చరిత్రకారులకి ముఖ్యంగా శాసన పరిశోధకులకు తెలంగాణా స్వర్గధామంలాంటిది”.

**ఉపయుక్త ఆధారాలు :**


1. South Indian Inscriptions,IV, V, VI, X, XVI Volumes
2. Inscriptions of Andhra Pradesh, Hyderabad (All Published)
3. Corpus of Telangana Inscriptions I, II, III -- P. Srinivachar, IV-Somasekhar Sarma
4. Indian Antiquary Volumes
5. బి.యన్. శాస్త్రిగారి అముద్రిత ఆత్మకథ
6. భారతి సంపుటాలు
7. యాన్యువల్ రిపోర్ట్స్ ఆన్ సౌతిండియన్ ఎపిగ్రఫీ.
8. జర్నల్ ఆఫ్ ఆంధ్ర హిస్టారికల్ రీసెర్చ్ సొసైటీ రాజమండ్రి
9. బి.యన్ శాస్త్రిగారి జీవితచరిత్ర – రాపాక ఏకాంబరాచారి
10. Hyderabad Archaeological Series No.6 -KOTAGIRI COPPER PLATES OF THE REIGN OF KAKATIYA QUEEN RUDRAMBA A.D.1273. (Published 1925).
11. మిత్రులతో వ్యక్తిగత సంభాషణలు.


***

# THE GLORY OF TELANGANA AND THE GLORIOUS KAKATIYAS : THE FORTS AND FORTIFICATIONS IN TELANGANA

**Prof. Ravindra Kumar Sharma**




On the very outset I thank Respected Chairman, Telangana History Congress, Hon'ble Vice-Chancellor, O. U. Hyderabad and Telangana University, Nizamabad, Prof. Dr. D. Ravinder Ji, Secretary of the Telangana History Congress, Professor Dr .M .Veerender Ji, along with all the respected members of the Executive Council of the Telangana History Congress for entrusting me this prestigious academic task. Sir, I feel humbled and honoured for this act of kindness. I bow down with folded hands in front of this venerable academic fraternity of historians and historiographers comprising of illustrious gathering from the exquisite academic galaxy of the scholars of Telangana and beyond, attending this mega scholastic event in the historic 'Killa' City of 'Indrapuri' founded by Chieftain Inder Sain, earlier known as Induru now called as Nizamabad.

I take this opportunity to share my views about "The Glory of Telangana and The Glorious Kakatiyas" especially about their unique forts, fortifications, walled cities and other such similar defensive architectural monuments. Telangana remains famous among others for the glorious history of the

* Former Head, Department of History, Kurukshetra University, Haryana.

Mighty Kakatiya rulers who were known for their unique fortresses and magnificent public welfare schemes, patronage of arts, architecture, social welfare activities and above all in the military history of India for their astute military acumen. Kakatiyas were great initiators of military architecture and regularly maintained numerous strategically rewarding forts which were constructed, renovated and fortified in the different geographical areas of Telangana based on tactical advantages accruing from them in the complete gamut of regional hegemony. Kakatiyas continuously fortified their Rajkotas, walled cities for defence, peace, prosperity and well-being of the masses of Telangana in furtherance of their ultimate aim of prosperous, peaceful and yet a powerful empire. And thereby Kakatiya rulers succeeded in providing peaceful atmosphere, socio-religious welfare schemes and reforms, prosperity backed by unhindered military protections, for their subjects without any major interruptions continuously for more than two centuries, before they encountered invasions of the Khaljis and Tughluqs.

**Bravest of the Brave : Kakatiyas**

Emergence of the Kakatiyas as ruling elites was one of the significant events in the military history of India. During Kakatiya's rule Telangana was dominated by illustrious Kakatiya rulers one after the other and prominent among them were Beta Raja-l, Parola-l, Beta Raja-ll, Parola Raja-ll, Rudra Deva-I, Maha Deva, Ganapati-deva, Queen Rudramma Devi, Pratap Rudra Deva II. Amongst the early Kakatiya rulers Ganapati Deva was one of the most popular, powerful, military administrator who ruled over Telangana region for nearly 63 yrs. However Queen Rudramma Devi as the first Queen got worldwide recognition for her unparallel civil and military administration which was almost considered as the benchmark and she initiated many a reforms which were nearly unheard at that time. Another powerful Kakatiya rulers; Pratap Rudra

Deva II c.1289 to 1323A.D rose into prominence as a outstanding extraordinary genius and astute ruler. Pratap Rudra Deva II also known as Rudra Deva II, introduced innovative military mechanism in the construction of forts and fortifications, reformed public welfare setup and introduced remarkable schemes and made unique waters bodies in the different RajaKotas and fortified Warangal and other fortresses. Pratap Rudra deva, Il, initiated many agricultural welfare activities also and always followed the path of his illustrious predecessors and augmented the welfare of his people.

Pratap Rudra Deva II, was related to the famous clan of Motati Reddys and by virtue of his extraordinary military vision virtually controlled the maximum fortified areas of Eastern Deccan comprising of important forts and fortified areas of the present day Telangana; bordering important forts of Andhra Pradesh, Karanataka, Orrisa, Maharashtra and nearby Bastar regions. Pratap Rudra Deva II, strategically planned and renovated fortified royal city of Warangal which was at that time one of the best example of defensive architecture in the Indian sub-continent and had one of the longest protection fort wall with three layers of stone and unique mud layer interspersed with numbers of moats, attack Burjs, check-posts, secret tunnels, unique walled roads for quick military movements of his cavaliers, war elephants and Infantry alike. Underground shelters, water sheds, strong moat walls, temples, royal apartments with gardens and contiguous multi layered strong fort wall which was much bigger than any contemporary fort in the Indian sub-continent were the hallmarks of Warangal fort city. From military points of view the fort of Warangal had the longest fort walls and after Pratap Rudra Deva II, such extraordinary military vision could only be seen in the forts and fortifications developed by Maharana Kumbha of Mewar and in his architectural monuments. Maharana Kumbha followed similar military vision and

constructed various strategically located forts. Kumbhalgarh fort is one such shining example having longest fortified wall in the Indian sub-continent covering nearly 30 miles of strong stone fort wall which encircled the Kumbhalgarh administered areas and covered a number of recruiting villages, military watch towers, water bodies, temples and other commercial and administratively important establishments.

During Pratap Rudra Deva II, the wonderful Warangal fortress was known throughout the Indian sub-continent for its prosperity, jewellery, diamonds, pearls, rubies and others such collectables and commanded a position in the entire world which was never attained by any forts or ruling authorities in the Indian sub-continent until the coronation of Mughal Emperor Shah Jahan in the fort of Lal Qila when he was coronated and seated on the world famous Takhat-i-Ta'us better known as "The Peacok Throne" encrusted with the world famous Kohinoor Diamond which was once the prized possession of the Kakatiyas of Warangal. These events are extensively recorded in the Persian chronicles of the Khalji and Tughluq invaders of Delhi that their invaded army looted unaccountable enormous wealth in the war booties after the siege, capture and destruction of the magnificent Warangal fortress from the king, his coiffeurs and the masses as well and the rest is the history.

During the wars against foreign invaders initially Pratap Rudra Deva-II fought skillfully for the protection of his subjects and in the beginning succeeded tactfully and repulsed the early attacks of the invaders. Even in his final war Pratap Rudra Deva-II fought dexterously against the invaders who came in very large numbers of more than one lac soldiers and consequently the fort of Warangal fell to the superior strength, siege and craft techniques, Arrada, Gargach, Sabat, Nafta, Pasib and use of Atishi- powder based technology, war crimes and barbaric atrocities committed by invaders, whose sole motives

was to ruin and loot the prosperity, wealth, peace and military powers of the Kakatiyas. Militarily the main causes of the fall of Warangal fort was lack of awareness about the counter measures to abrogate and nullify siege craft techniques used by their opponents. The military establishment and garrison master of the fort of Warangal were not well equipped, prepared and trained to cope with the new war mechanism of their opponents particularly fort wall blowing techniques using Barudi powder, Arrada, Gargach, Sabat, Nafta, catapult machines and stone fire ball throwing machines which ultimately destroyed and blew up the strong fortified walls of Warangal. It was not in vogue in the army of Kakatiyas and unfortunately they never tried to acquire such technology and barbarianism while always believing in morally and ethically justified wars and techniques. Such techniques were never faced by Kakatiya army in their earlier encounters. Catapult techniques, fire ball machines and numerical upper hand in their battalion formations comprising more than one lac freebooters and willingness to use unimaginable barbarianism the invaders at last succeeded in creating havoc in the fortified Warangal fortress which resulted in the downfall of the Warangal fort. The rubbles, ruined structures of once prosperous fortified city are visible even today in the heritage fortress giving a glimpse to a glorious past goneby.

**Kakatiyas : A military points of view**

Though the invaders succeeded in their evil designs and ruined the fortified city of Warangal, but the people of Telangana have never forgotten the heroic achievements, fighting spirit and the sacrifices made by the bravest of the brave warriors of Telangana and au contraire the Kakatiyas are still revered for their matchless services, sacrifices, martial instincts and warriors who are always appreciated for public welfare activities and good deeds as their very own illustrious son of the soil. For the coming generations of Telangana, no

doubt that the fall of the fortresses of Warangal and untimely sad demise of Pratap Rudra Deva, II, was an un-healing agonizing injury to the heart. Militarily also it was a big blow to the Kakatiya sovereignty and a severe war tragedy for the military history of the sub-continent as well as it proved to be a major hindrance in the multipronged development of the people of Telangana. But if we study, analyse and understand it from military point of view in detail then we come to find that the debacle of Warangal fortress had similar outcomes like the world famous fierce battle of waterloo in which a General of the stature of Emperor Napoleon Bonaparte though lost the battle of Waterloo to the British General Wellington; but the honour, prestige, and valour of the French culture remained intact. In my opinion the same should be applicable to the sagacious end of Pratap Rudra Deva II, though Pratap Rudra Deva II lost to the opponents but the culture of Telangana not only remained intact but later developed with tenacity and even flourished. I can't help but draw a parallel that even in modern day France, every Frenchman, inspite of the defeat and tragic death of the Emperor Napoleon Bonaparte remained forever indebted to Emperor Napoleon Bonaparte for his civil and military achievements and always respectfully remembers his glorious gallant deeds and civil work which he achieved in his career and after visiting France and Telangana both I could say it with good authority that the same determination, gratitude and spirit is found in patriotic masses of Telangana for Pratap Rudra Deva II. The people of Telangana have always respected and honoured the gallant deeds of their worthy and prodigious ancestors by installing their statues in public places as well as on various important educational/government platforms in Telangana while also naming some important buildings, educational institutions, water schemes in the sacred and immortal memories of Kakatiyas.

## Public welfare activities of the Kakatiyas

I would like to mention here that the government of Telangana in recognition of the meritorious activities rendered by Kakatiyas for the welfare of the people introduced many a schemes to immortalize Kakatiyas and adopted " Missan Kakatiya Flagship Programme" with the objective to enhance the development of agriculture based income for small and marginal farmers by restoring water bodies, ponds, wells, lakes and reservoirs for increasing the livelihood of the masses of Telangana in tune with the glorious Kakatiyas. Needless to say even in modern Telangana we have more than forty five thousands (45000) water ponds which can store enormous water from rains for drinking and agriculture or other utilities. Thanks are due to the Telangana government for the restoration and proper conservation of the history famous step-wells of Telangana with the help of Aga Khan Trust for culture which has done magnificent restoration work. The restorations work has been done so aesthetically that while retaining authenticity these step-wells also won a UNESCO award for conservation and restoration. It is relevant to note here that the government of Telangana as I already stated, has restored the 17th century Bansilalpet step-well to its old historic glory which also reflects in it the old Kakatiyan style and system of water storage. I am pleased to mention here on record that recently Dr. Naresh Garu in a newspaper highlighted the restoration work which is being done in the heritage step-well in the vicinity of the famous Indur Mandir of Nizamabad, which was uptill now filled with dirt. Some step-wells in Hyderabad as already mentioned by me were restored and have even been opened for public to visit .Though some entry fee is charged from visitors but such measures not only restore the culture and monument/artefacts but also result in enhanced revenues for the government department which are further channelized to continuously work on restoration of heritage architectural monuments of the

glorious Kakatiyas, Qutubshahis and Asaf Jahis for tourism as well large reservoirs, lakes, tanks, step-wells, dams for farmer's agricultural and other routine requirements and utilization by common masses.

The local sources of Telangana provides us ample information about Queen Rudramma Devi that how she was well nurtured, administratively and militarily similar to a boy and trained by her father and family for ruling with utmost care which was an idea much ahead of time. Undoubtedly Queen Rudramma Devi proved the judgement of her parents apt by becoming a successful queen. Queen Rudramma Devi was a "warrior queen" and some time back a movie also depicted her as a daring combatant queen. She and her successors continuously followed their family's civil and military traditions by maintaining adequate numbers of forts, fortified cities and adopted developmental activities. After her glorious regime, her successors continuously constructed different fortified sites on other strategically located hilltops and fortified them with strong walls around them, extension of Warangal and nearby Bhuvangiri forts are shining examples of the same. Pratap Rudra Deva II, applied de novo approach with new designs with beautiful and innovative architecture and successfully repulsed the early attacks of the invaders because Warangal fort was remodelled and constructed with architectural water bodies, wells, ponds and smaller lakes. Kakatiyas ensured best management for the drinking water facilities in and around the fort and fortified cities which was a rare phenomenon then. Interestingly I would like to quote an example from the pages of Mughal history on the importance of such architecture that during the time of the war of succession when the siege of the fort of Agra was in progress, Prince Aurangzeb cut off the water supply of the fort of Emperor Shah Jahan from river Yamuna and succeeded to force Emperor Shah Jahan to surrender. Later Prince Aurangzeb imprisoned Emperor Shah Jahan in the Musamman Burj of

the fort of Agra and assumed the power and proclaimed himself as the next Emperor of India. Rest is history. But no Kakatiya fort was ever surrendered for want of adequate water supply. In due course the water conservation system and public welfare activities of the Kakatiyas were also adopted by Qutubshahis and Asaf Jahis.

In addition to forts and fortifications the Kakatiyas also constructed beautiful temples, Dharma Sthanas with night shelters within the premises of their fortified cities for the devotees. This also enhanced state's revenue and provided good job opportunities to the skilled artisans, Sikligars, iconographers, masons and traders of that era where job opportunities were limited. Even during war like situations forts and fortified cities were better suited for the local artisans, farmers, traders and differently abled persons for their commercial activities. The officials of the Kakatiyas regularly visited grain markets, Mandis, tolls and watch towers within their fortresses and adjoining areas to effectively administer them. To safe guard the merchant caravans of the other states, business centres were established and adequate vigilance and security arrangements were made by the Kakatiyas. Before the siege and fall of Warangal; Kakatiya rulers provided sufficient overall security to their subjects by organising patrols, security posts etc near major population centres while the state highways were well managed too. During the life and times of Queen Rudramma Devi trade and commercial activities were at its zenith. It is well evident from the annals of Indian history that during the reign of the Kakatiyas the inhabitants of the Warangal fortress were known for its strong and robust economy, architectural marvels, precious jewellery, prosperity, military prowess and overall well-beings of all the natives.

**Comprehensive Kakatiyas**

As a student while studying ancient and medieval history of the Indian sub-continent we all have come across

numerous references of events of the political, socio- economic and cultural activities of the native rulers and their supporting bureaucracy particularly those who were with the Rashtrakutas, Chalukyas, Pallavas, Cholas, Parmaras, Yadavas, Rajayavardhanas, Chandelas, Kalchuries, Chahmanas, Guhilots, Hadas, Rathores, Kachhwahas, Satvahanas, Hoyasala and Pandyas. Similar activities were organised by Kakatiyas in Telangana; individually as well as collectively in their respective forts, fortified cities, villages and their adjoining areas. It goes without saying that much has been written about the ancient and medieval forts, fortifications of other parts of our country but scant attention has been paid to study the sagacious military contributions of Telangana; particularly of the glorious Kakatiya warriors, their civil and military institutions, unique architectural monuments, various distinct designs of the forts, fortifications, walled cities, hilltop fortresses, fortified villas, fortified temples and the changing patterns of their artistic and architectural impressions which were developed by local artisans and could be seen eventually in the various Raj Kotas scattered all over Telangana state. The Kakatiya rulers not only constructed, renovated, remodelled important forts but also installed many additional check posts in and around them by adding beautifully redesigned gates, marvellous arches, deep and wide moats, comparatively longer barracks, huge granaries, stronger city walls, innovative storage systems for their defensive requirements. Undoubtedly these forts and fortified monuments of Telangana are the prime tourist destination even in present day India revealing a glorious proud past.

The political successors of the Kakatiyas in their respective zones, especially Misunuri, Nayaks, Reddys, Qutubshahis, Asaf Jahis, Nizams and other dynasties also retained the same spirit in their respective eras. Glorious Kakatiyas will always be remembered and known as a "Path-Finder" architects of the forts, fortifications, administration,

agricultural and irrigational reforms, public welfare activities and impartial justice in Telangana.

**Magnificent Forts of the Kakatiyas**

Kakatiyas constructed numerous forts, fortifications and other architectural marvels with their noteworthy forts being : fort of Warangal, Khammam fort, Golconda fort of Bhagya Nagar now known as Hyderabad, Ramalya Induru fort now known as Nizamabad fort, Karim Nagar fort, Bhongir fort, Medak fort, Gadwal fort, Devarakonda fort, Elgandal fort, Mahboob Nagar fort, Kondaveedu fort. The heritage forts are being regularly maintained and looked after by the central and state government departments with the impetus on preserving them for future generations.

**ORUGALLU FORT** - Orugallu fort primarily known as the heritage fortress of Warangal was fortified by the Kakatiyas and Misunuri Nayaks renowned for offering stiff resistance to the Khalji and Tughluq invaders. Warangal fort once upon a time was the glorious fortified capital city of the Kakatiyas amongst the most prestigious, safe, prosperous fortified castle of India possessing the world famous "Kohinoor" diamond, tons of gold and silver jewellery, exquisite blue diamonds, flawless rubies, enormous wealth, gold utensils, silverware, gold and silver coins, selected quality horses, trained and decorated elephants, besides ivory goods, matchless royal costumes embroidered with real gold and silver threads, unique traditional jewellery with huge and costly gems, diamonds and other precious stones and metals. The coiffeurs of the Kakatiyas were always filled with enormous wealth, food and fodder. The Orugallu fort was heavily guarded by the brave warriors of Telangana. The fort was known for its three layers long wall, architectural design, peculiar moat design, heritage sites, unique temples, beautiful and useful water bodies, with a deep wide ditch defence mechanism with unique watering systems and a soggy muddy wall which encircled the

fortifications and was supported by two layers of thick stones walls. According to the local sources the fort was first militarily designed and garrisoned by the famous Kakatiya ruler Ganpati Deva and later renovated by Queen Rudramma Devi and further strengthened and fortified by Pratap Rudra Deva II and finally ruined by the Khalji and Tughluq invaders.

**KHAMMAM FORT** - Khammam fort is a very old architectural fortified site constructed and renovated many times during the regime of Kakatiyas and Misunuri Nayaks and followed by other rulers such as Bahmanis, Qutubshahis and Asaf Jahis etc. Presently Khammam fort is a very famous tourist destination which attracts numerous visitors every year. Khammam, was historically known as Stanbbhadri, Kambbhdri, Kambhan, Khammam Mettu and finally came to be known as Khammam fort. It is one of the finest example of defensive architecture which was once the stronghold of heroic Kakatiyas but was later on captured by Misunuri Nayaks. In due course of history the Khammam fort remained with Qutubshahis and Asaf Jahis of Hyderabad upto the independence of India.

**NIZAMABAD FORT** – Upto 5th century the fortifications of the area were known as Indra puri, Induru i.e Indrapur which derived its origin from the chieftain Indersain. According to epigraphical sources once this fortified Killa was a famous stronghold of the Rashtrakutas and was a well-known military station and was administered upto 9th/10th century by the successor of Indersain. The defence of Indra puri was subjugated by mighty Kakatiyas who then renovated the fort and converted the entire defensive architecture and posts of Induru into a mighty fortified station. Later Nizam of Hyderabad occupied it and ruled Nizamabad region till the unification of the Hyderabad state with independent India. Under Asaf Jahis it was known as Nizamabad fort. The Nizamabad fort is very near to the city centre and Gandhi

Chowk in the present day Nizamabad city. The star tourist attractions of the Nizamabad fort are Ramalayam temple, Jagannath temple, Raghunath Temple and displayed mounted canons and various other arts and artefacts.

**BHUVANGIRI/YADDRI/BHONGIR FORT** - Earliest known medieval inscription from Telangana's Bhuvangiri zone reveals that Bhuvangiri fort was first founded, constructed and administered by Chalukya rulers. Bhuvangiri got military prominence during the times of great Kakatiyas and was renovated by Queen Rudramma Devi. Recently while renovating old houses of the nearby villages many archaeological findings were unearthed which proved the historic importance of Bhuvangiri RajKota. Anyone can draw a conclusion that Bhuvangiri was once a stronghold of the Chalukyas and an important military post. The history of the fort of Bhongir revolves around legendary western Chalukya rulers Tribhuvanmalla and Mugla Mulugu Vikramaditya,VI who was known as founder of this well fortified Killa. It was first occupied by Chalukyas who constructed and nurtured this fortified site of Vikramgiri in between 6th to10th century and named it as Bhuvaneshvari now popularly known as Bhongir/ Yaddri. Recently an inquisitive scholar from Telangana Shri Hari Ji forwarded some photographs along with information about findings of a rare inscription about Kakatiya ruler Pratapa Rudra Deva II, which was accidentally unearthed while a villager renovated his parental house in the vicinity of Bhuvangiri fort, Yaddari, Taluka. According to Shiri Hari Ji I quote " Inscription of Pratapa Rudra Deva II along with some sculptures were found, during the course of house renovation work in the village Bhongir, Yadadri, Bhuvanagiri district, Telangana. It is written in Telugu language and characters and is dated Úaka 1240, Kâlayukta, Âshada,úu 15,Thursday corresponding to 1318 C.E. Records the gift of lands in the village Bhunâgiri to the god Úri Vîravadrçúvara, for burning a perpetual lamp in the temple by Âshtadasaprajas in the village,

16) శ్రీ సముద్రగుప్త పాటిల్ అనే పరిశోధకుడు అశ్మక నాణాలను నాందేడ్ నగరంలో వెలికితీసి, అంజనేరి నాణాల సంగ్రహాలయం యొక్క పత్రికలో అశ్మక నాణాలు వివరాల్ని ప్రచురించారు.

17) Cunnnigham అనే పరిశోధకుడికి అశ్మక నాణాలు దొరికాయి. వాటిని "పటాశ్మక నాణెలు"గా చెప్పాడు. రెండు. పర్వతాల మధ్య చంద్రోదయం, ఆజానుబాహు యోద్ధ బొమ్మలు కల నాణేలివి. ప్రాచీన చరిత్రకారుడు పరమానంద గుప్త తన వ్యాసం Ancient Indian Coins and Seals పేజిసంఖ్య 17–19లో పై కనింగ్ హెూమ్ నాణేల వర్ణన ఉంది. ఇవి నాటి వర్తక సంఘానికి చెందిన నాణేలుగాను, అవి శాతవాహన పూర్వం నాణేలని ఆయన వ్రాస్తూ వీటి ప్రస్తావన భాస్కరాచార్యుడి వ్రాతలో ఉందని చెప్పాడు.

18) గ్రీకు చరిత్రకారులు Aspasioi, Aspassi, Assakenoi గా సంబోధించారు.

19) Professor Rhys Davids రాసిన 'బుద్దిస్ట్ ఇండియా' గ్రంథంలో Sanskrit authors Speak both of Ashmaka and Asvaka, they called Assaka Tribes అంటే అస్సక పదమే మూలపదము.

20) నేటి భైంసా ప్రాంతం నాడు మహిషక రాజ్యంగా ఉండేది. వీరు అశ్మకుల సామంతులు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ దగ్గరి అడవుల్లో ఒక మట్టికోట దొరికింది. కార్బన్ డేటింగ్ వల్ల అది నేటికి 4000 సం పూర్వందని తెలుస్తున్నది.

21) కరీంనగర్ జిల్లాలో 'కోటలింగాల' ద్వీపంలో శాతవాహన పూర్వపు

గోబద, నారన, సమవాయ, సమగోప రాజుల నాణాలు దొరికాయి మరియు శ్రీముఖుడివి కూడా నాణేలు దొరికాయి. ధాన్య కటకంలో సుమేరియన్, మరియు బృహత్ శిలాయుగం నాటి అనేక వస్తువులు దొరికాయి.

ఈ ఆధారాలను జాగ్రత్తగా విశ్లేషిస్తే శాతవాహనులకు పూర్వము అశ్మక రాజ్యం ఉండేదని, సుమేరియా, ఈజిప్టు, రోముకు వీళ్ళకు సంబంధాలున్నాయని అనేక నగరాలు వారివి ఉన్నాయని తెలుస్తున్నది. ఈ రాజవంశం బోధన్ ప్రాంతాన్ని పాలించిందని గట్టిగా చెప్పవచ్చు. అజంతా గుహల్లో అశ్మకవిహారం కూడా ఉంది. ప్రాకృతం వీరి రాజభాష, దక్షిణ భారతదేశంలో ఎంతో విశాల ప్రాంతంలో వీరి రాజ్యం నడిచింది.

* * *

# కాకతీయుల పరిపాలన - మహిళల పాత్ర - శాసనాధారాలు

- డా. భిన్నూరి మనోహరి*

శాసనాలు అంటే ఆధునిక కాలంలో చేసే చట్టాల వంటివి. మన చరిత్ర, సంస్కృతి, భాషా సంబంధమైన అనేక అంశాలను తెలుసుకోవాలంటే మన పూర్వీకులు చేసిన కృషిని మనం గుర్తించి వారిని అనుసరిస్తే మన చరిత్ర మనకు బోధ పడుతుంది.

అసలు మన చరిత్రను ఎందుకు తెలుసుకోవాలి? మీ తాత అంత గొప్పోడురా అని అంటారు. అయితే నాకేంటి? దానివల్ల నాకు లాభమేంటి? అనే నేటి కాలంలో చరిత్రను గురించి ఆలోచించే తీరిక, అవకాశం తక్కువౌతున్నాయనే చెప్పాలి. గడిచిన నిమిషం భూతకాలమైనట్లు, గడిచిన సంఘటనలు అంతా చరిత్రే. అయితే అన్ని సంఘటనలు ముఖ్యమైనవిగా పరిగణించము ఏవైతే మనకు మార్గదర్శకంగా నిలుస్తాయో, ఏ సంఘటన భావి తరాలవారికి వెనకతరంవారి గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని తెలుపుతాయో అవే చారిత్రక సంఘటనలుగా పరిగణిస్తాం. ఆ సంఘటనలను ప్రత్యక్షంగా పరోక్షంగా గుర్తు చేసుకుంటాం. వాటిని చారిత్రక ఆధారాలు అంటాం. చరిత్రను  గుర్తు చేసుకోవడంలో, పునర్నిర్మించుకోవడంలో ముఖ్య ఆధారాలుగా చారిత్రకులు శాసనాలను పరమ ప్రామాణికాలుగా అంగీకరిస్తారు.

తెలంగాణ ప్రాంతాన్ని శాతవాహనులు మొదలుకొని ఆసఫ్‌జాహీల వరకు అనేక రాజవంశాలవారు పాలించిన కాలంలో వందల, వేల సంఖ్యలో శాసనాలు వేయించినారు. అందులో పరిష్కరించబడనివి ఇంకా ఉన్నాయి. లభించిన శాసనాలను పురావస్తుశాఖవారు, కొన్ని సంస్థలవారు వ్యక్తిగతంగా కొందరు శాసన పరిశోధకులు పరిష్కరించి శాసన సంపుటాలుగా ప్రచురించినారు. ఆయా కాలాల్లో రాజులు వేయించిన ఈ శాసనాలు దాదాపు 90శాతం దాన శాసనాలే. దాన

* **సహాయ ఆచార్యులు (పి.టి.), కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.**

శాసనాలే కాకుండా ప్రశస్తి శాసనాలు, ధర్మ శాసనాలు, ఒప్పంద శాసనాలు, భూ, గ్రామ పొలిమేరలకు సంబంధించిన శాసనాలు ఆర్థిక సంబంధమైన శాసనాలు, యుద్ధ శాసనాలు, ప్రజోపయోగ నిర్మాణాలకు సంబంధించిన శాసనాలు అని విషయపరంగా శాసనాలను విభజించుకోవచ్చు.

భాషాపరంగా గమనించినట్లయితే మొదట ఇక్కడి శాసనాల్లో ప్రాకృత భాష ఉంది. ఆ తర్వాత క్రమంగా శాసనాల్లో సంస్కృతం ప్రవేశించింది. ఎక్కువ ప్రాకృతం – తక్కువ సంస్కృతం నుండి తక్కువ ప్రాకృతం – ఎక్కువ సంస్కృతం ఉన్న శాసనాలు వచ్చినవి. కాల క్రమంలో ప్రాకృతం పూర్తిగా అదృశ్యమైంది. సంస్కృతం – కన్నడం, కన్నడ – సంస్కృతం, కన్నడ – తెలుగు, తెలుగు – కన్నడ, సంస్కృతం – తెలుగు, తెలుగు – సంస్కృతం... ఈవిధంగా శాసనాల్లో ఆయా రాజుల అధికారభాషానుగుణంగా భాష స్థిరపడింది. కొన్ని మరాఠీ, పర్షియన్, ఉర్దూ శాసనాలు కూడా ఈ ప్రాంతంలో లభించాయి.

కాకతీయుల శాసనాలు వచనంలో, పద్యరూపంలో, గద్యపద్యాత్మకంగా, సంస్కృత శ్లోకాలతో కూడి ఉన్నాయి. సుమారుగా 500 పైగా శాసనాలు కాకతీయులు, వారి సామంత మాండలికులు, వారి పాలనాకాలంలో ఇతరులు వేయించిన శాసనాలు ఉన్నాయి. ఇవన్నీ దక్షిణభారతదేశ శాసన సంపుటాల్లో, తెలంగాణ శాసన సంపుటాల్లో, ప్రభుత్వ పురావస్తువాఖవారి ప్రచురణ గ్రంథాల్లో, జిల్లాలవారిగా వెలువడిన గ్రంథాల్లోను, వ్యక్తులు వ్యక్తిగతంగా ప్రచురించిన శాసన సంపుటాలలోను ప్రచురితమై ఉన్నాయి. కొన్ని కొత్త శాసనాలు ఇటీవల వెలుగులోనికి వచ్చినవి పుస్తకరూపంలో ప్రచురణ కాలేదు కానీ ఆయా దినపత్రికల్లో వాటి వివరణలు ప్రచురించబడ్డాయి.

కాకతీయుల పాలనాకాలంలో వచ్చిన శాసనాల్లో స్త్రీలు వేయించినవి, స్త్రీలకు సంబంధించిన ఆయా అంశాలను ప్రస్తావించడమే  ప్రస్తుతం నేను చెప్పదలచుకున్నది. ముందుగా మైలమాంబ

## మైలమాంబ

కాకతీయుల చరిత్రకు ఆకరమైన మూల శాసనాల్లో బయ్యారం చెరువు శాసనం ప్రధానమైనది.  శాసనం వేయించిన మైలమాంబ చాలా విశిష్టమైన వ్యక్తి.

నతవాడి బుద్ధరాజు రెండవ కుమారుడైన వక్కడిమల్ల రుద్రుడి భార్య. (ఈమె వేయించిన క్రీ.శ. 1209 నాటి త్రిపురాంతకం శాసనం) ఈమె బయ్యారం చెరువు శాసనమే కాక ఇనుగుర్తి, త్రిపురాంతకం శాసనాలు కూడా వేయించింది. ఆ రెండు శాసనాల్లో తన భర్త, తండ్రి, సోదరుడు, కుమారుడి పేర్ల మీదుగా దేవతామూర్తులను ప్రతిష్టించి, ఆలయాలను నిర్మించి ఆ సందర్భంలో బ్రాహ్మణులకు భూదానం చేసిన విషయం తెలుపబడింది. ఇక బయ్యారం చెరువు శాసనం మాత్రం తన తల్లి బయ్యమాంబ పేరు మీదుగా చెరువును త్రవ్వించి శాసనం వేయించినట్లు మనకు తెలుస్తుంది.

మైలమాంబ వేయించిన ఇతర శాసనాలు దేవాలయ నిర్మాణం, బ్రాహ్మణులకు దానాదులకు సంబంధించినవైతే ఈ శాసనం ప్రత్యేకంగా సామాన్య ప్రజలకు, వ్యవసాయ సంబంధిత నీటి వసతులకు ఉద్దేశించబడిన ధర్మ కార్యాన్ని గూర్చి వివరిస్తుంది. శ్రీశైలం మొదలైన క్షేత్రాల్లో శివప్రతిష్టలు చేయడం, తండ్రిపేరు మీదుగా మహదేవపురం, తల్లిపేరుమీద బయ్యవరం, తన పేరున (ధర్మకీర్తి అనే బిరుదనామంతో) ధర్మవరం గ్రామాలను ప్రతిష్టించినట్లు తెలుస్తుంది. ఇక్కడ ఒక విశేషం చెప్పబడింది. ధర్మవరం గ్రామంలో నానా దేశాల నుండి వచ్చిన రోగులకొరకు చికిత్సా విధానాలు, దీనులకు వస్త్రదానం చేసే వస్త్రశాలలు, మరొకచోట అశ్వారోహణ ప్రక్రియలు, ఇంకోచోట కావ్యగోష్ఠులు, సంగీత గోష్ఠులు నిర్వహింపబడుతున్నాయట. ఇవి ఆనాటి కాలంలో సాధారణంగా జరిగేవే కాబట్టి అతిశయోక్తి అని భావించనవసరం లేదు.

తన తల్లి పేరుమీదుగా బయ్యారం అనే చెరువును నిర్మించి వేయించిన శాసనంలో ఆ చెరువు చాలా విశాలమైనది, లోతైనది చెప్పడానికి చాలా విశేషణాలు వాడినారు. అక్కడ అతిశయోక్తి ఉన్నా చెరువు యొక్క విస్తృతిని తెల్పడానికే అని మనం అర్థం చేసుకోవాలి. కాకతీయ వంశం పుట్టుక వారి వంశానుక్రమం చాలా వివరంగా తెలియజేస్తుంది. ఇందులో నతవాడి వంశీయుల ప్రస్తావన ఉంది. 71 సంస్కృత శ్లోకాల్లో ఉన్న ఈ శాసనం తెలుగు, కన్నడ లిపిలో ఎనిమిది అడుగుల ఎత్తులో ఉంది.

## కుందమాంబ

గణపతిదేవుని జ్యేష్ఠసోదరి కుందమాంబ. ఈమె నతవాడి రుద్రుని భార్య. (దొడ్డప్పాదరి గండభైరవుడుగా) ప్రసిద్ధి చెందినాడు.

కుందమాంబ వేయించిన ఆదిలాబాదు చెన్నూరులోని కుందవరం శాసనం (క్రీ.శ. 1213), జనగామ జిల్లాలోని కుందవరం (క్రీ.శ. 1219), నిడిగొండ శాసనకాలం క్రీ.శ. 1219. కుందమాంబ తన భర్త రుద్రుని పేరుమీదుగా, తండ్రి మహాదేవుని పేరుమీద, సోదరుడు గణపతిదేవుని పేరుమీద లింగాలను ప్రతిష్ఠించి ఆలయాలను నిర్మించింది. కుందవరంలోని కొంత భాగాన్ని ఆలయాల పూజాదికాలకు, కొంత భాగాన్ని బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇచ్చి శాసనం వేయించింది. కుందమాంబ చేసిన ధర్మకార్యాలకు సంబంధించిన సమాచారం తెలుస్తుంది. ఈమె కాళేశ్వరంలో, జీడికల్లులోని హిడింబాచలంపై, శ్రీశైలంలో, మంత్రకూటంలోను శివాలయాలను నిర్మించింది.

ఈ మూడు శాసనాల రచయిత బాలభారతి అనే కవి. శాసనంలో కుందమాంబ యొక్క గుణగణాలు, ఆమె విశిష్టతలను గమనిద్దాం. కుందమాంబ సుగుణాలు ఎట్లా ఉన్నాయంటే ఆమె సుగుణాలనే మంచిదారాలతో కూర్చబడిన హారం బాలభారతి కవి యొక్క సూక్తులనే ముత్యాలహారంలాగా ఉండి భూదేవికి హృదయభాగంలో ధరించేవిధంగా ఉన్నదట. ఇంకా ఈమె గణపతిదేవుని తర్వాత ఎట్లా జన్మించిందట అంటే చంచల స్వభావం గల లక్ష్మీదేవి స్థిర స్వభావం కలిగి పుట్టినట్లుగా ఉందని, లక్ష్మీదేవిలాగా ఉందని పేర్కొనబడింది.

స్త్రీలందరిలో మిక్కిలి సౌందర్యం కలిగి ఉన్నది కుందలదేవి. ఆమె పాదాలకు సామంతరాజుల పత్నులు మొక్కగా ఆమె రెండు పాదాల నుండి వెలువడే కాంతులు వారి సీమాన్తములందున్న (పాపిడ చివరిభాగం) సిందూరం యొక్క శోభను ఇనుమడింపచేస్తుందట. ఇంకా కల్ప మహీజ పల్లవాలతో, చింతామణి శ్రేణులతో కూడి అలంకరించబడిన నూతన శిరోభూషణంగా ప్రకాశిస్తుందట. ఇది ఆమెను గురించిన వర్ణన.

ఆమె కుందపురంలో త్రవ్వించిన కుంద సముద్రం(పెద్ద చెరువు) ఏవిధంగా ఉందంటే : క్షీరసాగరమథనంలో సముద్రం నుండి పుట్టిన చంద్రుడు క్షయం

పొందుతాడు (శుక్ల, కృష్ణపక్షాలు), ఇంకా కళంకం ఉన్నవాడు. కానీ ఈ కుంద సముద్రంలో పుట్టిన కీర్తిచంద్రునికి ఆ రెండు దోషాలు లేవు. కాబట్టి సముద్రం కంటే ఈ తటాకమే శ్రేష్టంగా ఉందని, తటాకం అంత విశేషమైందని చెప్పబడింది.

## రుద్రమదేవి

కాకతీయ సామ్రాజ్యాన్ని మహోజ్జ్వల దిశగా నడిపిన వీరనారి రుద్రమదేవి. గణపతిదేవుని కూతురిగా పట్టాభిషేకం చేసుకొని రుద్రదేవమహారాజుగా ప్రజల మన్ననలను పొందింది. ఈమె వేయించిన అనేక శాసనాల్లో మనకందరకూ తెలిసిన ప్రసిద్ధ శాసనం మల్కాపురం. అది తెలంగాణకు సంబంధించినది కాకపోయినా ఆ శాసనం రాజగురువైన విశ్వేశ్వర శివాచార్యులకు గోళకీమఠ నిర్వహణకు, అందులో ఉండే ఆలయానికి, సంస్కృత పాఠశాల నిర్వహణ, ఛాత్రులకు విద్య ఇతర వసతులు, అన్నసత్ర నిర్వహణ, చికిత్సాలయం వంటివాటి నిర్వహణకు వెలంగపూడి గ్రామాన్ని దత్తం చేస్తూ శాసనం వేయించింది.

విరియాల సూరభూపతి వేయించిన కోటగిరి తామ్రశాసనంలో కాకతి రుద్రమ కాకతి గణపతి దేవుని కూతురు రుద్రమాంబగా, ప్రపంచంలో ఒకే ఒక విజేతగా, చంద్రునికి మచ్చలేని నెలవంకగా పేర్కొనబడింది. శత్రురాజులు మృత్యువనే భయంతో ఉంటుండగా, తన భయంకరమైన మెరుపుల వంటి అధికారంతో ఈ భూమండలాన్ని పరిపాలిస్తున్నట్లు పేర్కొనబడింది.

క్రీ.శ. 1280 నాటి చాళుక్య ఇందుశేఖరుని కొలనుపాక శాసనంలో గణపతిదేవునికి "సర్వ రాజన్య కిరీట రత్నాలతో నివాళులు అందుకొనే పాదాలు కలదిగా, దశదిశల్లో తన కీర్తి వ్యాపించేదిగా, ధనంలో కుబేరునిగా, బలంలో అర్జునుడిని మించినదిగా, సముద్రంలో జన్మించిన లక్ష్మీదేవిలాగా వీరిందరి లక్షణాలతో రుద్రమదేవి జన్మించినదట. అట్లా జనించిన రుద్రమకు "ప్రపంచంలోనే భాగ్యమైనట్లు సౌందర్యంలో చంద్రుడు, ప్రతాపంలో సూర్యుడిని కించపరిచేవిధంగా వీరభద్రుడు పతిగా లభించాడు. అని ఉంది.

వీరనారి రుద్రమ మరణ ధృవీకరణ శాసనం నల్లగొండ జిల్లా చందుపట్లలో ఉంది. ఈ శాసనం శ.సం. 1211 = క్రీ.శ. 1289 విరోధి సంవత్సరం, మార్గశిర శుద్ధ ద్వాదశినాడు రుద్రమదేవి సైన్యాధ్యక్షుడు మల్లికార్జున నాయుడు భృత్యుడైన పువుల ముమ్మడి అనే అతడు రుద్రమదేవి, మల్లికార్జున నాయుడుల శివలోక

ప్రాప్తి కొరకు చందుపట్ల సోమనాథ దేవునికి ఆ గ్రామంలో ఉన్న రాసముద్రం వెనక కొంత భూమిని దానమిచ్చి శాసనం వేయించినాడు. ఒక సామ్రాజ్యానికి అధినేత, సర్వ సైన్యాధ్యక్షుడు ఒకే సమయంలో మరణించిన విషయం ఇతర మండలాధిపతులు, సామంతులు పేర్కొనలేదు. కానీ ఒక సామాన్య భృత్యుడు రుద్రమదేవిపై ఉన్న అభిమానాన్ని ప్రకటించుకుంటూ వారి పుణ్యలోక ప్రాప్తికి తనకు తోచిన దానం చేయడం అనేది ఒక అద్భుతమైన విషయం.

శాసనాలలో రుద్రమదేవి రుద్రదేవమహారాజుగా, రాయగజకేసరిగా, పట్టోద్ధతిని పొందినదిగా పేర్కొనబడింది. శాసనాల్లో ఆమె చేసిన యుద్ధాలు, ఓడించిన రాజులు, సాధించిన విజయాల గురించిన అనేక అంశాలు పేర్కొనబడ్డాయి. సామ్రాజ్యంలో రుద్రమదేవి ఒక మహిళగా, తల్లిగా, సామ్రాజ్యాధినేతగా, పరిపాలనా దక్షురాలిగా, శాసనాధికారిగా సర్వ రంగాలల్లో తన నైపుణ్యాన్ని చూపి సమకాలీన సమాజంలో ఆదర్శమహిళగా, తరువాతి తరాల వారికి మార్గదర్శకురాలుగా చరిత్రలో నిలిచిపోయింది.

## కోట గణపాంబ

గణపతిదేవుని మరో కూతురు గణపాంబ. ఈమె కోట బేతరాజు సతీమణి. కోట వంశీయుల ధరణికోట రాజధానిగా పరిపాలన చేసినారు. గుంటూరు జిల్లాలోని ఎనమందల శాసనం ప్రకారం కోట బేతరాజు, ధర్మపత్ని గణపాంబ ఇద్దరూ కలిసే రాజ్యపాలన చేసినట్లు, బేతరాజు మరణం తర్వాత గణపాంబ ఒక్కతే కోటరాజ్యపాలన నిర్వహించినట్లు తెలుస్తుంది. భర్త మరణానంతరం అతనికి శివలోక శాశ్వత సుఖావాసార్థం ధాన్యకపురంలోని అమరేశ్వస్వామి దేవాలయ విమాన గోపురానికి బంగారు తాపడం చేయించి, భర్త పేర బేతేశ్వరాలయం నిర్మించింది. 12 మంది బ్రాహ్మణులకు 12 ఇండ్లను 12 ఆదిత్యులకు ప్రతీకగా సమర్పించింది. తన తండ్రి పేర గణపేశ్వరాలయాన్ని నిర్మించి చింతపాడు గ్రామాన్ని దానంగా సమర్పించింది.

## విరియాల కామసాని

కాకతీయ వంశాన్ని నిలబెట్టిన ఒక అసామాన్య వనితను గురించిన ప్రస్తావన ఉన్న శాసనం ఈ గూడూరు శాసనం. ఈ శాసనం కాకతి రాజ్యం

మహాసామ్రాజ్యంగా వెలుగొందడానికి మూలమైందిగా తెలుస్తుంది. శాసనం జనగామ జిల్లాలోని గూడూరు గ్రామంలో ఉంది. శాసన కాలం చా.వి. 49 = క్రీ.శ.1124. శాసనం పశ్చిమ చాళుక్యరాజైన త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుని కాలంనాటిది. ఇతని కొడుకు కుమార సోమేశ్వరుడు. కొలనుపాక 7000కు మహామండలేశ్వరుడుగా ఉన్న సమయంలో అక్కడి మహాప్రధాని, దండనాయకుడు అయిన సావిపయ్య విన్నపం మేరకు (గుముడూరు) గూడూరులోని మల్లేశ్వర దేవుని అంగరంగభోగాలకు సర్వబాధా పరిహారం కొరకు బమ్మరిగె అనే గ్రామాన్ని దానమిచ్చిన సందర్భంలో వేయించినట్టిది. కుమార సోమేశ్వరుని గుణగణాలు, అతని విజయాలు, దాతృత్వం, అతని అందం వర్ణించబడినాయి.

శాసనం నాలుగవ ప్రక్క తెలుగు లిపిలో ఉంది. ఇది కూడా విరియాల వంశ చరిత్రను తెలుపుతుంది. ఎఱ్ఱభూపతి కుమారుడు భీమ. ఇతనికి మాండలిక భూషణుడైన ఎఱ్ఱనరేంద్రుడు జన్మించాడు. ఎఱ్ఱనరేంద్రుని భార్య విరియాల (కామవసాని) కామసాని.

ముదిగొండ చాళుక్య వంశీయుడైన బొట్టుబేతరాజు కాకతి నాల్గవ గుండరాజుకు కొఱవి సీమకై పోరాటం జరిగే సందర్భంలో బొట్టు బేతరాజు చాళుక్య తైలపుని ఆశ్రయించినాడు. బొట్టుబేతరాజుకు సహాయం చేయదలచి తన సేనానాయకుడైన ఎఱ్ఱ నరేంద్రుడిని కాకతి నాల్గవ గుండరాజుపైకి యుద్ధానికి వెళ్ళమని ఆజ్ఞాపించెను. రాజు ఆజ్ఞను అనుసరించి ఎఱ్ఱనరేంద్రుడు కాకతి నాల్గవ గుండరాజును ఓడించి కొఱవిసీమలో బొట్టు బేతరాజును ప్రతిష్ఠించినాడు. ఆ సందర్భంగా బేతరాజు ఎఱ్ఱనరేంద్రుడికి మొగుడుపల్లితో కూడిన పన్నెండు గ్రామాలను కానుకగా ఇచ్చినాడు.

తండ్రి మరణించడంలో బేతరాజు అనాథయైనాడు. పిల్లవాడికి సహాయపడవలనే కాంక్షతో తన భర్తతో కలిసి పల్లవరాయని నియోగానికి వెళ్ళి అతని ద్వారా చక్రవర్తిని సందర్శించింది. చాళుక్యచక్రవర్తికి దంపతులిద్దరూ పరిస్థితిని వివరించినారు. ఎఱ్ఱనరేంద్రుని స్వామి భక్తి తెలిసిన చక్రవర్తి వారికి సహాయం చేసెను. గరుడ బేతరాజుకు అనుమకొండ విషయాధిపత్యం ఇప్పించడంలో భార్యాభర్తలిరువురు చేసిన కృషి భావి కాకతీయ సామ్రాజ్య నిర్మాణానికి పునాదులు వేసిందని చెప్పవచ్చు.

పరబ్రహ్మశాస్త్రి, బి.ఎన్. శాస్త్రిల అభిప్రాయం ప్రకారం కామవసానికి కాకతీయులతో ఏదో గాఢమైన అనుబంధమే ఉండి ఉంటుంది. ఆ కారణంగానే కాకతీయ రాజ్యం నిలబెట్టాలనే కాంక్షతో చాళుక్య చక్రవర్తిని ఒప్పించిందనే భావన వ్యక్తం చేసినారు.

శాసనంమూడవ ప్రక్క విరియాల వంశం యొక్క క్రమవర్ణన ఉంది. విరియాల వంశీయుడైన సూరకు బేతన అనే కొడుకు ఉన్నాడు. బేతన భార్య బెజ్జమాంబిక. వీరి కొడుకు మల్ల. ఇతడు గుముడూరులో తన పేరుమీదుగా శివాలయం నిర్మించి మల్లేశ్వర దేవుడిని ప్రతిష్టించెను. ఇంకా ప్రజోపయోగార్థం ఊరిలో చెరువులు, బావులు త్రవ్వించినాడు.

ఇక ఈ శాసనం కామసాని గూడూరు శాసనంగానే ప్రసిద్ధి చెందింది. శాసనం కామసాని వేయించిందని చెప్తున్నారు. అసలు శాసనాన్ని గమనిస్తే ప్రస్తుత కాలంలో ఉండి పూర్వ విషయాలను పునశ్చరణ చేసుకోవడం కనిపిస్తుంది. విరియాల కామసాని మల్లనికి తాత తల్లి అవుతుంది. అంటే కామసాని తరువాత మూడవ తరంవాడు మల్లడు. శాసనకాలం క్రీ.శ. 1124. కామసాని సహకరించిన గరుడ బేతరాజు కాలం క్రీ.శ. 992 – 1052. ఒకవేళ కామసాని ఈ శాసనం వేయించి ఉంటే తన తరువాత జరిగిన సంఘటనలకు సంబంధించిన అంశాలు శాసనంలో చెప్పలేదు కదా. ఇంకా చిత్రంగా కామసానిని కవయిత్రిగా కూడా పేర్కొంటున్నారు. మొదటి అంశం శాసనం వేయించింది కామసాని కాదు. శాసనం వేయించినవాళ్ళందరూ రచయిత/ రచయిత్రులు కారు. శాసనం వేయించేవారు వేరు, వ్రాసేవారు వేరు, దాన్ని శిలమీద చెక్కేవారు వేరు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం ఈ శాసనమే. గూడూరు శాసనంలో చివర సూత్రధారి కొమ్మోజు అని ఉంది. ఈ శాసనాన్ని లిఖించినవాడు కొమ్మోజు.

## విరియాల నాగసానమ్మగారు

సువిశాల కాకతి సామ్రాజ్య విస్తరణలో బలవంతులైన సామంతులు, మాండలికులు, చిన్న చిన్న రాజ్యాధినేతలు ఇతోధికంగా కృషి చేసినారు. సామంతాధిపతులుగా పురుషులే కాక పలువురు స్త్రీలు కూడా ఆ పదివిని సముచితంగా చేపట్టినారు. అందులో శ్రీమన్మహా సామంత విరియాల

నాగసానమ్మగారు ఒకరు. ఈమె స్త్రీ అయినా ఆ పదవిని సమర్థవంతంగా నిర్వహించినారు. నాగసానమ్మగారు వేయించిన పమ్మి శాసనం పూర్వపు వరంగల్లు జిల్లాలో, ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని పమ్మి గ్రామంలో ఉంది.

క్రీ.శ. 1236 శ్రీమన్మహామండలేశ్వర కాకతీయ గణంరుద్ర దేవమహారాజుల పరిపాలనా కాలంలో పమ్మిలో ప్రసన్న వల్లభుని తిరుప్రతిష్ఠ దేవన ప్రగడ చేయించినాడు. ఆ సమయంలో విరియాల నాగసానమ్మగారు ఆమ్రరాజు, ముమ్మడిరాజులతో కలిసి రేంబర్తినుండి పమ్మికి వచ్చి ప్రసన్నవల్లభునికి దండం పెట్టుకొన్నది. దేవన ప్రెగడను దేవుని కైంకర్యములకు నెలసరి అయ్యే ఖర్చును అడిగి తెలుసుకుంది.

ఈ శాసనంలో అనేక విశేష అంశాలు ఉన్నాయి. శాసనం వేయించిన సమయంలో గణపతిదేవుడు రాజ్యపాలన చేస్తున్నాడు. ఈ శాసనంలో గణం రుద్ర(దే)వ మహారాజులుగా పేర్కొనబడ్డాడు. అదేవిధంగా విరియాల నాగసానమ్మ శ్రీమన్మహా సామంతగా పేర్కొనబడింది.

## రేచర్ల ఎఱకసాని

ఈమె రేచర్లరెడ్డి వంశీయుడైన బేతిరెడ్డి పెండ్లము. రేచర్ల రెడ్లు కాకతీయుల దండనాయకులుగా, సేనాధిపతులుగా, సామంతులుగా కీర్తి గడించారు.

ఎఱకసాని వేయించిన పిల్లలమర్రి శాసనం చారిత్రకంగా, సామాజికంగా ఎంతో ప్రముఖమైనది. ఈ శాసనం నల్లగొండ జిల్లాలోని పిల్లలమర్రి గ్రామంలోని ఎఱకేశ్వరాలయం ముందు ఎత్తైన అరుగులపై మూడు ప్రక్కల పూర్తిగా, నాల్గవ పక్క 4 పంక్తులతో ఉంది. శాసన కాలం శ.సం. 1130 = క్రీ.శ.1208.

పిల్లలమట్టి గ్రామంలో ఎఱకసాని తనపేరుమీద ఎఱకేశ్వర దేవుడిని ప్రతిష్ట చేసి, గుడి గోపురానికి, బావికి, పరివారానికి, మఠానికి, అంగరంగభోగాది సమస్త పూజలకు భూమిని దానమిస్తూ శాసనం వేయించింది. తన తండ్రిపేర ప్రతిష్ఠ చేసిన శ్రీ కోమరేశ్వర దేవునికి, తల్లి పేర ప్రతిష్ఠించిన శ్రీ ఎఱకేశ్వర దేవునికి, గుడులకు, సమస్త పూజలకు ఎఱకపురంలో అనేక భూములను దానంగా సమర్పించింది.

ఎఱకసానమ్మ చరిత్ర సర్వ లోకాల్లోకెల్లా పవిత్రమైంది. అన్ని జగత్తులలోని జనులందరికీ నేత్రోత్సవంగా ఆమె తన రూపం చేత వెలుగుతుంది. రూపంలో ఆమె తేజస్సును చూసి రంభ తన రూపం తీసిపోతుందని ఈర్ష్య పడుతుందట. అదేవిధంగా పతివ్రతాధర్మంలో అరుంధతి ప్రసిద్ధమైంది. ఆమె ఎఱకసానమ్మ పతివ్రతాధర్మంతో సరిపోల్చుకోలేకుండా ఉందట. సర్వ ధర్మాలలోను, పతివ్రతా ధర్మాన్ని పాటించడం వంటి ఈ పై గుణాల చేత అందరికీ ప్రీతిపాత్రురాలయింది.

పరిపూర్ణ చిత్తంతో తన పదభక్తిచేత శివుని భార్యయైన గౌరిదేవి మనస్సును చూరగొన్నదిగా, కల్పవల్లితో సమానమైనదిగా, వేదాలలో చెప్పబడినటువంటి అన్ని సంపదల సమృద్ధి కలదిగా కీర్తించబడింది. ఇంకా ఆరామాలు, ఉపనయనాది కార్యాలు, సాగరాలు (పెద్ద చెరువులు), తటాకాలు (చిన్న చెరువులు) పెద్ద పెద్ద గుట్టలతో సమానమైన అనేక రకాల సురభవనాల వంటి భవనాలను నిర్మించినది. సూర్యుని వెలుగుల చేత ఎల్లప్పుడు బంగారం వంటి అనేక రకాల ధాన్యాలు సమృద్ధిగా పండేటటువంటి భూమిని, చాలా ఎక్కువగా పాలిచ్చే ధేనువులను, భూమిని వివిధ రంగాల్లో విబుధులైన ప్రసిద్ధులకు దానం చేసినది.

పండితులను ఆదరించి వారికి భోజనం పెట్టేది. ఆ భోజనంలో క్షైరేయాణి (పాలతో) చేసిన అన్నం, అప్పాలు, చంద్రుని కాంతి వలె తెల్లగా ఉండే శ్రేష్ఠమైన బియ్యంతో వండిన అన్నం, అనేక శాకములతో కూడిన మృష్టాన్నం పండితుల భోజనంలో ఉండేవి. తన మంచి గుణాలచేత అప్పటికే కవీంద్రులచేత కీర్తించబడిన ఆమె అనేక భాషల్లో కుశలత్వం కలిగినట్టిదిగా వర్ణించబడింది.

ఇంకా విద్యార్థుల కొరకు, వారి విద్యాభ్యాసానికి ఒక సత్రాన్ని నిర్మించింది. ఆ సత్రం 15 మందికి సరిపోయేవిధంగా ఉంది. ఆ సత్రానికి, 2 మర్తుర్లు, వండివార్చేవారికి 1 మర్తురు, విద్యార్థుల గ్రాస (భోజనాదులు), వాస (వస్త్రాలకు) 4 మర్తుర్లు, చలివేంద్రంలో నీరు పోసేవారికి అరమర్తురు భూమి ఎఱకసముద్రం కింద దానమిచ్చింది.

## కుప్పాంబిక

మల్యాల గుండన కాకతి గణపతిదేవునికి, రుద్రమదేవికి సామంతునిగా, దండనాయకుడిగా ఉన్నాడు. ఇతడు బూదపురంలో రెండు శాసనములను

వేయించినాడు. గుండయ మరణానంతరం ఇతని భార్య అయిన కుప్పసానమ్మ (కుప్పాంబిక) క్రీ.శ. 1276లో బూదపురంలో ఒక శాసనం వేయించింది. అంటే గుండయ క్రీ.శ. 1272- 1276 మధ్య కాలంలో మరణించి ఉండవచ్చని అర్థమవుతుంది.

కుప్పాంబిక గోన వంశోద్భవ. బూదపురంలో తన భర్తకు పుణ్యలోక ప్రాప్తి కొరకు అతని పేరుమీద ఆలయాన్ని నిర్మించి గుండేశ్వరస్వామిని లింగప్రతిష్ఠ చేసి అనేక దానధర్మాలు చేసి శాసనం వేయించింది. కుప్పాంబిక కట్టించిన ఈ క్షేత్రం అతుల్యమైనదిగా, అధిక ఫలాన్నిచ్చేదిగా చెప్పబడింది. కుప్పాంబిక తన కొడుకులు బాచయ బొప్పండు, గణపతిదేవుండు, పర్వతము మల్లయ, తమ్ముడు గోన బుద్ధయ, గోన విఠయ కుమారుడు గుండయలతో కలిసి గుండేశ్వర దేవునికి అనేక మర్తురుల భూమిని దానంగా సమర్పించింది.

శాసనంలో కుప్పాంబికకు గురించి చాలా గొప్పగా వర్ణించబడింది. సకల గుణగణాలంకృత, పతివ్రత. కల్పంలో చెప్పిన ప్రకారంగా లక్ష్మీనారాయణ, జలశయన, అశూన్యశయ్య, అనంత, అరుంధతీయ, ద్వాదశీ వంటి అనేక వ్రతాలను ఆచరించిన వనితగా కీర్తించబడింది.

ఇంకా కుప్పసానమ్మ అనేక నూతులు త్రవ్వించింది, పశువులకు నీటి కుంటల వంటి అనేక నీటి వసతులు కల్పించి భూతదయను ప్రదర్శించింది. అనేక శివాలయాలను నిర్మించింది, తోటలు వేయించి, చెరువులు త్రవ్వించి, విష్ణు విగ్రహాలను, శివలింగాలను ప్రతిష్టించింది. ఇటువంటి సత్కార్యాలు అనేకం చేసి ప్రజల ఆదరాభిమానాలు పొందింది.

ఇంకా శాసనంలో కుప్పసానమ్మ చేసిన మంచి పనులను గురించి వర్ణన ఉంది. ఈమె అనేక భూ, గో, సువర్ణ (బంగారం) దానాలు, రథములు, గుఱ్ఱములు, ఎల్లప్పుడూ అన్నదానం, నీరు,గృహదానం చేసినట్లు చెప్పబడింది. ఆయా కన్యలకు అన్నివిధాల శ్రేష్టులైన వరులను వెతికి పతిదానం (వివాహాలు జరిపించింది), ఛత్రదానం (గొడుగు), చక్కగా అలంకరించబడిన శయ్యాదానం, శాస్త్రాల్లో చెప్పినవిధంగా విధిపూర్వకంగా అన్నింటిని దానం చేసినట్లు తెలుస్తుంది.

## నాగాంబిక

కాకతీయులకు సామంతులుగా ఉన్న రాజవంశాలలో రేచర్ల పద్మనాయకులు ప్రముఖులు. రాచకొండను పరిపాలించిన అనపోతా నాయకుని కుమారుడు రెండవ సింగన. అతని కుమారుడు రావు మాధవుడు. ఇతని భార్య రాణి నాగాంబిక. ఈమె దేవలమ్మ నాగారంలో తన పేరుమీద నాగసముద్రం అనే బృహత్ తటాకాన్ని త్రవ్వించి శాసనం వేయించింది.

శాసనాన్ని వేయించిన నాగాంబిక కడిపికొండ వంశంలో జన్మించిన పతివ్రత. రావు మాధవరావు ధర్మపత్ని. దానగుణం కలిగినది. నాగాంబిక పేరుమీదుగానే నాగారం గ్రామం ప్రసిద్ధి చెందింది.

నాగాంబిక ప్రజల సంక్షేమార్థం, వ్యవసాయాది కార్యకలాపాల కొరకు అతి పెద్ద చెరువును త్రవ్వించింది. ఈ బృహత్తటాకానికి సంబంధించిన వర్ణన శాసనంలో ఉంది. ఈ చెరువు సారవంతమైన, లోతైన నీటిని కలిగి ఉంది. రఘుపతి ప్రేరణతో నిర్మించబడిన ఈ సముద్రం ఓడలతో కూడి ఉంది. నాగాంబిక చేత నిర్మించబడిన ఈ నాగసముద్రానికి కొత్తగా సేతువు నిర్మించబడింది. భూమిలో నాగాంబిక చేత ప్రతిష్ఠితమైన ఈ చెరువులోని నీళ్ళు చాలా మధురంగా ఉండేవట.

ఈ సముద్రాన్ని చూసి నాగకాంతలు మిక్కిలి అభినందిస్తున్నారట. ఎందుకంటే అందులోని ఓడల్లో విహరిస్తూ సముద్రపు సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారట. ఇంకా చేపలు, తాబేళ్ళు కూడా స్వచ్ఛమైన ఆ నీటిలో స్వేచ్ఛగా, ఏ ఉపద్రవాలు లేకుండా సంచరిస్తున్నాయట.

అడవి ఎంత దట్టంగా ఉంటుందో ఈ సముద్రంలో కలువలు, కమలాలు అంత దట్టంగా ఉన్నాయట. వాటిని చూసి కలహంసలు క్రీడించడానికి అనుకూలంగా శోభాయమానంగా ఉందట. నాగాంబిక ఈ తటాకాన్ని త్రవ్వించిన సంవత్సరం సౌమ్య సంవత్సరం, మీన చైత్ర శుభతిథినాడు వేయించినట్లు తెలుస్తుంది. శ.సం. 1351 = క్రీ.శ. 1429.

ఈ నాగసముద్రం అందరిచేత శ్లాఘించబడింది. ధర్మవృద్ధి కలిగించడానికి ఈ తటాకం ప్రతిష్ఠిచబడింది. ఈ నాగలమ్మ చెరువు సాగరాలు ఉన్నంతవరకు,

చంద్రుడు ఉన్నంతవరకు, జగత్తులో రాముని చరిత్ర ఉన్నంతవరకు, జగన్మిత్రుడైన రాముడున్నంతవరకు శాశ్వతంగా జీవించి ఉండుగాక. అంటే సర్వకాల సర్వావస్థలందు ఈ తటాకం ప్రజలకు ఉపయోగకరంగా ఉండుగాక అని ఆశిస్తూ తటాక నిర్మాణం జరిగినట్లు తెలుస్తుంది.

## మైలమ

మైలమ విరియాల వంశంలో అన్నయ – ఐతమ దంపతులకు పుట్టిన గొప్ప స్త్రీ రత్నం. ఈమె మల్యాల వంశానికి చెందిన వీరుడైన చౌండసేనానిని పెండ్లాడినది. ఈమె తన భర్త గణపతి దేవ చక్రవర్తి ఆజ్ఞను అనుసరించి యుద్ధాల్లో పాల్గొని, కాకతీయ సేనలకు నాయకత్వం వహించి చోడెరాజును జయించిన సందర్భంలో ఒక శాసనాన్ని వేయించింది. అదే కటుకూరు శాసనం. శ.సం1124 = క్రీ.శ. 1202లో దుందుభి నామ సంవత్సరంలో వేయించబడిన ఈ శాసనం పూర్తిగా సంస్కృతశ్లోకాలతో నాలుగువైపుల 204 పంక్తుల్లో చెక్కబడి ఉంది.

శాసనంలో ముఖ్య అంశం మైలమ కటుకూరులో ఏకోత్తరాం భవన వింశతి (21 శివాలయాలు) నిర్మించి అందులో పూజాదికాలు నిర్వహించడానికి భూమిని, తటాకాన్ని దానమిచ్చి విషయం పేర్కొనబడింది. 21 శివలింగారు ప్రతిష్టించి 21 శివాలయాలు కట్టకూరు గ్రామంలో కట్టించింది. ఎక్కడైనా శివాలయాలు అష్టమూర్త్యాత్మకంగా 8 ఉంటాయి. కాని భూమి మీద 21 శివాలయాలను చాలా మహిమాన్వితంగా మూడు మంటపాలతో త్రికూటాత్మకంగా మైలమ నిర్మించింది. ఈ ఆలయాల్లో శివలింగాలు ఏవిధంగా ఉన్నయంటే నిర్మలమైన నివాసంలో ఎదురుగా అద్దంలో స్పష్టంగా కనిపించే శివలింగం ప్రత్యక్షంగా శివుడిని సాక్షాత్కరిస్తున్నట్లుగా ఉన్నాయట.

కటుకూరు గ్రామంలో మైలమ రెండు తటాకాలను త్రవ్వించింది. ఆ తటాకాల్లో దేవగంగను తలపించేవిధంగా ఆకాశగంగా తీర్థంగా భావించి హంసజంట విహరిస్తున్నాయట. అంటే ఆ తటాకాల్లోని నీరు అంత స్వచ్ఛంగా, తేటగా ఉ న్నాయని అర్థం.

ఈ ఆలయాలను నిర్మించిన సందర్భంలోనే కట్టకూరు గ్రామంలో నిగ్రహానుగ్రహాలతో ఆమె రెండు అగ్రహారాలను బ్రాహ్మణులకు దానం చేసింది.

ఆ సందర్భంలోనే శయ్యను, గోవును, భూమిని, బంగారాన్ని, అన్న వస్త్రాదులను జీవితకాలానికి సరిపోయేవిధంగామళ్ళీ మళ్ళీ దానంగా సమర్పించి పండితులందరు తమ ఆమోదాన్ని తెలిపినారు. ఆమె వారిచే ఎన్నడూ నిందించబడలేదు.

**"గంగా వక్రగతిర్వ్విమార్గ్గగమనా సారుంధతీ సర్వ్వదా**
**భూరేషాచ భుజంగభోగ నిరతా సీతా కుజన్మా తథా ।**
**పాంచాలీ బహువల్లభా ప్రనితా జాతా జడాదిందిరా**
**నిర్ద్దోషా గుణినీచ యస్య గ్రిహిణీ తాసూపమేయాకయా ॥**

గంగాదేవి పవిత్రమైనదైనను వక్రమార్గంలో పయనిస్తుంది. పతివ్రతా శిరోమణి అయిన అరుంధతి ఆకాశగమనగా ఉంటుంది. భూమి క్షమా గుణం కలిగినదైనా శేషుని ఫణములపై ఉంటుంది. పతివ్రత అయిన సీతాదేవి భూజాతాగా ఉంది. ద్రౌపదీదేవి ఐదుగురు భర్తలను కలిగి ఉంది. లక్ష్మీదేవి జడమైన సముద్రంలో పుట్టింది. పురాణాల్లో పేర్కొనబడ్డ ఈ పతివ్రతలందరూ ఏదో ఒక దోషాన్ని కలిగి ఉన్నారు. కానీ ఎటువంటి దోషాలు లేకుండా మైలమ సకల గుణాలంకృతగా ఉండి, వారితో పోల్చడానికి వీలు లేకుండా ఉందని వర్ణించబడింది.

## మైలాంబిక

తెలంగాణ ప్రాంతంలో గల మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం మండలాలతో తెలుగు చోడ వంశీయులలో ఒక శాఖవారైన కందూరిచోడులు విశాల సామ్రాజ్యాన్ని స్థాపించి పరిపాలన చేసినారు. వీరు కళ్యాణీ చాళుక్యులకు సామంతులుగా ఉన్నారు. కాకతీయులు కూడా చాళుక్యుల సామంతులే. కొంత కాలం కాకతీయులకు కూడ సామంతులుగా ఉండి ఆ తర్వాత స్వతంత్ర రాజన్యులైనారు.

రెండవ ఏఋవ తొండయ చోడుని (తొండరస చోడుడు) భార్య మైలాంబిక. ఈమె ద్రాక్షారామంలో ఒకటి, పానుగల్లులో రెండు శాసనాలు వేయించినది. పానుగల్లు శాసనాలు రెండింటిలో ఒకటి శాసన కాలం లేదు. మరొకటి శ. సం. 1046 = క్రీ.శ. 1124 నాటిది. క్రోధి సంవత్సరం సూర్యగ్రహణ సమయంలో వేయించబడినది.

ఈ శాసనం పానుగల్లు పచ్చల సోమేశ్వరాలయంలో ఉంది. మైలాంబిక తొండరస మహారాజు దంపతులకు ముగ్గురు కొడుకులు. ఉదయాదిత్యుడు, భీమదేవుడు, గోకర్ణుడు. మైలాంబిక తన రెండవ కుమారుడైన భీమదేవ చోడుని క్షేమం కాంక్షించి అష్టోత్తర శత (108) మంది బ్రాహ్మణులకు అగ్రహారమును ఇచ్చి శాసనం వేయించింది. ఈ అగ్రహారానికి చోడ భీమ నారాయణపురం అని పేరు పెట్టడం జరిగింది.

శాసనంలో ఈ అగ్రహారంలో ఉండే నకరంలో (వ్యాపారసంస్థలు) చెల్లించవలసిన సుంకాలు పేర్కొనబడ్డాయి. శాసనంలో మైలాంబిక "మేనకా హిమవంతులకు పార్వతీదేవి జన్మించినట్లు తల్లి బెడంగదేవికి, మహారాజైన తన తండ్రికి జన్మించిందట. విష్ణుమూర్తిని లక్ష్మీదేవి పరిణయమాడినట్లు తొండరసచోడుని మైలాంబిక పెండ్లి చేసుకున్నదట. ఇంకా ఈమె విద్యావంతులచే అపర సరస్వతిగా కొనియాడబడింది. సేవకులు ఆమెను తమ కులదేవతగా భావించి పూజించేవారట. ఆమెను ఆశ్రయించిన వారికి అన్ని సంపదలను ఇచ్చే కరుణామూర్తిగా, వీరపత్నిగా, వీరమాతగా కీర్తించబడింది.

కాకతీయుల కాలంలో స్త్రీలు అన్నిరంగాల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. దానాలు చేయడంలో కాని, రాజ్య వ్యవహారాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నిర్వహించడంలో కాని, దేవాలయాలు, మఠాలు నిర్మించడంలో, చెరువులు త్రవ్వించడంలో అంతటా తామే అయి రాజకీయ, సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక వ్యవస్థలో తమ స్థానం సుస్థిరపరచుకున్నారు. తమ దాతృత్వంతో ప్రజలకు అనేక సౌకర్యాలను కల్పించారు.

* * *

# ఆధ్యాత్మిక సంస్కృతి – అచలం

**డా॥ వి.త్రివేణి**

మనిషి ఆలోచన సరణికి సంబంధించిన ప్రతి పార్శ్వం సాంస్కృతికం. ఆధ్యాత్మిక తత్త్వ బోధను తనదైన అంతర్ముఖంతో ఆవిష్కరించిన అచలతత్త్వం సాంస్కృతిక ఉద్యమంలో ఒక భాగం. తెలంగాణ ప్రాంతానికి చెందిన శ్రీమద్రామడుగు శివరామ దీక్షితుల చేత ఆవిర్భవించబడి, దాదాపు దక్షిణ భారతదేశమంతా వ్యాపించబడిన అత్యున్నత తత్త్వం అచల సిద్ధాంతం. ఇది తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతిలో భాగమైన ఒక విశిష్ట శాఖ.

అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం, శుద్ధాద్వైతం, సత్యాద్వైతం, నింబాద్వైతం, త్రైతం, కర్మ జ్ఞాన ధ్యాన భక్తి యోగాలు, ప్రాణాయామాదులు, యమనియమాదుల వంటి సాధనలు, పరాశక్తి, బ్రహ్మ, పరబ్రహ్మ, జీవబ్రహ్మైక్యం, ఆత్మదర్శనం వంటి జ్ఞానమార్గాలు ఆధ్యాత్మిక సాంస్కృతిక సమాజానికి నూతనమైన శమచైతన్యాదులను అందించాయి. అందులో అచలతత్త్వం పాత్ర అత్యంత కీలకం.

అచల పరిపూర్ణధ్యానంలో అచలం 'సనాతనం' అని తెలుస్తుంది.

శ్లో ॥ **పూర్వమేవ నిరాలంబం । ఆగ్నేయం నిర్గుణం తథా ॥**
**దక్షిణే నిత్య శుద్ధంచ । నైఋుత్యో నిరుపద్రవం ॥**

శ్లో ॥ **పశ్చిమం నిష్కళంచైన । వాయవ్యేచ నిరంజనం ॥**
**ఉత్తరేచ నిరాకాస । మీశాన్యోనిర్మలో భవేత్ ॥**

శ్లో ॥ **ఊర్ధ్వమేవ నిరాకారం । అధశ్చ నిర్వికారక ॥**
**అంతర్బహిశ్చ సర్వత్ర । అచలోయం సనాతన ॥**

పూర్వం – నిరాలంబం, ఆగ్నేయం – నిర్గుణం, దక్షిణం – నిత్యశుద్ధం, నైఋుతి – నిరుపద్రవం, పశ్చిమం – నిష్కళం వాయువ్యం–నిరంజనం ఉత్తరం – నిరాకాసం ఈశాన్యం – నిర్మలం ఊర్ధ్వం – నిరాకారం, అధశ్చం –

* **అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్**

నిర్వికారం  అంతరం – బహిరం, సర్వత్రం–అచలం. సర్వదిక్కులలో ప్రతిబింబించేది అచలం. ఈ అచలం సనాతనం.

'అచలం' పద వివరణ అక్షరాన్వయంలో తెలుపబడింది.

**అ– అభావం శివం అశివం నవిశ్యతే**

**చ– చలాచల శరహొత కేవలాత్మః**

**ల– లక్ష్యాలక్ష్య రహితాతీతం కేవలం**

**ము– మూలాలీల రహితమె పరిపూర్ణం**

అచలం పదస్వరూపంలో గాని, స్వభావంలో గాని పూర్తిగా మిగతా దార్శనిక సిద్ధాంతాలతో విభేదిస్తుంది. అచల తత్త్వం ప్రకారం జీవుడికి గుణాలుంటాయి. తాను చేసుకొన్న కర్మల వల్ల మరల జన్మ ఉపాధులను పొందుతున్నాడు. జనమరణాదులను అనుభవిస్తున్నాడు. ప్రకృతిని అనుసరిస్తున్నాడు. అందువల్ల జీవుడు పరబ్రహ్మం కాదు. గుణములు లేనివాడు, జన్మాదులు పొందనివాడు, మూల ప్రకృతిని అనుసరించనివాడు పరబ్రహ్మం. ఈ పరబ్రహ్మమే అచలం.

అచల తత్త్వాన్ని ప్రతిపాదించిన వారు శ్రీమద్రామడుగు శివరామ దీక్షితులు. వీరు క్రీ.శ. 18వ శతాబ్దంలో తెలంగాణా ప్రాంతంలోని నల్లగొండ జిల్లాసమీపంలో సూర్యాపేట గ్రామ శివారులో ఒక బ్రహ్మణ కుటుంబంలో జన్మించారు. బాల్యం నుంచి చతుర్వేదసారాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. అందులో గల 1. ప్రజ్ఞానం బ్రహ్మ 2. అహం బ్రహ్మాస్మి 3. తత్త్వమసి 4. అయమాత్మాబ్రహ్మ – అనే నాలుగు మహా వాక్యముల సారంతో తృప్తి చెందక, వీటికి అతీతంగా బ్రహ్మమొకటి ఉండి ఉండవచ్చుననే ఉద్దేశంతో సద్గురు అన్వేషణ కోసం దేశాటనను ప్రారంభించారు. అదే సమయంలో పండరీపుర క్షేత్రంలో సద్గురు శ్రీధరస్వామిని సేవించి, ఆ స్వామి కృపచేత 'సర్వం అచలం, అది నిరాకారం, నిరామయం' అని తెలుసుకొన్నారు. పరబ్రహ్మ స్వరూపం బట్టబయలని, పరమపదం స్వచ్ఛమైందని గ్రహించి అచల సిద్ధాంతమనే ఆధ్యాత్మిక తత్త్వాన్ని రూపొందించారు. పండిత పామరులకు సైతం అందుబాటులో ఉండేటట్లుగా, అతి సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా శ్రీమద్రామడుగు శివరామదీక్షితులు గురు స్థానాన్ని వహించి, శిష్యకోటికి జన్మరాహిత్యానికి సంబంధించిన అచల తత్త్వాన్ని బోధించారు. నాటినుంచి అచల

తత్త్వం బహు ప్రాంతాల్లో విస్తరించి సాంస్కృతిక చైతన్యంతో పాటు సామాజిక పరివర్తనను కలిగించింది. స్వచ్ఛమైన దార్శనికతత్త్వాల్లో ఇది ఒక ఆధ్యాత్మిక ఉ ద్యమం.

తత్త్వశాస్త్ర ఆవిర్భావానికి భారతదేశం ఆదిగురువు. ప్రపంచ దేశాలన్నింటికి మార్గదర్శనం భారతదేశం. భారతీయ దార్శనిక తత్త్వాలు సాంస్కృతిక శాఖల్ని పరిపుష్టం చేసి మానవులందరికి అచంచలమైన ఆధ్యాత్మిక భావనలను ప్రేరేపించాయి. కాని విదేశీయుల పాలన సామాజిక సాంస్కృతికాంశాల్లో అనేక మార్పులు సంభవించాయి. భక్తితత్త్వ ఆధ్యాత్మిక బోధనలపైన  ఆంక్షలు విధించబడ్డాయి. ప్రచారాలపై నిషేధాలు ఏర్పడ్డాయి.

తెలంగాణలో అసఫ్‌జాహి పాలనలో తాత్త్విక విషయాలను యోగులు సాధువులు బహిరంగంగా వెల్లడించలేక పోయారు. అందుకోసం అంతర్ముఖమైన సాధనా ప్రవృత్తిని అనుసరించారు. గృహస్థ జీవనంలోనే ఉండి యోగులుగా తమ జ్ఞానాన్ని సమాజపరం చేయడానికి ఎందరో ప్రయత్నించారు. వారిలో భక్త రామదాసు, రాకమచర్ల వెంకటదాసు, మన్నెంకొండ హనుమద్దాసు, బీబీపేట హనుమద్దాసు, చిదానందయోగి వైశ్యరత్న శ్రీబాగయ్య గారు చెప్పుకోదగ్గవారు. వీరందరు సమాజ శ్రేయస్సునాకాంక్షించి భక్తి తత్త్వసంకీర్తనలను అందించిన వాగ్గేయకారులు. వారు రచించిన సంకీర్తనల్లో గానీ, శతకాల్లోగానీ, కావ్యాల్లో గానీ, జానపద ప్రదర్శన కళల్లో గానీ తమ భక్తిని, తత్త్వాన్ని అంతర్లీనంగా అందించటానికి అనేక ప్రయత్నాలు చేశారు. తత్త్వప్రచారానికి తమకు అనువైన మార్గాన్ని అనుసరించారు.

తెలంగాణలో నిజాం పాలనలో అష్టకష్టాలు పడి కూడా మట్టిలో మాణిక్యంలా వెలుగొందిన ఆధ్యాత్మిక గురువులు తమ తత్త్వ బోధతో నాటి ప్రజల్లో ఆత్మానందాన్ని కలిగించారు. కడగండ్ల లాంటి గ్రామీణ జీవితం, తిండి గింజలకు నోచుకోని దౌర్భాగ్యం, రజాకార్ల దాష్టీకం, ప్రజల అవిద్య, అజ్ఞానం వంటి తెలంగాణ జీవన శైలిని అధ్యయనం చేసిన తత్త్వబోధకులు లౌకిక జీవన పోరాటాల నుంచి ముక్తిని పొందే శాంతి మార్గాన్ని ఉపదేశించారు. తెలంగాణా విభిన్న రాజకీయ, చారిత్రక, సామాజిక పరిస్థితుల కారణంగా అచల తత్త్వం, మిగతా ప్రాంతాల కంటే తెలంగాణా ప్రాంతంలో అధికంగా ప్రచారాన్ని పొందింది.

అచల తత్త్వం ప్రతిపాదనకు బీజం పడింది తెలంగాణ ప్రాంతంలోని నల్లగొండ సమీపంలోనే, ఎందుకంటే శ్రీమద్రామడుగు శివరామదీక్షితులు సూర్యాపేట ప్రాంతానికి చెందినవారు కావడం. అక్కడే అతని వంశీకులు నివాసం ఉన్నట్లుగా, అతని సమాధి కూడా అక్కడ ఉన్నట్లుగా తెలుస్తుంది. అటు తర్వాత హైద్రాబాదు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, కరీంనగర్, నిజామాబాదు, వరంగల్లు, అదిలాబాదు, ఖమ్మం వంటి తెలంగాణా జిల్లాలన్నింటిలో ఈ తత్త్వం విస్తరించింది. క్రమంగా అచల ఆధ్యాత్మిక ఉద్యమం దక్షిణ భారతదేశమంతా వ్యాపించిందని తెలుస్తుంది. తెలంగాణా జిల్లాల్లో చాలా పల్లె ప్రాంతాల్లో, చాలా కుటుంబాల్లో ఈ అచల తత్త్వాన్ని అనుసరిస్తున్నారు. మా తాతగారు శ్రీవంగరి వెంకయార్యులు, మా పెద్దనాన్నగారు శ్రీనారసింహార్యులు, మా నాన్నగారు శ్రీ నారాయణార్యులు అచల పరిపూర్ణ బోధను స్వీకరించి, గురు పీఠాన్ని అధిష్టించారు కూడా.

యాజ్ఞవల్క్యుడు, జనకుడు, శుకుడు, సాందీపనీ, ఈశ్వరుడు, అంబికాశివయోగి, వేమనయోగి, శ్రీధరస్వామి, శివరామ దీక్షితులు, కంబలూరు అప్పబ్రహ్మం… ఇలా వీరందరూ అచల తత్త్వవాదులు, అచల వేదాంతులు, అచల పరిపూర్ణయోగులు. వీరితో పాటు వీరబ్రహ్మేంద్ర స్వామి, సిద్ధప్ప ఈ కోవలోకే చేరుతారు. ఇస్లాంలో భాగమైన 'చిస్తీ' లు కూడా అచల పరిపూర్ణులే అని కొందరు భావిస్తారు.

మొదట అచల పరిపూర్ణానికి అర్థం చెప్పుకుంటే 'అచలం' అనగా చలనం లేనిది, కదలనిది, చలించనిది, స్థిరంగా ఉండేది. 'పరిపూర్ణం' అనగా నిండుగా ఉన్నది. అంతటా పూర్ణమైనది. పూర్ణం కంటే కూడా దృఢంగా ఉన్న నిండుదనం. స్పష్టమైన అర్థ వివరణతో గల అచల సిద్ధాంతం ఒక భ్రాంతిరహిత సిద్ధాంతం. లేని మాయా/ఎఱుక అనేది భ్రాంతి సహిత సిద్ధాంతం. గురుతులేనిది గురుపదం. గురుతు సహితమైంది లేని మాయా/ఎఱుక. సూర్యోదయం అయితే చీకటి ఎలా లేకుండా పోతుందో గురుబోధ వల్ల లేని మాయా/ఎఱుక లేకుండా పోతుంది. సచల మతాలు సచల సిద్ధాంతాలు గురుతు సహితమైనటువంటివి. అచల తత్త్వం గురుతులేనిది. సాధనారహితమైంది.

అచల ఋషి సంప్రదాయక

|

నిజగురు పరంపర

|

శ్రీమన్నారాయణుడు

|

సూర్యభగవానుడు

|

యాజ్ఞవల్క్యుడు

|

జనకుడు

|

శుకుడు

|

సాందీపని

|

శ్రీకృష్ణుడు

అర్జునుడు　　ఉద్ధవుడు

అచల సిద్ధాంతం నిజగురు పరంపర

- శ్రీధర స్వాములు
  - శ్రీమద్రామడుగు శివరామదీక్షితులు (అచల సిద్ధాంత స్థాపకులు)
    - శ్రీమత్ కంబలూరి అప్పయ్య మంత్రి
      - శ్రీమత్ పరశురామ నారసింహస్వామి
      - శ్రీమత్ పరశురామ సీతారామస్వామి (భద్రాద్రి రామశతకం)
        - శ్రీమత్ భాగవత కృష్ణదేశిక ప్రభువులు (శుద్ధ నిర్గుణ తత్త్వ కందార్థ దరువులు)
          - శ్రీమహాయోగిని శేషమాంబ
          - శ్రీమత్ పీల్ఖాన లక్ష్మణదేశికులు
          - శ్రీమత్ పీల్ఖాన శంకర దేశికులు
            - శ్రీ అమర లింగయార్యులు
              - శ్రీ బత్తిని పోచయార్యులు
                - శ్రీ బత్తిని లక్ష్మణార్యులు
                  - శ్రీసామల సదానంద బాల్‌రాజార్యులు (సదానందాశ్రమ స్థాపకులు)
              - శ్రీ వనమాల దశరథ
              - శ్రీ అచల పరిపూర్ణ వంగరి వెంకయార్యులు
                - శ్రీ నిర్మలానంద వంగరి నారసింహార్యులు
                  - శ్రీవంగరి నారాయణార్యులు

అచల సిద్ధాంతం మూడింటిని గూర్చి తెలియజేస్తుంది 1. అచలం 2. ఎఱుక 3. జగత్తు. ఎప్పటికీ ఉన్నది అచలం. ఎప్పుడూ లేనిది ఎఱుక, కల లాంటిది జగత్తు.

**1. అచలం :** ఎప్పటికి ఉన్నది అచలం. చెప్పడానికి, చూపించడానికి వీలు కానిది. అనుభూతికి, ఊహకు అందగరానిది. తాను లేకపోవుట, లేనని జాగ్రత్త నొందుట మాత్రమే పరిపూర్ణ స్థితి. అదే అచలం.

**'పుట్టుట గిట్టుట లేకను**

**పుట్టెటి గిట్టెటి యెఱుక పోడిమియు యెఱుకన్**

**చట్టువలె కదలకుండును**

**బట్టబయల్ యిట్టి దెరిగి భావింపదగున్'** (శుద్ధ నిర్గుణ తత్త్వ కందార్థము)

జనన మరణాలు లేనిది పరమ పదం. జనన మరణాలు పొందేది ఎఱుక. ఏమి ఎఱుగక ఎఱుగడానికి రూప నామాలు లేక ఉండేది అచలం. అది స్థిరమైంది. పరిపూర్ణమైంది. ఏమి లేనిది, ఏమి కానిది, గ్రహించేది లేనిది, తెలిసిందంతా లేనిది, లేనిదంతా తెలుసుకొనేది అచల పరిపూర్ణ తత్త్వం. అందుకే 'లేనిది' అనగా ప్రకృతి. అది అసత్యం, అనిత్యం. 'ఉన్నది' అనగా బ్రహ్మం. అది సత్యం, నిత్యం. ఇంద్రియాలకు ఏదైతే తోచటం లేదో, పంచతన్మాత్రలకు ఏదైతే అందటం లేదో అదే అంతటా ఉంది. అదే పరిపూర్ణం.

సంకల్ప భ్రాంతిలో ఉన్న మానవులు సమస్త రూప నామాలతో ఎఱుకను కలిగి మరుపు చేత ఈ ప్రకృతి అంతా సత్యమని భావిస్తున్నారు. కాని మానవులు అనుసరిస్తున్న సంకల్ప భ్రాంతి అంతా కల. కల నుంచి మేల్కొంటే, కల అనుభవం ఏమీ ఉండదు. కలలో తోచే జగత్తు, కలలో తోచే శరీరాలు మేల్కొన్న తర్వాత ఏమీ ఉండవు. అలాగే ఈ కనిపించే జగత్తు, ఈ కనిపించే శరీరాలు కూడా కల. ఈ కల ఎలాంటిదంటే సర్వభ్రాంతి అధ్యారోపం వంటిది. భ్రాంతి సహిత విధానమంతా లేనిది. భ్రాంతి రహిత విధానమంతా ఉన్నది. ఉన్నది ఉన్నట్లు, లేనిది లేనట్లు, ఉలుకు లేక పలుకు లేక ఉన్నదే అచలం. సమస్త రూప నామాలన్ని భ్రమ, మాయ, మరుపు. మరుపు నుంచి మేల్కొని చూస్తే అంతా ఏమీ లేదు. అదే అచలం.

**2. ఎఱుక :** ఎప్పుడూ లేనిది ఎఱుక. ఎరిగేది, వినేది, చూచేది, తెలిసేది ఎఱుక. ఎఱుకంటే సంకల్పం. సంకల్పమంటే కల్పన. కల్పన అంటే లేనిది. ఎప్పుడూ లేనిది, కాని ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఉన్నట్లు అనిపించేది ఎప్పుడూ లేనిది. అదే మాయ. ఈ మాయ ఎండమావుల వలె, కుందేటి కొమ్ములవలె, గొడ్రాలి బిడ్డవలె, రజ్జుసర్ప భ్రాంతివలె, ఆకాశ పుష్పాల వలె లేకనే ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ మాయ కలలో తోచే శరీరాల వంటిది. కలలో తోచే శరీరాలకు ఎలా మూలంలేదో, ఈ కనిపించే శరీరాలకు అలా మూలం లేదు. ఈ కనిపించే శరీరంలో ఉన్న చైతన్యం కలశరీరం వంటిది. ఈ గుర్తెరిగే చైతన్యం కలశరీరం వంటిది. అందుకే కల శరీరాలకు, ఈ శరీరాలకు భేదం లేదు.

'నేను' అన్నదానిని అద్వైతం 'ఆత్మ' అని, విశిష్టాద్వైతం ' ఈశ్వరుడు' అని, ద్వైతం 'జీవుడు' అని పేర్కొన్నాయి. ఇన్ని నామములతో ఉన్న నేను అన్నదానిని అచలం 'మాయా/ఎఱుక' అంటుంది. ఈ మాయా స్వరూపులే అందరూ. సమస్త లోకాలు, లోకేశులు, లోకస్థులు అన్నీ మాయా ఎఱుక. ఇవన్నీ సమస్త రూప నామములు కలవి. శాశ్వతం కానివి. అయినా ఇవి ఉన్నట్లు అనిపిస్తున్నవి. ఈ ఎఱుకయే మాయ. ఈ ఎఱుక స్వజాగ్రత లేక అజాగ్రత అన్న మరుపులో నిలిచి ఉంటుంది. ఈ మరుపుతోనే తన్ను తాను మరిచి, ఈ మరుపుతోనే సమస్త కర్మలు చేసి, ఈ మరుపుతోనే ఒక శరీరాన్ని వదిలి, ఈ మరుపుతోనే వేరొక శరీరంలో జన్మించి, మళ్ళీ ఈ మరుపుతోనే కర్మలను అనుభవిస్తూ ఉంటుంది. ఈ మరుపు ఎంతవరకు ఉంటుందంటే ఎఱుకకు స్వజాగ్రత్త కలుగనంతవరకు ఉంటుంది. ఇది నిజమని ఎవరు భావిస్తారో అట్టివారికి జన్మరహితం కాదు.

**చింతల తోటన నెఱుకే**

**వింతల పుట్టిల్లనంగ వెలసిన దెఱుకే**

**తంతుల పేటన నెఱుకే**

**పంతములకు చూడ మూల బలమది యెఱుకే ।**

**(జగజ్జనన స్థలమన్ననెఱుకే । భ్రాంతులకెల్లన్।)** (శుద్ధ నిర్గుణ తత్త్వ కందార్థము)

**ఎఱుక విధానం –** సంకల్పాలకు మూలమైంది, వింతలకు పుట్టినిల్లు, పంతములకు కారణంగా సర్వరూపులతో జగత్తు అంతా తానేనని, మరియొకటి లేదని, తనకు కలిగిన మరుపుతో తాను సత్యమని భావిస్తూ ఉన్నదే లేని మాయా/ఎఱుక.

**ఎఱుక ఉత్పత్తి –** టెంకాయలోకి నీరు వచ్చినట్లుగా మనకు తెలియకుండానే మరుపులో ఎఱుక ఉత్పత్తి అవుతుంది.

**ఎఱుక లయం –** ఏనుగు మ్రింగిన వెలగకాయలను గుజ్జు లేకుండా విసర్జించినట్లుగా ఎఱుక అనుభవంతో లయం అవుతుంది. ఏదైతే కనిపిస్తుందో, అది లేనే లేదనే నిరసన వ్యక్తం అవుతుంది. సర్వభ్రాంతిని తొలగిస్తుంది. ఈ భావనను అచల సిద్ధాంతం కలిగిస్తుంది.

**ఎఱుక స్వరూపం –** అరటి స్తంభం పొరలన్నీ తీసివేస్తే చివరకు మూలమే ఉండదు. అలాగే లేని మాయా ఎఱుక మన మరుపుతో అరటి స్తంభం వలె అనిపిస్తుంది. అచల బోధ భ్రమ అనే బీరచిక్కును విడదీసి, ఎఱుకను ఏమీ లేనిదని తెలిపి, సంకల్పమనే కూకటివేళ్ళను పెరికివేస్తుంది. ఇలాంటి విచారణ అచలేతర సిద్ధాంతాలకు లేదు.

**3. జగత్తు :** జగత్తు ఉన్నట్లు, ఇది సత్యమని, ఇది నిత్యమని అనిపిస్తుంది ఈ లేని జగత్తు కేవలం భ్రమల చేతనే సత్యంగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ కనిపించే శరీరాలకు మూలం ఉన్నట్లు చెప్పడం కేవలం భ్రమ. స్వప్నంలో దేహాలకు మూలం లేనట్లు, ఈ గుర్తెరిగే దేహాలకు మూలం లేదు. దేహి(ఆత్మ) కలది మేడిపండు వంటిది. దేహిని కలిగిన దేహం పరాప్రకృతికి చెందిన వేపకాయ వంటిది. దేహి దేహములు సత్యమని భావించటం భ్రమ. అలాంటి వారు ఎన్నటికీ గురుపదం ఎరుగరు.

ఈ జగత్తు కల జగత్తు. ఈ గుర్తెరిగే దేహాలు కలలో కనిపించే మూలంలేని దేహాలు. అంటే కలలో కనిపించే జగత్తుకు జాగ్రత్తలో గుర్తెరిగే జగత్తుకు తేడా లేదు. ఈ పూర్ణ సిద్ధాంతం తెలియని వారందరు నిద్రావస్థలో కనిపించిన జగత్తు మేల్కొన్న తర్వాత ఏమీ లేదని గ్రహించి కూడా ఈ గుర్తెరిగే జగత్తును మాత్రం సత్యమని భ్రమిస్తారు. కాని కలలో కనిపించే జగత్తు బాహ్య జగత్తు. బాహ్య జాగ్రత్తలో గుర్తెరిగే జగత్తుకు తేడా ఏమీలేదని తెలుసుకోవాలి. కల జగత్తు వంటిదే ఈ గుర్తెరిగే

జగత్తు. కాని ఈ జగత్తు సత్యంగా అనిపిస్తుంది. ఈ మరుపునే అజాగ్రత్త వల్ల సమస్తం సత్యమని అనిపిస్తుంది. అందుకే ఎరుక భావాన్ని తెలుసుకొని భ్రాంతి రహితం కావాలని అచల తత్త్వం బోధిస్తుంది.

**భ్రాంతి :** సమస్తం లేకనే తోచేది భ్రాంతి. ఇది అధ్యారోపం. రజ్జుసర్పభ్రాంతిలో రజ్జువు (తాడు) మీద సర్పం అధ్యారోపితమౌతుంది. దీనినే భ్రాంతి అంటారు. ఈ లేక తోచే లేని మాయా/ ఎఱుక ఎండమావుల వలె భ్రమరూపంగా తోచుతుంది. ఎండమావులు లేనివి అయినా నీళ్ళవలె ఏ విధంగా ఉన్నట్లు అనిపిస్తుందో, ఆ విధంగా సర్వజగత్తు సర్వరూపు నామాలు లేనిది అయినా ఉన్నట్లు అనిపిస్తుంది. పరిపూర్ణం మినహా సమస్త రూప నామాలు మాయే. అట్టి మాయే భ్రమ. భ్రమ లేనిది బ్రహ్మం (అచలం)

**బ్రహ్మం :** భావింపరానిది బ్రహ్మం. అది అవాఙ్మానస గోచరం. మనస్సుకు, వాక్కుకు, జ్ఞానానికి అగోచరం. సమస్త రూప నామాలు లేని పరిపూర్ణం తెలుసుకొన్నప్పుడే జన్మరాహిత్యం పొందగలం. బ్రహ్మం చేరగలం.

అచల తత్త్వం ద్వైతాద్వైత విశిష్టాద్వైతాలకు అతీతమైంది. జీవుడిని, బ్రహ్మను– ఒకటిగా చూపేది అద్వైతం. జీవుడిని, బ్రహ్మను –భక్తితో చూపేది విశిష్టాద్వైతం. జీవుడిని, బ్రహ్మను–రెండింటిని వేరుగా చూపేది ద్వైతం. జీవుడిని గాక, బ్రహ్మను గాక కేవలం 'అచలం' మాత్రమే చూపేది అచలతత్త్వం.

అచలతత్త్వం త్రిగుణాతీతమైంది. త్రిగుణాలు త్రిమూర్త్యాత్మక స్వరూపమైనవి. ఆ స్వరూపం ఓంకారం. ఓంకారంలోని అకార–ఉకార–మకారాలే గుణత్రయం. రజో గుణం బ్రహ్మ, తమోగుణం రుద్రుడు(శంకరుడు), సత్వగుణం విష్ణువు. త్రిగుణ రూపనామాలతో ఉన్న ఈ సమస్తం అచలం కాదు. గుణ రూప నామాదులు లేనిదే అచలం. అఖిలం అచలం. అదే పరిపూర్ణం.

అచలతత్త్వం సాంఖ్యానికి అతీతమైంది. పిండబ్రహ్మాండాల ఉత్పత్తి సాంఖ్యంలో చెప్పబడింది. 'బ్రహ్మరో అవ్యక్తం ।అవ్యక్తో మహత్ । మహత్ మదాహంకార।మదాహంకారో పంచతన్మాత్రాని। పంచతన్మాత్రో పంచభూతాని। పంచ భూతేభ్యో సర్వం జగత్।' ఇది జగత్తు ఆవిర్భావ క్రమం. బ్రహ్మం నుంచి అవ్యక్తం (మూల ప్రకృతి). అవ్యక్తం నుంచి మహత్తు. మహత్తు నుంచి అహంకారం,

అహంకారం నుంచి పంచతన్మాత్రలు, పంచ తన్మాత్రల నుండి పంచభూతాలు, పంచభూతాల నుంచి జగత్తు సృష్టించబడిందని సాంఖ్యం చెబుతుంది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనే పంచతన్మాత్రల నుంచి ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి అనే పంచభూతాలు సృష్టింపబడ్డాయి. శబ్దం నుంచి ఆకాశం, స్పర్శ నుంచి వాయువు, రూపం నుంచి అగ్ని, రసం నుంచి జలం, గంధం నుంచి పృథివి ఆవిర్భవించాయి. జగత్తు ఆవిర్భావం, జగత్తుయందు గుణక్రియ రూప నామబేధాలతో జీవుడు ఉద్భవిస్తున్నాడు. ఆ జీవుడు ఏదో ఒక దేహాన్ని ఆధారంగా చేసుకొని నిలయమై ఉంటాడు. జీవుడు దేహంలో ఉన్నంతవరకు అతడు చైతన్య స్వరూపుడు. అందుకే జీవుడు ఎఱుక. జీవుడికి దేహానికి మధ్య సచ్చిత్ సంబంధం ఉంటుంది. సత్–జీవుడు, చిత్–దేహం, జీవుడు–చైతన్యుడు. దేహం–జడం. చైతన్యం లేనిదే దేహం లేదు. దేహం లేనిదే చైతన్యంలేదు. చైతన్యం కానీ, జడం కానీ ఈ రెండునూ అచలం కాదు. అచలం నిర్గుణమైంది. నిరాకారమైంది. స్వచ్ఛమైంది. శుద్ధమైంది. అనిర్వచనీయమైంది. 'పల్కులేనిదే బ్రహ్మమూ। బ్రహ్మమని పలికేదే – ఇక శూన్యమూ' అని అంటారు అచల తత్త్వవేత్తలు.

కర్మ, జ్ఞాన, భక్తి, యోగాలకు అతీతమైంది అచల తత్త్వం. కర్మయోగానికి అతీతమైంది అచలం. ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మల వల్ల కర్మబంధాలు ఏర్పడుతాయి. అచలానికి కర్మలే లేనప్పుడు కర్మబంధాలు ఏర్పడటం అసంభవం. జ్ఞానయోగానికి అతీతమైంది అచలం. ఈ తత్త్వంలో జ్ఞానం అంటే ఎఱుక. అందుకే అచలం జ్ఞానరహితమైంది. నవవిధ భక్తిమార్గ యోగానికి అతీతమైంది అచలం. భక్తియోగమంతా మనఃస్థితికి చెందింది. ఈ భక్తి సాధనతో కూడింది. కాని అచలం అనుభవంతో కూడింది.

ఇవే గాక ముద్రలు, ధ్యానం, రాజయోగంలో తారకం, సాంఖ్యం, అమనస్కం వంటి భావనలు అచల తత్త్వ పరిధిలోకి రావు. అచలతత్త్వం సాధనచతుష్టయ సంపత్తిని గ్రహించగలగాలి. అవి –

**1. నిత్యానిత్య వస్తువివేకం –** రూప నామక్రియలు గల అంతర్ బాహ్యా ప్రపంచమంతా అనిత్యం. రూప నామాలు లేక సర్వవిలక్షణమై ఉన్న బ్రహ్మం నిత్యం.

**2. ఇహాముత్రార్థ ఫల భోగ విరాగం –** ఇహపర భోగాలిచ్ఛగింపక పాప పుణ్యముల యందు పడకుండా ఉండటం. స్త్రీలను, ధనధాన్య వస్తు వాహనాది గృహారామ క్షేత్రాదులను, పరలోక మందుగల స్వర్గ వైకుంఠ కైలాసాదుల యందలి, సాలోక్య సామీప్య సాయుజ్య విదేహాది పదవుల యందు గల భోగాలపై ఇచ్ఛ లేకుండా ఉండటం.

**3. శమాది షట్కసంపత్తి –** శమం, దమం, శాంతి, తితీక్ష, శ్రద్ధ, ఉపరతి వంటి సాధనలను అనుసరించటం.

శమం – ఆంతరింద్రియ నిగ్రహం

దమం – బహిరింద్రియ నిగ్రహం

శాంతి – అరిషడ్వర్గాలను అణచడం

తితీక్ష – సుఖ దుఃఖాలను సహించడం

శ్రద్ధ – గురు వాక్యనిష్ఠ, గురు భక్తి కలిగి ఉండటం.

ఉపరతి – కర్తృత్వం లేని కర్మ ద్వారా ఆత్మ నెరుగడం.

**4. ముముక్షుత్వం –** మోక్షాపేక్ష తప్ప ఇతరాపేక్ష లేకుండుట. ముముక్షత్వం. సర్వకాల సర్వావస్థల యందు జనన మరణ భ్రాంతి రహిత మోక్షమందు ఇచ్ఛ కలిగి ఉండటం ముముక్షత్వం.

అచల తత్త్వవేత్తలు చతుష్టయ సాధన సంపత్తిని కలిగి భ్రాంతి రహిత స్థితిని పొందాలని అచల తత్త్వం బోధిస్తుంది.

అచల వాదులు గురువును దైవంగా భావిస్తారు. గురువుకు దేహముండదు. రూపముండదు. గుణముండదు. అఖిలానికి ఆత్మ గురువైతే, ఆత్మకు అచలమే గురువు. గురువులకు గురువైంది పరిపూర్ణ బ్రహ్మం. పరిపూర్ణ పరబ్రహ్మాన్ని నిరూపించే ప్రయత్నంలో తమకు అచల తత్త్వాన్ని బోధించిన గురువులను పూర్తిగా విశ్వసించి, వారినే అచల పరిపూర్ణులుగా స్వీకరిస్తారు. అచల పరిపూర్ణ యోగులు ఆచరణలో అన్నీ ఆదరిస్తారు. కాని అన్నిటా ఉంటూనే ఆ నిరాకార గురు (పరిపూర్ణ) తత్త్వంలో జీవించడమే అచల పరిపూర్ణ ఆచరణాత్మక జీవనయోగం.

అచల పరిపూర్ణులు అన్నిటా ఉండి, అందరితో కలిసి ఉండి కూడా తామరాకు మీద నీటి బొట్టుగా, అద్దమందు రూపంగా, బురదలో కుమ్మరి పురుగుగా,

నాలుకకు నెయ్యిగా, బొబ్బరకు చింతపండుగా, చల్లలో వెన్నగా ప్రపంచంలో సకల వ్యవహారాలు చేసి కూడా కల జగత్తుకు అంటడం లేదు. సత్సంగంలో నిస్సంగం అంటే ఇదే. క్రింది ఉపనిషద్వాక్యం పరిశీలిద్దాం.

**సత్సంగత్వే నిస్సంగత్వం। నిస్సంగత్వే నిర్మోహత్వం।**

**నిర్మోహత్వే నిశ్చల తత్త్వం। నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః॥**

సత్సంగత్వం వల్ల నిస్సంగత్వం, నిస్సంగత్వం వల్ల నిర్మోహత్వం, నిర్మోహత్వం వల్ల నిశ్చల తత్త్వం ఏర్పడుతుంది. ఈ నిశ్చలమే 'అచలం'గా భావించవచ్చునేమో!

చావు పుట్టుకలు లేక, తనకు తాను స్వతస్సిద్ధమై ఉన్న, ఈ ఉత్త బట్టబయలు తప్ప ఏమీ లేదు. సకల కాలాలు లేవు. సకల దేశాలు లేవు. సకల వస్తువులు లేవు. కలలో కనపడిన గజము మేల్కొని చూడగా ఎలా లేదో మూలం లేని ఈ గుర్తెరిగే శరీరం ఏమీ లేదని గురు ముఖంగా విచారించాలని అచల తత్త్వం బోధిస్తుంది.

'ఈ ఉత్త బట్టబయలు ఏమి లేదు' అనే ద్వాదశాక్షరిని చక్కగా అవగాహన చేసుకొని, తర్వాత కలలో తోచిన శరీరాలు ఏవిధంగా కనిపిస్తాయో, ఆ విధంగానే 'మూలం లేని ఈ గుర్తెరిగే శరీరమేమీ లేదు' అనే షోడశాక్షరిని సదా మరువకుండా ఉండవలననే గురు వాక్యాలను తప్పక ఆచరించవలెనని ఈ తత్త్వం తెలియజేస్తుంది. ఇదే జనన మరణ భ్రాంతి రహితమైన అచల సూత్రం. ఇదే పరిపూర్ణం. చివరగా పరిపూర్ణాన్ని ఉపనిషదుదాహరణంతో ముగిద్దాం.

**శ్లో॥ ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమే వావశిష్యతే॥**

**అర్థం** : అది పూర్ణమే, ఇది పూర్ణమే, పూర్ణం నుంచి పూర్ణమే పుడుతుంది. పూర్ణానికి పూర్ణం కలిపినా, పూర్ణం నుంచి పూర్ణం తీసివేసినా పూర్ణమే మిగులుతుంది. అదే అచలం.

* * *

# సాహిత్య పత్రికల విశ్లేషణ - జయంతి పత్రిక చరిత్ర

**డాక్టర్. మండలోజు నర్సింహస్వామి***

భారతదేశము బ్రిటిష్ పాలకుల పాలనలో ఎంతో దెబ్బతిన్నది. వివిధ సంస్థానాల్లో ఎటు చూసినా నియంతృత్వమే కనపడేది. బ్రిటిష్ వారిని విమర్శించిన పత్రికలను పగబట్టి వాటి ప్రచురణను అడ్డుకునేవారు. సంస్థాన పాలకులు ఈ విషయంలో మరింత కఠిన వైఖరితో ఉండేవారు. హైదరాబాద్ సంస్థానంలో ఆనాడు పత్రికలకు స్వేచ్ఛ లేనేలేదు. తెలుగు భాష సాహిత్య సంస్కృతులకు సర్కార్ ద్వారా ఇసుమంతైన సాయం అందకుండేది.

ఆనాడు 'తెనుగు' దినపత్రిక తేట తెనుగు పదాల మూట అని ఈనాటి తెలుగు పత్రికలకు అది ధీటుగా ఉండేదని చెబితే అతిశయోక్తి కాదు. ఒద్దిరాజు సోదరులు తమ 'తెనుగు' (వార) పత్రికలో తెలంగాణ సాంస్కృతికోద్యమాన్ని ప్రచారం చేశారు. గ్రంథాలయోద్యమానికి పత్రికల్లో స్థానం కల్పించారు. కొత్తకొత్త కవుల్ని, రచయితల్ని ప్రోత్సహించారు. అక్షర తపస్వి సురవరం ప్రతాపరెడ్డి "గోలకొండ" పేరుతో 1926లో వారానికి రెండురోజులు వెలువడే పత్రికను స్థాపించారు. పత్రికను నడిపించుటలో భాగ్యనగర్ కొత్వాల్ గా పేరుపొందిన రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి పాత్ర ఎంతో ఉంది. ఈ పత్రిక 1948లో దినపత్రికగా మారింది.

తెలంగాణ సాహిత్య పత్రికల చరిత్రలోనూ తెలంగాణకు పెద్దపీట ఉంది. ఈ ప్రాంతంలో ఎన్నెన్నో సాహిత్య పత్రికలు ప్రారంభమయ్యాయి. భారతికి సమాన స్థాయిలో సాహిత్యానికి ఇవి హారతి పట్టాయి. సాహిత్య పత్రికలు లేని లోటును తీర్చేందుకు "సుజాత" మాసపత్రిక ఆవిర్భవించింది. 1927లో బలమైన సంకల్పంతో హైదరాబాద్ కేంద్రంగా ఈ పత్రిక ప్రారంభమైంది. చాలామంది పరిశోధకులు తమ ప్రతిభకు పదును పెట్టుకునే వేదికగా "సుజాత" నిలబడింది. ప్రామాణికమైన చారిత్రక, సారస్వత వ్యాసాల ప్రచురణకు కేంద్రస్థానము అయింది.

---

*** జూనియర్ లెక్చరర్ ఇన్ తెలుగు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, భీంగల్, నిజామాబాద్.**

మెదక్ జిల్లాలోని వడ్డేపల్లి నుండి నరసింహాచార్యులు అనే పండితుడు " దేశబంధు " (1926) లో మాసపత్రికను నిర్వహించారు. "దేశబంధు" నాలుగు ఏళ్లు ప్రచురణను పొందింది. కొన్ని వ్యాసాలు ఆనాటి తెలంగాణలో వికసించిన వచన రచనా వికాసానికి దర్పణాలుగా ఉన్నాయి. 1940లో హైదరాబాదు నుండి ఒక సాహిత్య మాసపత్రిక "తెలుగుతల్లి"గా ప్రారంభమైనది. ఈ పత్రిక తెలంగాణలో అభ్యుదయ సాహిత్యానికి చక్కని బాట వేసింది. ఈ పత్రిక రాచమళ్ల సరస్వతీదేవి సంపాదకత్వంలో నడిచింది. తెలుగు భాషా సాహిత్య వికాసాల కోసం నిరంతరము కృషి చేయాలని దీనికి తగ్గట్టుగా దేవులపల్లి రామానుజరావు "శోభ" అనే పేరుతో సాహిత్య పత్రికను స్థాపించారు. ఈ పత్రిక ఎంతోమంది యువకవులు, రచయితల్ని, ప్రసిద్ధ సాహితీవేత్తలుగా తీర్చిదిద్దింది.

హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనమైన తరువాత పలు పత్రికల స్థాపన జరిగింది. సురవరం ప్రతాపరెడ్డి "ప్రజావాణి" పేరుతో దినపత్రికను స్థాపించారు. ప్రసిద్ధ పరిశోధకులు వెల్దండ ప్రభాకరామాత్య 'జయభారత్' అనే పేరుతో ఒక మాస పత్రికను ప్రారంభించారు. "ఆంధ్రకేసరి" పేరుతో మరొక పత్రిక ప్రారంభమైంది. గుండవరపు హనుమంతరావు సంపాదకత్వంలో వచ్చింది.

1953లో బోయినపల్లి వెంకట రామారావు సారథ్యంలో కరీంనగర్ కేంద్రంగా "సారస్వత జ్యోతి" పేరుతో మాసపత్రిక ప్రారంభమైంది. ఇందులో కరీంనగర్ ప్రాంతపు ప్రతిభావంతులకు చోటు కల్పించారు. బుక్కపట్టణం రామానుజాచార్యులు "తెలంగాణ" పేరుతో ఒక దినపత్రికను స్థాపించారు. ఇది కొద్ది మాసాలు మాత్రమే నడిచింది. తెలంగాణలో ఇది తొలి తెలుగు దినపత్రిక. బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు సారధ్యంలో హైదరాబాదు నుండి 1943లో వెలువడిన "మీజాన్" దినపత్రిక వచ్చింది. వార్తా శీర్షికల విషయంలో, వ్యాసాలలో భాషాపరంగానూ "మీజాన్" పత్రిక క్రొత్త రీతిని చూపించింది. ఈ పత్రిక ఎంతోమంది అజ్ఞాత ప్రతిభావంతుల్ని ప్రోత్సహించింది.

ఈ దినపత్రికల్లోనూ సాహిత్య ప్రచురణ ఉండేది. సాహిత్య పత్రికలెన్నో వెలువడి తెలంగాణలో ప్రచురణను పొందాయి. సాధారణ పత్రికలు సామాజిక రంగానికి చెందినవైతే మరికొన్ని రాజకీయ పత్రికలుగా పేరుగాంచాయి. సాహిత్య

పత్రికలు మాత్రము పాండిత్య వ్యక్తిత్వాల –తోనూ, సాహిత్య వ్యాసాలతోనూ ఎంతో కృషి చేశాయి. ఇంకా ఆ కృషి కొనసాగుతున్నది.

## ప్రత్యేక సంచిక – విశిష్టత :

ప్రత్యేక సంచిక (స్పెషల్ ఇష్యూ) ఇది ముందే నిర్వచించిన షెడ్యూల్లో, విస్తృతమైన సమాచారాన్ని కలిగి ఉంటుంది. వ్యాసాలు, కథలు, ఇంటర్వ్యూలు, సమీక్షలు, సర్వేనివేదికలు, ప్రకటనలతో పాటు ఏదైనా నిర్దిష్ట అంశం కీలకమవుతుంది. ప్రత్యేక సంచికలో తరచుగా పాఠకులను ఆకర్షించడానికి ఆలోచన కలిగించే కథనాలు, చిత్రాలు ఉంటాయి. ప్రత్యేక సంచికలు సాధారణంగా నాణ్యమైన కాగితాలపై ముద్రించబడతాయి. వీటిని సర్వసాధారణంగా చందాలపై పంపిణీ చేస్తారు.

ప్రత్యేక సంచికల్లో దీర్ఘమైన మరియు వివరణాత్మకమైన ప్రామాణిక వ్యాసాలను ప్రచురిస్తారు. వ్యాసాలలో సామాజిక, సాంస్కృతిక మరియు రాజకీయ సమస్యల గూర్చి విశ్లేషణాత్మకంగా లోతుగా చర్చించి ప్రచురిస్తారు. ప్రత్యేక సంచికలు అంశాన్ని ఆత్మాశ్రయంగా, సృజనాత్మక రీతిలో వ్యక్తీకరించే స్వేచ్ఛను కలిగి ఉంటాయి. ప్రత్యేక సంచికలు చిరకాలం పాటు పదిలపరుచుకోదగినవి.

## జయంతి పత్రిక – నేపథ్యం

కవి సమ్రాట్టు విశ్వనాథ సత్యనారాయణ రస సిద్ధులు. భర్తృహరి సుభాషితాలలోని “జయన్తితే సుకృతినో రససిద్ధా: కవీశ్వరాః నాస్తి తేషామ్ యశః కాయే జరామరణజం భయమ్!!” అనే శ్లోకాన్ని తాను నడిపిన “జయంతి” పత్రికకు మకుటంగా అలంకరించారు విశ్వనాథ. ఆయన కొనసాగించిన సాహిత్య కృషిలో జయంతి పత్రికా నిర్వహణ పేర్కొనదగినది.

“భారతి” పత్రికను ప్రారంభించిన పలు సంవత్సరాలకు విశ్వనాథ ‘జయంతి’ పత్రిక ప్రారంభమైంది. “భారతి” పత్రిక తెలుగు సాహిత్య రంగంలో అప్పటికే మంచి పేరు తెచ్చుకున్నది. అదొక్కటే కాక ఎన్నో సాహిత్య పత్రికలు అప్పటికే ఉన్నాయి. అయినా ‘జయంతి’ పత్రికను ఎందుకు ప్రారంభించారనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ ప్రశ్నకు జవాబుగా విశ్వనాథ సత్యనారాయణ తొలి

సంపాదకీయంలో "ఎవరి మట్టుకు వారికి పత్రిక పెట్టేందుకు తగినవి కాకపోయినా కారణాలు కనబడుతూనే ఉంటవి". అలాంటి కారణాలలో ఒకటిగా "భావం బ్రతుకు మీద ఆధారపడి ఉంటుంది. ప్రతి ఆంధ్రుని బ్రతుకు ఇంగ్లీష్ ఆక్రమిస్తూ" "ఆంధ్రభావం ఎక్కడ ? ఏ జగత్తుకైనా జీవితానికయ్యే భాష కావాలి. తక్కినవన్నీ తర్వాతనే".

ఇది కేవలం కారణం కాదు, అది ఆయన ఆశయం. అదొక మహోన్నత భావన. తన ఆశయం ఏదైనా ఆయన రచయితల మీద ఎలాంటి ఆంక్షలు పెట్టలేదు. వారికి స్వేచ్ఛను ఇచ్చారు." ఏ కవికి , ఏ రచయితకైనా ఏది అందముగా కనిపిస్తే అది వ్రాస్తాడు. అది రమ్యం కాదూ అని తోస్తే కాలం తోసేస్తుంది. ఒకప్పుడు రమ్యమైన దాన్ని రమ్యంగా లేదు అని కాలం అనుకోని వదిలేస్తే అదే మళ్లీ కొంతకాలానికి దాన్ని పునరుద్ధరిస్తుంది". అన్నారు విశ్వనాథ. ఇట్లా భాషపై కాల ప్రభావాన్ని విశ్లేషించారు. ఆ రోజులలో సాహిత్య వనరులే పత్రికలు పెట్టడానికి ప్రేరణను కలిగించేవి. దీనిలో భాగంగా విశ్వనాథ జయంతి పత్రికను నిర్వహించారు.

## తొలి "జయంతి" పత్రిక ఆరంభం - నిలిపివేత

"జయంతి" పత్రికకు విశాలమైన గతం ఉంది భారతి, శారద, సుజాత వంటి అత్యున్నతశ్రేణి సాహిత్య పత్రికల వరుసలో నిలబడగలిగే 'జయంతి' పత్రికను తొలుత 1927 వ సంవత్సరంలో ద్వైమాసిక పత్రికగా కవి సమ్రాట్టు విశ్వనాథ సత్యనారాయణ ఆరంభించారు. బహుభాషా పండితులు పంచాఙ్ఞల ఆదినారాయణ శాస్త్రి పత్రికకు ఎంతో సహకరించారు.

ఇదివరకే తెలుగులో పలుపత్రికలు ఉన్నాయి. ఇంకా కొత్త పత్రికలు ఎందుకు? అన్న ప్రశ్నతోనే 'జయంతి' పత్రిక ప్రారంభించబడింది. ఒక సంవత్సరం పాటు కొనసాగింది.

'జయంతి' పత్రిక శబ్ద చర్చలు , అముద్రిత గ్రంథ ప్రకటన, స్వాతంత్రోద్యమ కాంక్ష కలిగిన పద్యాలు, కవిత్వం , గ్రాంధిక వ్యవహార వాదాల రచనలతో నిర్వహించబడింది. ప్రచురణకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఆర్థిక బాధలతో తొందరలోనే 'జయంతి' ' పత్రిక ఆగిపోయింది. కానీ సాహితీ లోకంలో మంచి గుర్తింపు వచ్చింది.

## రెండవసారి "జయంతి" పత్రిక ఆరంభం – నిలిపివేత

"జయంతి" పత్రిక జ్ఞాపకాలు సాహిత్యాభిమానుల మనసుల నుండి తొలగిపోయిన 30 సంవత్సరాల తరువాత 1958వ సంవత్సరంలో విశ్వనాథ సత్యనారాయణ గౌరవ సంపాదకులుగా జువ్వాడి గౌతమరావు సంపాదకత్వంలో "జయంతి" మాసపత్రికగా రెండవసారి వెలువడింది. ఈసారి పత్రికను నడిపినంత కాలము అది సకాలంలో వెలువడేటట్టు చేశారు.

సమకాలీనమైన రచనల మీద, సహపత్రికల మీద, ఆఖరికి తమ "జయంతి" పత్రిక మీద కూడా నిర్మోహమాటమైన సమీక్షలు విమర్శలు చేశారు. అయితే 20 మాసాలు వరుసగా వచ్చిన తరువాత "జయంతి" పత్రిక ఆకస్మికంగా నిలిచిపోయింది.

"జయంతి" పత్రిక సోషలిస్టు ధోరణితో కూడిన వామపక్ష దృక్పథమున్న రచనల్ని, స్వతంత్ర భావాల రచనల్ని ప్రచురించింది. "జయంతి" పత్రిక నిలిచిపోవడానికి ప్రధాన కారణం ఆర్థిక వనరులు లేకపోవడం . నిర్వహణకు సరిపోయేది ఆర్థిక వనరులే.

## మూడవసారి "జయంతి" పత్రిక ఆరంభం – నిలిపివేత

"ఈనాడు సాహిత్యం ఏదో ఒక రాజకీయ సిద్ధాంతాలకు / పక్షానికి / కులమత వర్గాలకు/ వివిధ వాదాలకు అనుబంధంగా ఒక ప్రచార సాధనంగా సాగుతున్నది. కాని తన స్వంత వ్యక్తిత్వంతో తాను పురోగమించే తీరు కానరావటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సాహిత్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని సాహిత్యం కోసం తపన పడే వారందరూ గుర్తిస్తున్నారు". అంటూ 'జయంతి' పత్రికను ప్రారంభిస్తున్నామని త్రైమాసిక పత్రిక రూపంలో వెలువరింపజేస్తూ డాక్టర్,, వెలిచాల కొండలరావు సంపాదకీయం రచించారు. ఆయన సంపాదకత్వంలో 'జయంతి' 2003 సెప్టెంబర్‌లో ఆరంభమైంది.

మూడవ పర్యాయం ఆరంభమైన 'జయంతి' పత్రికకు సారథ్యం వహించిన డాక్టర్ వెలిచాల కొండలరావు పత్రికను పునరుద్ధరిస్తానంటే జువ్వాడి గౌతమరావు వద్దన్నారట. అయినా ఆయన వినలేదు. మావాడు కార్యసాధకుడు 'ఐ హేవ్ ఏ గ్రేట్ ఫెయిత్ ఇన్ హిమ్' అని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు జువ్వాడి గౌతమరావు.

జువ్వాడి గౌతమరావు కొండలరావు కార్యకర్తృత్వ శక్తిమీద పెట్టుకున్న విశ్వాసం వమ్ము కాలేదు అని నిరూపించింది 'జయంతి' పత్రిక విజయం. "ఈసారి మొదలవుతున్న 'జయంతి' సాహిత్యానికి సంబంధించిన అనేక అనేక అంశాల విషయంగా స్పష్టమైన దేశీయతా దృక్పథంతో ఇంతకు ముందువలెనే పురోగమిస్తుంది. రచనలే మాకు ప్రధానం" అంటూ తమ అంకితత్వాన్ని, దృష్టి కోణాన్ని చాలా స్పష్టంగానే తెలిపారు కొండలరావు. గతంలో సాహిత్య పత్రికల్ని నిర్వహించటం కంటే ఈ కాలంలో వాటిని ప్రచురించటం ఎంతో క్లిష్టతతో కూడిన పని. ఈ సత్యం అందరికీ తెలిసిందే. మునపటి- వలె విరివిగా రచనలు చేసే రచయితల సంఖ్య ఇప్పుడు లేదు. అప్పటి ప్రమాణాలు కూడా ఇప్పుడు కనిపించటం లేదు. సాహిత్య పత్రికలను డబ్బులు వెచ్చించి కొనే వారి సంఖ్య తగ్గిపోయింది . ఈ నేపథ్యంలో ప్రతి సంచిక ప్రచురణ ఒక గండం వంటిదే. అయినా మొక్కవోని పట్టుదలతో 'జయంతి'నిని దిగ్విజయంగా నిర్వహించడం ఎంతో గొప్ప సంగతి.

గతంలో కేవలం సాహిత్య విమర్శ - పరిశోధనలకే "జయంతి" పరిమితమయ్యేది. ఇప్పుడు సమకాలీన భాష, సాంస్కృతిక అవసరాలకు అనుగుణంగా డాక్టర్ వెలిచాల కొండలరావు "జయంతి" పత్రికను మార్చివేశారు. మానవీయ సంబంధాల్లో ఆరోగ్యకరమైన సమన్వయాన్ని ప్రేమ అభిమానాలను పెంచుతూ దేశీయతా భూమిక మీద సానుకూల ఆలోచన విధానాన్ని పెంపొందించటానికి సంబంధించింది. ఆలోచనా విధానానికి శాస్త్రం - సాహిత్యం రెండు పక్షాలు. ఈ రీతులలో ఏది ఉత్తమమైందనే ప్రశ్నకు అవకాశం లేదు. అన్నింటిని ఆహ్వానించ- వలసినదే అని ప్రకటించి "జయంతి" పత్రిక ముందుకు సాగుతున్నది.

మొదటి "జయంతి" ద్వైమాసికం, రెండవ "జయంతి" మాసపత్రిక, ప్రస్తుతం నడుస్తున్న "జయంతి" త్రైమాషికం అయినా ఇందులో విశేషం ఉంది. తెలుగుతో పాటు ఇంగ్లీషులో కూడా పత్రిక రావడానికి కారణం వర్తమాన కాలంలో ఆంగ్ల ప్రాధాన్యం విస్మరించలేనిది కావడమే. అయినప్పటికీ తెలుగు భాషాపరిరక్షణ ఈనాడు తక్షణ అవసరమని డాక్టర్ వెలిచాల కొండలరావు గారి ప్రగాఢమైన అభిప్రాయం.

నేడు వస్తున్న మూడవ "జయంతి" పత్రికలో కవితలు, భిన్నభిన్న వ్యాసాలతో ఒకటి రెండు విశ్వనాథ సత్యనారాయణకు సంబంధించినవి ఇంక అదనంగా నాలుగు, ఐదు వ్యాసాలు, ఇంటర్వ్యూ లతో ఒక ప్రముఖ కవిని పరిచయం చేస్తూ వెలువ- రించడం, ఇట్లా "జయంతి" పత్రిక క్రమం తప్పకుండా నడుస్తున్నది అంటే డాక్టర్ వెలిచాల కొండలరావు గారి కృషికి మరియు పట్టుదలకు నిదర్శనం.

* * *

# ధనుర్విద్యా విలాసం - కొండవీడు చారిత్రక విశేషాలు

**డా. కల్యాడపు రమేశ్***

పరిచయం: ధనుర్విద్యావిలాసం క్రీ.శ. 1775 కాలంలోరచించిన కృష్ణమాచార్యులుతెలుగు ప్రాంతాన్ని పరిపాలించిన పద్మనాయక రాజులలో ఒకరైన తిరుపతిరాయని కాలంలో (1774 – 1798) జీవించాడు. ఈయన పూర్వీకుల గురించి, కులగోత్రాల గురించి ఈ గ్రంథంలో చెప్పబడింది. ఈ గ్రంథం గుంటూరు జిల్లాలోని తెనాలి దగ్గర ఉన్న ఈవనిపురం కోదండరామునికి అంకితం ఇచ్చిన విషయం ప్రారంభపద్యంలో తెలుపబడింది.

శా. శ్రీవాణీగిరిజావిలాసనిధియై చెల్వొందు సీతామహా
దేవిం దక్షిణభాగమం దనుజు నర్థిన్ వామభాగంభునన్
ఠీవిం గైకొని చాపరోపధరుఁడై ఠేవన్ బిసాళించుల
క్ష్మీవంతు న్గుణవంతు నీవనిపుర శ్రీరాఘవుం గొల్చెదన్.

(ధనుర్విద్యావిలాసం. 1950: 1–1)

అని ఇష్టదేవతా ప్రార్థన చేసారు. ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే రామునికి అంకితం ఇవ్వడం. పద్మనాయక రాజులు వైష్ణవ మతావలంబికులు కాబట్టి వారి మెప్పు కొరకే శైవుడైన ఈ కవి వైష్ణవునిగా మారి తన గ్రంథాన్ని రామునికి అంకితం చేశాడు.

ధనుర్విద్యావిలాసం ముఖ్యంగా ధనుర్నిర్మాణం నుండి శర ప్రయోగం వరకు ఉండే అనేక లక్షణాలను తెలియజేస్తుంది. అంతేగాక ఈ రచన సమకాలీన చారిత్రక నేపథ్యాన్నితెలుపుతుంది.

ఈ కావ్యం మూడు ఆశ్వాసాలతో రచించబడింది. ఇందులో ధనుస్సుకు సంబంధించిన లక్షణాలున్నాయి. మొదటి ఆశ్వాసంలో ఇష్టదేవతారాధన, సుకవిస్తుతి,

---

*** సీనియర్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు**

కుకవినింద, కృతిపతి, కృతి ప్రేరకులు, ధనుర్నిర్మాణం మొదలగు అంశాలను తెలియజేసారు. రెండవ ఆశ్వాసంలో ధనుస్సుకి సంబంధించిన విషయాలు, తూణీరం, అమ్ములపొది, మేఖలాబంధం, గుణం (మౌర్వీ) మొదలగు వర్ణనలు చేసాడు. మూడవ ఆశ్వాసంలో లక్ష్య శుద్ధిలాభం, స్థాన ప్రతిష్టానం మొదలుకొని దివ్యాస్త్ర మంత్ర తంత్రప్రయోగోపసంహారం వరకు గల విషయాలను వివరించాడు.

ధనుర్విద్యావిలాసం కావ్యం యుద్ధ తంత్ర శాస్త్ర కావ్యం. ఎందుకంటే యుద్ధంలో ఏవిధంగా ధనుస్సుని ప్రయోగించాలి, ఈ విద్యను ఎలా నేర్పించాలి, నేర్చుకోవాలి అనే విశేషాలను తెలిపేది. దీని పేరులోనే విద్య అనేది ఉంది కాబట్టి ధనుస్సు పట్టుకోవాలి దానికి అనుసరించవలసిన పద్ధతులను గురించి వివరించింది. అంతేగాక ధనుర్విద్యను నేర్చుకునే విధానాన్ని ఇందులో విపులంగా వర్ణించాడు.

ధనుస్సును ఎన్ని విధాలుగా ప్రయోగించవచ్చో, ఏ సమయంలో ఎలా ప్రయోగించాలో అనే సూక్ష్మమైన అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. విలుకాడు, రథ, గజ, అశ్వ మొదలగు వాహనాలను అధిరోహించినపుడు విల్లంబులను ప్రయోగ మెళకువలను ఈ గ్రంథంలో వివరించబడింది. మరియు దివ్యాస్త్రమంత్ర తంత్రప్రయోగోపసంహారం సంధించిన అస్త్ర విశేషాలు వివరించబడింది.

మధ్యయుగకాలంలో తెలుగు నేలను పరిపాలించిన రాజులలో వెలమ వంశం ఒకటి. వీరినే పద్మనాయక రాజులని పిలుస్తారు. వీరు మొదట కాకతీయుల వద్ద సామంతులుగాను ఆ తర్వాత సేనాపతులుగాను ఉండి క్రీ.శ. 1323లో కాకతీయుల సామ్రాజ్యం పతనమైన తర్వాత క్రీ.శ.1336లో దేవరకొండ, రాచకొండలలో స్వతంత్ర రాజ్యాలను స్థాపించి క్రీ.శ. 1470 వరకు తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించారు. వీరు తర్వాత కొంతకాలం విజయనగర రాజులకు సామంతులుగా, కటకాధీశులైన గజపతులకు సామంతులుగా ఉన్నారు. గజపతి సామ్రాజ్యం పతనమైన తర్వాత వీరు కుతుబ్‌షాహీల నుండి సన్నదులు (Orders) పొంది జాగీరుదార్లుగా రెవిన్యూ వసూలు దార్లుగా పనిచేస్తూ కుతుబ్ షాహి సుల్తానుల మన్ననలను పొందడమే కాకుండా బిరుదులను కూడా పొందారు. వీరి వంశంలో మొత్తం 75 గోత్రాలవారున్నట్లు వెలుగోటివారి వంశావాళి తెలుపుతుంది.

వీరిలో కుతుబ్ షాకు ఆశ్రితుడైన మాణిక్యరాయుడు, కోవెలకొండ, మెదకు, పెదకొండపల్లి, కొండవీడు దుర్గములను రక్షించినందుకు కుతుబ్ షాహి సుల్తాన్ బిరుదులిచ్చాడని ధనుర్విద్యావిలాసంలో తెలుపబడింది.

సీ. తనయాజ్ఞ నౌదల దాలిచి కోవేల
కొండ యేలిన యట్టి నిండుదనము,
పదిలుడై తా బంప మెదకు మ(వ?) లంగర
దుర్గంబు గాచిన దొడ్డతనము,
తనముద్ర జెల్లించి ధనికుడై పెదకొండ
పలి దుర్గమున జేయు ప్రాభవంబు
తనపంపు గని పెంపు దనరారగా గొండ
వీటి దుర్గము నేలు విక్రమంబు
భావమున మెచ్చి కుతుపశా ఠీవి నొసగె
తెలనిశానీ నగరా ప్రదీప్తధవళ
చామరద్వంద్వమును జగంపుగొడుగు
పంచఘంటాతలాటంబు భద్రగజము॥

(ధనుర్విద్యావిలాసం. 1950 : 1–21)

పై పద్యంలో మాణిక్యరావు పాలించిన ప్రాంతాలతో పాటు ఆయన గుణగణాలను తెలుపుతూ, ఏనుగులలో ఉత్తమమైన ఏనుగు వంటి వాడని, ఉన్నతమైన గుణాలు కలవాడని ప్రశంసించాడు.

శా. ఆజానేయము రత్నకుండలయుగం బాందోళికారత్నముం
ప్రజాపత్యము ముర్తుజాన్నగర సామ్రాజ్యంపుమన్నెర్కమున్
రాజామానికరా వటంచునభిదానం బిచ్చినం బ్రీతుడై
భ్రాజిష్ణుం డగుచున్ దగున్ గుతుపశాపాచ్చాసమక్షంబుగన్॥

(పైదే: 1–23)

కుతుబ్ షాకు అత్యంత ప్రీతిపాత్రుడిగా ఉండి ముర్తుజాన్నగరాన్ని (కొండవీడు ప్రాంతంలోని రాచూరు సంస్థానం) పరిపాలకుడుగా కొనసాగాడు. “ఈ సంస్థానాధీసులు కొండవీటి రెడ్డి సామ్రాజ్యపతనానంతరము కుతుబ్‌షాహి

ప్రతినిధులుగా కొండవీటి పాలకులైరి. మాణిక్యారావు కుతుబ్‌షాహి యనుగ్రహంబుననే నూటయెనుబది నాలుగు గ్రామములఉ బ్రసిద్ధంబగు మూర్తుజా నగరంబను రాజ్యంబును మన్నెటీకంబును, దిక్కుల సన్మానంబులు వడసి యెప్పెను. వీరి వంశ కీర్తి తెల్పు పేరు మాణిక్యారావు గోల్కొండ సుల్తాను కుతుబ్ షాహి ఇచ్చిన గౌరవ బిరుదులు". (వెంకట నరసింహ సత్యనారాయణ రావు, కోటగిరి. 1981:317) దీన్ని బట్టి చూస్తే వీరు స్వయం పరిపాలకులుగా కాకుండా కుతుబ్ షాహిలకు ప్రతినిధులుగా ఉన్నారనే విషయం స్పష్టమవుతుంది.

"శా.శ. 1608 క్రోధన (క్రీ. శ. 1685) సుల్తాను అబ్దుల్ హాసన్ తానీషా మంత్రులైన అక్కన్న, మాదన్నల సహకారంతో పున్నెపల్లి గోత్రోద్భవులైన క్రిష్ణానేని రఘుపతి మాణిక్యారాయణం గారు పూర్వానురీతి కొండవీటి ఖిల్లా నాయక్వారీగా అనుభవిస్తూ యుండిరి, కనుక ఆయన కుమారుడు జంగమయ్య మాణిక్యారావు దక్షిణామూర్తి సోమయాజులవారిని వెంటబెట్టుకొని గోల్కొండ తరలి వెల్లిరి. కనుక అక్కడ అక్కన మాదన్న వారి సహకారంతో పాదుషా వారి దర్శనం చేసుకొని కొండవీటి దేశానికి దేసాయిలుగా మన్నెరికం ఫరుమానా వ్రాయించుకొనిరి" (L.R. 20. కొండవీటి కైఫియత్ (వెంకట నరసింహ సత్యనారాయణ రావు, కోటగిరి. 1981 : 318)

పై పద్యంలో మన్నెరికం అని చెప్పడంతో వీరు కొడవీటి ప్రాంతాన్ని మన్నెరికం ఫర్మానా వ్రాయించుకున్నట్లు కొండవీటి కైఫియత్ ద్వారా తెలుస్తుంది.

## కొండవీటి వర్ణన:

ధనుర్విద్యా విలాసంలో కొండవీడు వర్ణణ

సీ. పసమించు భీష్మక ప్రముఖావనీపాల
కులకు వజ్రపుజోడు కొండవీడు,
శత్రురాజాధిరాజవిరాజదైశ్వర్యజి
కుదిరంబు ముకుద్రాడు కొండవీడు,
అఖిల యాచక రాజహంస యూధములకు
క్రొందామరలకాడు కొండవీడు

దేవతాయతనమై దీపించు కల్యాణ
కుధరంబు సైదోడు కొండవీడు,

తే. హరిహర విరించి ముఖదేవతావతంస
సంపదభిరామహేమవిశాల సాల
జాగ్రదగ్రముహుర్ముహుశ్చటుల పటహ
ఘుమఘుమధ్వానములగూడు కొండవీడు.

(ధనుర్విద్యావిలాసం: 1-25)

కుతుబ్‌షాహీల కాలంలో కొండవీడు అత్యంత ప్రాముఖ్యమైన ప్రాంతం. ఇక్కడ ఎన్నో యుద్ధాలు జరిగినట్టు తెలుస్తుంది. ఇలాంటి కొండవీడు ప్రాంతంలో జీవించిన కవి కృష్ణమాచార్యులు. ఈ రచనలో కొండవీటి విశేషాలను అక్కడి ప్రాముఖ్యతని తెలిపాడు. శత్రురాజులు కొండవీడు పేరు వింటేనే బెదిరిపోయేంత శక్తివంతమైందిగా, పాలకులకు అది వజ్రపుజోడు లాంటిదిగా, అక్కడ పశు పక్షాదులకు కొరత లేకుండా ఉండేదని అంతేకాకుండా ఎప్పుడు ఆనందపరిచే ఆహ్లాదకరమైన వాతావరణం కలదని నిత్య దేవతా కళ్యాణాలకు పెట్టిన కోట కొండవీడు అని తెలుస్తుంది.

## కోటవర్ణన:

గీ. పుట్టకోటగాక పొలుచుపైకోట
దండి బురుజులుండు రెండుపదులు
కొమలు రెండు నొక్కకొత్తడం బనదగు
నట్టికొత్తడంబు లాఱువేలు.

(ధనుర్విద్యావిలాసం: 1-26)

ఎత్తైన కొండపైన ఉన్న కొండవీటిదుర్గం కోట గోడ మధ్య మధ్యలో శత్రుసైన్యాలు రాకుండా కాపుకాయడానికి బలమైన 20 బురుజులు, వీటిపై ఫిరంగులు మరియు శత్రువుల రాకను కనిపెట్టి అప్రమత్తం చేసేవారు. బురుజులు ఎన్ని ఎక్కువగా ఉంటే అంత సంపన్నమైన కోటగా చరిత్రకారులు భావిస్తారు.

ఈ కోటను కాటయవేముడు అన్నవరదానశాసనంలో ఇలా తెలిపాడు.

శ్లో॥ సకొండవీడుం నిజరాజధానీ మకల్పయ త్కల్పయితవ్యదక్షః
త్వష్టాపి దృష్ట్వాప్రతిమం యదీయం నిర్మాణవైచిత్రి మభూ ద్విలక్షః
నాగైర్నగ భ్రాంతి విధాయభిశ్చ వనాయుదేశ ప్రభవైశ్చ వాహైః
యోధైశ్చ యుద్ధేషు సమృద్ధ శౌర్యర్యావూద్దురాపా మనసాప్యమిత్రైః॥

శత్రువులు మనసార స్మరించుటకు వీలులేనట్లు, సైన్య సమీకరణకు వీలైనట్లు, శిల్పకళా విలాసము చూచు వారికి అబ్బురపర్చు కొండవీటి రాజధానిని అనపోతారెడ్డి నిర్మించెనని తెలుపబడింది.

రాజధానిని అద్దంకి నుండి కొండవీటికి మార్చిన అనపోతారెడ్డి (క్రీ.శ. 1353 – 1364) కోట నిర్మించినట్లు ఈ శాసనం తెల్పుతుంది. అప్పటికే విశాలంగా ఈ రాజధాని నిర్మాణం జరిగినట్లు తెలుస్తుంది. ఆ కాలంలో అనేక శత్రు దాడులు జరుగుతుండటంతో రాజధానిని అద్దంకి నుండి కొండవీటికి మార్చినట్లు ఈ కింది శ్లోకం తెల్పుతుంది.

"శ్లో॥ కొండవీడుం రాజధానీం స విచిత్ర మకల్పయత్
దృష్ట్వా త్వష్టాపి వైచిత్ర్య మభూద్యస్యాస్స విస్మయః.

అద్దంకి సమతల ప్రదేశం కాని కొండవీడు గిరిదుర్గం అవడంతో శత్రు దుర్భేధ్యమని భావించి ఇక్కడికి మార్చి యుండవచ్చు." (ప్రభాకర శాస్త్రి, వేటూరి: 1985: 45)

కొండవీటి నగరాన్ని శ్రీకృష్ణదేవరాయల వారి విజయనగరాన్ని పోలిన విధంగా వర్ణన చేసాడు. విజయనగరంలో అయితే ఏవిధంగా రత్నాలు రాశులుగా పోసి అమ్మేవారో అదేవిధంగా ఇక్కడ కూడా అమ్మేవారని తెలిపాడు. శ్రీకృష్ణదేవరాయల తన పరిపాలన కాలంలో కొండవీడును సందర్శించి ఇక్కడి వేణుగోపాల స్వామి దేవాలయంలో ఒక ధ్వజ స్తంభాన్ని నిలిపినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇతని ప్రభావమే తర్వాత రాజుల కాలంలో కొనసాగింది.

అంతేగాక ఇక్కడ ఎక్కడ చూసిన మదపుటేనుగులు, ఏదిక్కు చూసిన బంగారంతో చేయబడిన రథాల వరుస కనులపండువగా కనబడుతాయని, ఇక్కడి పరిపాలకుల గురించి నగరంలోని ప్రజలను ఎవరిని అడిగిన బంగారు పలుకులు పలికి వారి ఔన్నత్యాన్ని చాటి చేప్పేవారని కొండవీడును ఒక అద్భుతమైన నగరంగా వర్ణించబడింది.

ఉ. ఎక్కడ జూచిన న్మదపుటేనుగుగున్నలు చెన్నుమీఱు నే
దిక్కున జూచినన్ బసిడి తేరులబారులు సౌరుదేరు నే
వక్కమునం గనుంగొనిన వాజులరాజుల రాజిలున్ సిరుల్
గక్కెడు కొండవీటినగరంబున నద్భుతమావహిల్లగన్

(ధనుర్విద్యావిలాసం: 1950: 1–27)

శా. అందుం దీర్పరి పెద్దయై ముకురనీహారామరహ్రోదినీ
కుందోరస్సరరాజరాజ కలశాకూపారహారావళీ
మందారద్రుమగంధసార లవలీమాద్యద్యశశ్శాలి మే
లందున్ మానికరాయభూవిభుడు బాహావిక్రమా వక్రుడై

(పైదే: 1–28)

కొండవీడును పరిపాలించిన రాజులందరిలో మాణిక్యరావుగారికి ప్రత్యేక స్థానముంది. ఈయన న్యాయ విషయంలో అద్దంలాంటి వాడనీ, ఎలాంటి అరమరికలు లేకుండా ప్రజలకు తీర్పు చెప్పేవాడనీ, భారతదేశానికి ఆరావళి పర్వతాలు ఏవిధంగా పెట్టని కోటవలె రక్షణ కల్పిస్తున్నాయో అదేవిధంగా ఈయన న్యాయాన్ని కాపాడుతాడనీ, బహుముఖ ప్రజ్ఞశాలనీ, పరాక్రమవంతుడనీ, పుష్పాలలో మందారానికి, పారిజాతానికి ఎలాంటి స్థానం కలదో కొండవీటి రాజులలో అంతే ప్రత్యేక స్థానం ఉందని తెలిపినాడు. మాణిక్యరావుని కొండవీటి పాలకుడుగా పేర్కొన్నప్పటికీ ఇతను ఖిల్లాదారుగా, కుతుబ్‌షాహీల రెవిన్యూ వసూలుదారుగా మాత్రమే బాధ్యతలు నిర్వర్తించాడు.

మాణిక్యరావు కుతుబ్‌షాకు అత్యంత ప్రీతిపాత్రుడై, అతని నుండి బిరుదులు పొంది తన వంశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చి తన తరువాత వారికి అన్వయించే విధంగా కోదండరామస్వామిని భక్తితో కొలిచినట్లు తెలుపబడింది.

సీ. తనకునై కుతుపశా దయనిచ్చు విజయాంక
    బిరుదముల్ దనయింట బెనుపుసూప
తనపేరు తన సంప్రదాయంబు వారల
    కన్వయాంకంబుగా నతిశయిల్ల
తా భక్తి గొలుచు కోదండరామస్వామి
    తనవారి కులదైవతంబు గాగ,

తన భుజాబలసముత్థానంబుచే గొండ
వీటి దుర్గంబు భావితము గాగ,

తే. నమరె మూర్తుజాన్నగర సింహాసమున
చామరచ్ఛత్ర వేణునిస్సాణ పణవ
ముఖ నిఖిల రాజచిహ్నముల్ మ్రోలదనర
ప్రధనజయశాలి మానికరాయమౌళి.

(ధనుర్విద్యావిలాసం. 1950: 1–29)

మాణిక్యరావు కులదైవమైన కోదండరామస్వామి దయతోను, తన భుజబలంతోను కొండవీటి దుర్గాన్ని పరిపాలించాడు. అంతేగాక ముర్తుజానగరాన్ని (కొండవీడు దానిచుట్టు గల ప్రాంతాలు). జయించి ఏకఛత్రాధిపత్యంగా తన రాజచిహ్నలతో విజయవంతంగా రాజ్యపరిపాలన చేసినట్లు తెలుపబడింది.

వంశవర్ణన: మాణిక్యరావు తర్వాత అతని కుమారుడైన కొండలరాయడు ప్రభువైనాడు. ఈ కొండల రాయడు గురించి తెలుగు ప్రాంతాల్లో అనేక వీర గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఇతడు అబుల్ హాసన్ తానీషాకు ఆశ్రితుడిగా ఉండి పరిపాలన కొనసాగించాడు.

ఉ. పండితమూర్తియై తనకు మానికరాయినికిం దనూజుఁడై
కొండలయభూవిభుఁడు కుండలిరాజశశాంక శంకరా
ఖండలదంతి పాండుర వికాస వికస్వరకీర్తి కీర్తి తా
జాండకటాహుఁడై తనరు నాశ్రితకల్పమహీరుహంబనన్.

(పైదే. 1950:1–30)

మొఘల్ రాజైన ఔరంగజేబు గోల్కొండను వశపరుచుకున్న తర్వాత (క్రీ.శ. 1687) రాజ్యాలన్ని ఔరంగజేబు పరిపాలనలోకి వచ్చింది. కొండలరాయుని మునిమనవడైన అప్పభూపతి ఔరంగజేబుకి ఆశ్రితుడిగా ఉన్నట్లు తెలుపబడింది.

చ. అతనికిఁ దిర్మల ప్రభుఁడుదారయశుం డుదయించేఁ దిర్మల
తిర్మల క్షితిపతి గాంచె నప్ప నృపసింహుని నప్పవిభుండు గాంచె వ
ర్ధితబలుఁ దిర్మల ప్రభునిఁ దిర్మలరాయుడు............”

(ధనుర్విద్యావిలాసం: 1–32)

కం. తానుం దేశాహీపర
మానా కౌరంగజేబు మహిమ బఫార
తా?నునిచే రోహిల్లా
ఖానునిచే నప్పవిభుడు గనియెన్ ఘనుడై.

(పైదే: 1-33)

మ. ప్రమదాపాదకమౌ ముహూర్తమున నప్పారాయ మాణిక్యరా
య మహారాయనికిన్ రహిం దిరుపతి క్ష్మాధీశ మాణిక్య రా
య మహారాజ కులావతంసుఉ డుదయంబైయేలె నజ్జానకీ
రమణుం గొల్చుచు మూర్తుజాన్నగరసామ్రాజ్యంబుపూజ్యంబుగన్.

(పైదే: 1-34)

అప్పభూపతి కుమారుడు తిరుపతిరాయడు గోల్కొండ నగర నవాబుకు ఆప్తుడిగా ఉండి రాజ్యపాలన చేసినట్లు ఈ క్రింది పద్యంవల్ల తెలుస్తుంది.

ఉ. హుమ్మని సంగరమ్ముల సముద్ధతిఉజూపిన మెచ్చియిచ్చె రా
రమ్మని గొలకొండ నగరమ్ము నవాబు మెఱుంగు లీను వా
హమ్మును నాల్గునేనుగులు నాప్తులపాలి సుధాంబుపూరపుం
దెమ్మగదా మహిం దిరుపతిక్షితిపాలుఉడు రాజమాత్రుఉడే.

(పైదే: 1-36)

తిరుపతిరాయుడిని నవాబే స్వయంగా పిలిచి ఉత్తమమైన నాలుగు ఏనుగులను బహుమానంగా ఇచ్చి తన నగరానికి పంపినట్లు చెప్పబడింది. ఇంతటి కీర్తి పొందిన తిరుపతిరాయుడు కూడా రాజ సమానుడే!

తిరుపతిరాయని భార్య చక్రమాంబ గుణవంతురాలు, ధర్మపత్నిగా, ఉత్తమ ఇల్లాలిగా పేరు ప్రఖ్యాతలు పొందింది.

గీ. భవ్యగుణపేటి చక్రమాంబావధూటి
ధర్మపత్నిఉగాఉబడసి యత్తన్వి వలన
కడిమి నార్వుఋఉ దనయులఉబడసె నవ్వి
భుండు సంపత్పరంపరాపూర్ణుఉడగుచు

(ధనుర్విద్యావిలాసం: 1950: 1-40)

చక్రమాంబ ఆరుగురు పుత్రులకు జన్మనిచ్చినది. వారు –

సీ. అందగ్రజుండు సాహస విక్రమార్కుఁడై
రాణించు వెంకటరాయ విభుడు,
అతనితమ్ముఁడు సమూర్జిత కళాపరిభూత
మదనుండు కృష్ణమావిభుండు,
అతని సోదరుఁడు బాహాబలాభీలుడై
భాసిల్లుచుండు నప్పప్రభుండు,
అమ్మహాభాగున కనుగుఁ దమ్ముఁడు మహా
బలశాలి రమణభూపాలకుండు,

గీ. ఆయన అనుంగుఁ దమ్ముడై యలరుచుండు
రసికజనమౌళి వల్లభరాయమౌళి
తలప నందఱకును ముద్దుఁదమ్ముఁ డగుచు
ప్రబల సీతన్న మాణిక్యరాయ శౌరి.

(పైదే: 1-41)

వీరిలో పెద్దవాడు వెంకటరాయుడు, ఇతని తమ్ముడు కృష్ణమరాయుడు, ఇతని తమ్ముడు అప్పప్రభు, ఇతని తమ్ముడు రమణ, ఇతని తమ్ముడు వల్లభరాయుడు, చివరివాడు అందరికి ముద్దులతమ్ముడు సీతన్న మాణిక్యరాయుడు.

పై విధంగా వరుసగా వీరు రాజ్యపాలన చేసారు. ఈ క్రమంలోనే చివరివాడైన సీతన్న మాణిక్యరాయుని రెండవ కుమారుడే ధనుర్విద్యా విలాస రచనకు ప్రేరకుడు. తిరుపతిరాయుడు క్రీ.శ 1775 వరకు పరిపాలించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. ఈయన దాతృత్వంలో, శౌర్యంలో చిరకీర్తిని పొందారు. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి గారు ధనుర్విద్యావిలాసం పీఠికలో వీరి వంశ వృక్షాన్ని ఈ క్రింది విధంగా తెలిపాడు.

## కొండవీటిని పరిపాలించిన పద్మనాయకుల వంశవృక్షము

పద్మనాయకులు – పుణ్యపలి గోత్రము – కృష్ణానేనివారు, కుతుబ్‌షాహి ఆశ్రితులు

మాణిక్యారావు

కొండలరాయుడు– అబ్దుల్లాఫాదుషా

తిర్మలప్రభుడుజి

అప్పలరాయప్రభుడు

తిర్మలప్రభుడు

అప్పప్రభుడు (ఔరంగజేబు, బఫరతాఖాను, రోహిల్లాఖాను)

తిరుపతి (చక్రమ,భార్య)

వెంకటరాయ　కృష్ణ　అప్ప　రమణ　వల్లభ　సీతన్న (లక్ష్మమ్మ భార్య)

రఘుపతి　తిరుపతి నరసింహ　జగ్గన్న　తిరుపతి (గ్రంథరచనా ప్రేరకుడు 1774)

సీతన్నా రావు　భావన్నారావు (అచ్చమాంబ భార్య)　అప్పారావు　సీతన్నారావు(1798 A.D)

వెంకటగోపాలరావు (22–11–1883 లో గతించారు)

మార్కండేయరావు

వెంకటహయగ్రీవరావు (A.D. 1918 లో ఉన్నారు).

ముగింపు: ధనుర్విద్యావిలాసంలో పద్మనాయక రాజుల కాలానికి సంబంధించిన చారిత్రక విశేషాలతోపాటు, కుతుబ్ షాహీల చారిత్రక విశేషాలు మరియు కవి కాలానికి సంబంధించిన విశేషాలు, కొండవీడు కోట వర్ణనలు, రాజుల వంశవర్ణన మొదలైన ఎన్నో విశేషాలతోపాటు 18వ శతాబ్దం నాటి ఎన్నో చారిత్రక విశేషాలు తెలుస్తున్నాయి.

**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. కృష్ణమాచార్యులు, ''ధనుర్విద్యావిలాసము'', ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము, మద్రాసు, 1950.
2. వెంకట నరసింహ సత్యనారాయణ రావు,కోటగిరి, "పద్మనాయక చరిత్ర", అప్పారాయ గ్రంథమాల, నూజివీడు, 1981.
3. మాధవ రాయలు, సురభి, "చంద్రికాపరిణయం", ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్, 1982
4. ప్రభాకర శాస్త్రి, వేటూరి, "ధనుర్విద్యావిలాసము పీఠిక", ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము, మద్రాసు,1950.
5. వెంకటరావు, నిడదవోలు, "దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము", మద్రాసు విశ్వవిద్యాలయం, మద్రాసు, 1978.
6. భూపాలరావు, కె.వి., ''మాదన్న మహామంత్రి'', సావిత్రి సదనము, హైదరాబాదు, 1982.
7. ప్రభాకర శాస్త్రి, వేటూరి, "శృంగార శ్రీనాథము", మణిమంజరి ప్రచురణలు, 1985.
8. ప్రతాపరెడ్డి, సురవరం, "ఆంధ్రుల సాంఘీక చరిత్ర", ఓరియంట్ ల్యాన్, హైదరాబాద్, 2007.
9. Nilakanta Sastri, K.A. (Ed)., "Velugotivari Vamshavali", University of Madras, 1939.


* * *

# బాసర చరిత్ర - క్షేత్ర పరిశోధన

**బలగం రామ్ మోహన్ ***

భారతదేశంలో అరుదుగా కనిపించే సరస్వతీ ఆలయాలు కలిగిన క్షేత్రాలలో ఒకటిగా అదేవిధంగా దక్షిణ భారతదేశంలో పుణ్యక్షేత్రాలలో పురాతనమైనదిగా ప్రసిద్ధమైనది బాసర. గోదావరి నదీతీరంలో ఉన్న బాసర చారిత్రకంగా కూడా చాలా ముఖ్యమైన ప్రదేశం.

బాసర ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో ఉన్నది. ఇది ఇపుడు మండల కేంద్రం కూడా. బాసరను పర్యాటక ప్రదేశంగా ,పుణ్యక్షేత్రంగా తెలంగాణ తో పాటు పొరుగు రాష్ట్రాల వారు కూడా ఎరుగుదురు కానీ బాసర చారిత్రక ప్రదేశం అని ఎక్కడా ప్రతిబింబించకపోవడం గమనార్హం. ఔత్సాహిక చరిత్ర పరిశోధకులకు బాసర ప్రాంతం స్వర్గధామం. చరిత్రలో బాసర ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతను తెలుసుకోవడం, ఇతరులకు తెలియజేయడం కోసం ఇటీవలి కాలంలో ఈ ప్రాంతం మీద ప్రత్యేక శ్రద్ధతో, ఒక ప్రత్యేకమైన కుహలంతో క్షేత్రస్థాయిలో చేసిన ఈ పరిశోధనలో ఇదివరకే తెలిసిన విషయాలే కాకుండా మరిన్ని ఆసక్తికరమైన కొత్త విషయాలు, కొత్త శాసనాలు, కొత్త చారిత్రక అంశాలు వెలుగుచూసాయి.




**బాసర జ్ఞాన సరస్వతి ఆలయం**

*** సెకండరీ గ్రేడ్ టీచర్, ఎమ్.పి.యు.పి.ఎస్, కిర్‌గుల్ కె, బాసర (మం), నిర్మల్ జిల్లా.**

## బాసర పరిచయం :

బాసర క్రీ.శ. 1905 కు పూర్వం నిజామాబాద్ జిల్లాలో అంతర్భాగంగా ఉండేది. క్రీ.శ.1905 లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసినపుడు ముధోల్ తాలూకా ను నాందేడ్ జిల్లాలో కలిపేయడం జరిగినది. దాంతో ముధోల్ తాలూకాలో ఉన్న బాసర కూడా నాందేడ్ జిల్లాలో కలిసిపోయింది. 1956 లో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు జరిగినపుడు అప్పటిదాకా మహారాష్ట్రలో ఉన్న బాసర ఆంధ్రప్రదేశ్ లో భాగమైపోయింది. 2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో బాసర ప్రాంతం మరోసారి రాష్ట్రం పేరు మార్చుకోవాల్సి వచ్చింది. 2016 లో తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసినపుడు అప్పటిదాకా ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న బాసర ఆ జిల్లా నుండి వేరుపడిన నిర్మల్ జిల్లాలో చేరింది. అంతేకాకుండా ముధోల్ మండలంలో ఒక గ్రామంగా ఉన్న బాసర మండలకేంద్రం గా కూడా మారింది.

ప్రస్తుతం ఉన్న బాసర గ్రామం 6 గ్రామాల కలయిక.

అవి 1. బాసర 2. మైలాపూర్ 3. రవిందాపూర్ (రైనాపూర్) 4. రేణుకాపూర్ 5. మహదాపూర్ 6. రత్నాపూర్. ఈ 6 రెవెన్యూ గ్రామాలతో కూడిన బాసర ఒక మేజర్ గ్రామ పంచాయితీ. వీటిలో మొదటి 3 అయిన బాసర, మైలాపూర్, రవిందాపూర్ లలో జనావాసం ఉన్నది. మిగిలిన 3 గ్రామాలు రేణుకాపూర్, మహదాపూర్, రత్నాపూర్ లలో జనావాసం లేదు. సాంకేతికంగా వీటిని బేచిరాగ్ గ్రామాలు అంటారు. జనావాసం లేకపోయినా ఈ గ్రామాలకు రెవెన్యూ రికార్డులలో శివారు భూములు ఉన్నాయి. ఈ గ్రామాలు కలిసిపోవడానికి వెనుక ఉన్న కారణాలలో స్పష్టత లేదు కానీ 17 శతాబ్దపు చివరలో మొఘలుల, అసఫ్జాహీల పాలన కాలాల సంధికాలంలో ఈ ప్రాంతంలో జరిగిన ముస్లింల దండయాత్రలను ఒంటరిగా ఎదుర్కోవడం కష్టం అన్న కారణంగా ఈ గ్రామాల ప్రజలు బాసరలో స్థిరపడిపోవడంతో అవి బేచిరాగ్ గ్రామాలుగా మారాయి అనేది ఒక వాదన. గోదావరి నదికి వచ్చిన వరదల కారణంగా ఆయా గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతంగా బాసరను ఎంచుకోవడం వల్ల అవి బేచిరాగ్ గ్రామాలుగా మారాయనేది మరో వాదన. ఈ విషయమై మరింత పరిశోధన అవసరం ఉన్నది.

ఈ గ్రామాలలో జనావాసాలు ఉండేవి అనడానికి గుర్తుగా హనుమాన్ ఆలయాలు ఉండడం, ఇనుప చిట్టెములు లభించడం గమనార్హం.




**బాసర ఉపగ్రహ చిత్రం**

## బాసర పేరు – భిన్న వాదనలు :

బాసరకు ఆ పేరు రావడానికి వెనుక కారణాల మీద భిన్న వాదనలు ఉన్నాయి.

**మొదటి వాదన :** శ్రీ శేషాచల సూరి రచించిన స్థలపురాణం ప్రకారంవ్యాసుడు తన శిష్యగణముతో సహా దక్షిణాపథానికి వచ్చి గోదావరి తీరమున బస చేసి ఇక్కడ మహా సరస్వతి, మహా లక్ష్మి, మహా కాళి విగ్రహాలను ప్రతిష్ఠించాడని అటు పిమ్మట కొంతకాలం ఇక్కడే నివసించిన కారణంగా ఆయన పేరు మీద వ్యాసపురము గా ఏర్పడి ఆ పిమ్మట వ్యాసర, వాసర, బాసర గా మారిందని ఓ ఐతిహ్యం.

**రెండవ వాదన :** మరాఠీలో వాసరూ అంటే ఆవుదూడలు ఉండే స్థలమని ఆరోజుల్లో ఇక్కడ ఆవులు అధికంగా ఉండడమే కాకుండా అవే ప్రధాన జీవనాధారంగా ఉండడం వల్ల దీనిని 'వాసరూ' అని పిలిచేవారని అది క్రమంగా 'వాసర్' అయి 'వాసర' తరవాత 'బాసర'గా మారిందని మరో వాదన.

**మూడవ వాదన :** బాసర ఒకప్పుడు గొప్ప జైన మత కేంద్రమని ఇక్కడి విగ్రహాలు,శాసనాల ద్వారా తెలుస్తున్నది. జైనంలో సరస్వతి,గణపతి ఆరాధన ఉన్నవి. బాసరలోని బొర్రగణేష్ ఆలయంలో ఐదున్నర అడుగుల ఎత్తు ఐదడుగుల వెడల్పు ఉన్న జైనశైలి గణపతి ఉన్నది. బి.ఎన్. శాస్త్రి గారు బాసరలోని సరస్వతిని జైన సరస్వతి గా ఆదిలాబాదు జిల్లా సర్వస్వం లో పేర్కొన్నారు. ఇదేగాక 1961 సెన్సస్ రికార్డుల్లో సరస్వతి ఆలయంలో ఆలయద్వారానికి లలాటబింబముగా 'గజలక్ష్మి' ఉన్నదని పేర్కొన్నారు. సాధారణంగా జైన ఆలయాలలో ద్వారాలకు గజలక్ష్మి తోరణం ఉంటుంది. దీనిద్వారా ఇది ఒకప్పుడు జైనాలయం అని జైనమత ప్రభావం బాసరలో ఉన్నదని స్పష్టంగా తెలుస్తున్నది. పాపహరేశ్వర ఆలయం ముందు జైనమాన స్తంభం ఉండడం,అతి పొడవైన భారీ ఆసన పీఠాలు ఇక్కడే ఉండడం కూడా వీటికి  బలం చేకూర్చేదే. బాసర సమీపంలోని భైంసా, బోధన్, మాహూర్, బినోల, ఆర్మూర్, కంధార్ (మహారాష్ట్ర) జైనమత కేంద్రాలే. ఈ వాదనలు ఎలా ఉన్నా బాసరకు పూర్వనామము వ్యాసాపురము అనే ఇక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. క్రీ. శ. 9 శతాబ్దం నాటి ఈ శాసనాలలో 'వ్యాసాపురద' అని స్పష్టంగా పేర్కొనబడినది. కాబట్టి వ్యాసాపురం క్రమంగా బాసరగా మారినట్టు తెలుస్తున్నది.

## బాసర చరిత్ర – అంశాలు, ఆధారాలు :

**శాతవాహనుల పూర్వకాలము :** క్రీ.పూ. 6 వ శతాబ్దం నాటికల్లా భారతదేశమంతటా వైదిక నాగరికత విస్తరించి ఉంది. చాతుర్వర్ణ వ్యవస్థ దక్షిణాపథంలోకి కూడా వ్యాపించింది. యజ్ఞ యాగాల పేరు మీద జరిగిన ధన వ్యయం, పశుహింస లను భరింపలేక ఈ వర్ణ వ్యత్యాసాలను చూసి ఆవిర్భవించిన బౌద్ధ, జైన మత సిద్ధాంతాలు చాలా వేగంగా ప్రజలను ఆకర్షించాయి. బాసర సమీపంలోని భైంసా (మహిషాపురము) ప్రముఖ జైన మతకేంద్రంగా భాసిల్లింది. నేటికీ అక్కడ భారీ ఆకారంలో ఉన్న జైన విగ్రహపు పాదాలు ఉన్నాయి. మౌర్యుల కాలంలో భైంసా ఒక ప్రసిద్ధ వ్యాపారకేంద్రం కూడా. తూర్పు తీరం నుండి వ్యాపారులు పశ్చిమ తీరానికి వెళ్ళడానికి గోదావరి నది ఒక మార్గంగా ఉపయోగపడింది. గోదావరి తీరంలో బాసర ఉండడం భైంసా కు సమీపంలో ఉన్న నదీ తీరం కూడా

కావడం గమనార్హం. మౌర్యుల అనంతరం ఈ ప్రాంతాన్ని మహిషకులు పాలించారు. వీరు జైన మతారాధకులు. ఆ సమయంలో భైంసా తో పాటు బాసర కూడా జైన కేంద్రంగా ఉన్నది. ఈ మహిషకులను ఓడించి శాతవాహనులు వారిని సామంతులుగా చేసుకున్నారు.



**భైంసా లోని జైన విగ్రహ పాదాలు**

**శాతవాహనుల కాలం :** మొదటి శాతకర్ణి తో ప్రారంభమై రెండవ శాతకర్ణి కాలం నాటికి బాసర ప్రాంతం పూర్తిగా శాతవాహనుల ఆధీనంలోకి వచ్చింది. శాతవాహనుల కాలంలో గోదావరి నది ప్రధాన నదీ మార్గంగా ఉన్నది. వారి పాలనా కాలానికి ఆధారాలుగా గోదావరి నదీతీరంలో ఉన్న కుక్కుటేశ్వర ఆలయం వద్ద ఇంకా బాసర గ్రామ శివారులో ఉన్న పాపహరేశ్వర ఆలయం వద్ద భారీ పరిమాణంలో ఉన్న ఇటుకలు లభించాయి. వీటి పరిమాణం 30 శ 18 శ 7 సెం.మీ. గా ఉంది. పైగా ఈ రెండు ఆలయాల నిర్మాణం కూడా ఒకే శైలిలో ఉ ండడం గమనించతగినది. శాతవాహనులు దక్షిణాపథాన్ని ఏలిన తొలి తెలుగువారు కావడం మరియు వారి కాలంలో బాసర ఒక గొప్ప ధార్మిక కేంద్రంగా అభివృద్ధి చెందడం జరిగినది.






ఇటుకలు

కుక్కుటేశ్వర ఆలయం



పాపహరేశ్వర ఆలయ గర్భాలయం

**వాకాటకులు, బాదామి చాళుక్యుల కాలం :** శాతవాహనుల అనంతరం ఈ ప్రాంతం వాకాటకుల ఆధీనంలోకి వచ్చింది. క్రీ.శ. 5 శతాబ్దం వరకు ఈ ప్రాంతం వీరి ఆధీనంలోనే ఉంది. వీరి అనంతరం ఈ ప్రాంతం బాదామి చాళుక్యుల పాలనలోకి వెళ్ళింది. క్రీ.శ. 750 వరకు వీరి అధీనంలో ఉన్న బాసర లో వీరి కాలానికి సంబంధించిన గుర్తులు,ఆధారాలు ప్రస్తుతానికి లభించలేదు.

**రాష్ట్రకూటుల కాలం :** బాదామి చాళుక్యుల అనంతరం బాసర ప్రాంతాన్ని రాష్ట్రకూటులు పాలించారు. బాసరలోని పాపహరేశ్వర ఆలయం వద్ద ఉన్న

శిథిలాలయ స్తంభాలు, సరస్వతీ ఆలయ స్తంభాలు, గ్రామంలోని హనుమాన్ ఆలయాల వద్ద ఉన్న స్తంభాలు రాష్ట్రకూట శైలిలో ఉన్నాయి. వీటితో పాటు రాష్ట్రకూట శైలి నాగశిల్పాలు, సరస్వతి ఆలయంలోను బాసరలోని మరో రెండు చోట్ల లభించాయి. ఈ విగ్రహాలు, స్తంభాలకు అదనంగా మరో బలమైన చారిత్రక ఆధారం అయిన రాష్ట్రకూటుల కాలం నాటి ఒక శాసనాన్నిఇటీవల క్షేత్ర పరిశోధనలో భాగంగా గుర్తించడం జరిగినది. బాసర బస్టాండ్ సమీపంలో ఉన్న దస్తగిరి గుట్ట మీద ఒక పెద్ద రాతిగుండు మీద ఈ శాసనాన్ని గుర్తించడమైంది. ఇది రాష్ట్రకూట రాజవంశ పాలకుడు కన్నారదేవునిగా పిలువబడే మూడవకృష్ణుడు కాలంలో రామస్వామి అనే దాత వేయించిన శాసనం. తెలుగన్నడ లిపిలో కన్నడ భాషలో 11 పంక్తులలో రాయబడి ఉన్నది. పరాంగనా పుత్ర ప్రశస్తి గల కన్నారదేవుడు (మూడవ కృష్ణుడు) పాలనా కాలంలో వాసర (బాసర) లోని మహారాజ సెట్టి దేవాలయాన్ని, వసది (జైన బసది) ని కట్టించాడు. దానికి రామస్వామి వ్యాసాపురమైన బాసరలో దానాలు చేశాడు అని శాసనం చెప్తున్నది. ఈ శాసనంలో వ్యాసాపురము అనే పేరు ఉన్నది. 9 వ శతాబ్దం నాటి ఈ శాసనం ఆధారంగా బాసరకు పూర్వనామం వ్యాసాపురం అని స్పష్టం అవడం తో పాటు బాసర రాష్ట్రకూటుల పాలనలో ఉన్నది అని చెప్పుటకు ఆధారం కూడా లభించినట్లయినది.

## రాష్ట్రకూటుల కాలపు శాసనం, దస్తగిరి గుట్ట బాసర

**కళ్యాణి/పశ్చిమ చాళుక్యుల కాలం :** రాష్ట్రకూటుల అనంతరం బాసర ప్రాంతం పశ్చిమ చాళుక్యుల ఆధీనంలోకి వెళ్ళింది. బాసరలో వీరి పాలనా కాలానికి సంబంధించి విశేషంగా ఆధారాలు దొరికాయి. వీటిలో శాసనాలు అతిముఖ్యమైనవి. బాసరలో ఉన్న శాసనాలలో వీరి పాలనలోనివే అధికం కావడం గమనార్హం. బాసరలోని శాసనాలు ఇప్పటిదాకా రికార్డు అయినవి, కానివి కలిపి మొత్తం 16 శాసనాలు ఉండగా అందులో 15 శాసనాలు ఒక్క పశ్చిమ చాళుక్యుల కాలం నాటివే కావడం, అందులో ఆ వంశ వ్యవస్థాపకుని శాసనం కూడా ఉండడం విశేషం.

పశ్చిమ చాళుక్యుల వంశ స్థాపకుడు అయిన ఆహవమల్ల బిరుదాంకితుడు రెండో తైలపుని మరియు అతని కుమారుడు సత్యాశ్రయుని గురించి పేర్కొనే

శాసనం పాపహరేశ్వర ఆలయం ముందర ఉన్నది[2]. నాలుగు పలకలతో ఉన్న ఈ శాసనం మీద 4 భాగాలుగా 3+29 పంక్తులలో తెలుగన్నడ లిపిలో కన్నడ భాషలో రాసి ఉన్నది. ఈ శాసనం శక సంవత్సరం 916 జయ నామ సంవత్సరం మార్గశిర బహుళ ద్వాదశి రోజున అనగా క్రీ.శ. 994 నవంబరు 18 ఆదివారం నాడు వేయబడింది. ఆహవమల్ల బిరుదాంకితుడు పశ్చిమ చాళుక్యుల వంశ స్థాపకుడు అయిన రెండో తైలపుడు పాపహర దేవమయ్యకు చేసిన భూదానం గురించి వివరిస్తున్నది. ఇందులో కొందరు వర్తక శ్రేష్ఠులు, గావుండల పేర్లు ప్రస్తావించబడ్డాయి.

బాసరలో ఉన్న శాసనాల్లో అత్యధికం ఈ పాప హరేశ్వర ఆలయం వద్దే ఉన్నాయి. ఈ ఆలయంలో పశ్చిమ చాళుక్యుల కాలం నాటివే అయిన మరో 7 దాన శాసనాలు ఆలయ స్తంభాల మీద చెక్కబడినవి. వాటిలో దాతల పేర్లు ,కొన్నింటిలో వారిచ్చిన ధనమొత్తం వివరించారు.దాతలు ఇచ్చిన ధనం ద్రమ్మములలో పేర్కొనడం జరిగినది. వీటిలో ముఖ్యంగా మహారాజ సెట్టి శాసనం లో 'వ్యాసాపురద' అని గ్రామం పేరు, 'పాపవినాస దేవర' అని ఆలయంలోని ప్రధాన దేవుని పేరు ఉన్నాయి. ఈ దాన శాసనాలు వాస్తవానికి 8 ఉండవలసి ఉండగా ప్రస్తుతానికి 7 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటన్నింటినీ ఎపిగ్రఫి శాఖ 1958-59 లో, 1966 లో తమ వార్షిక నివేదికలో పేర్కొంది.



**పాప హరేశ్వర ఆలయం బాసర**



**రెండో తైలపుని కాలపు శాసనం**

బాసర గ్రామ మధ్యలో ఉన్న పాతాళేశ్వర ఆలయం వద్ద ఉన్న శాసనం ఎపిగ్రఫీ శాఖ ద్వారా 1958–59 లో 1966 లోనూ రెండుసార్లు తమ వార్షిక నివేదికలో పేర్కొనబడింది. వీటిలో కాలనిర్ణయం,సారాంశం వేర్వేరుగా నమోదు అయింది. కానీ ఈ శాసనం పశ్చిమ చాళుక్యుల రాజు అయిన జగదేక మల్లుని కాలం నాటిదేనని రెంటిలోనూ పేర్కొన్నారు. 1958–59 నివేదిక ప్రకారం పశ్చిమ చాళుక్య రాజైన జగదేక మల్లుని కాలంలో దండనాయకుడు మల్లిదేవర ఐదుగురు గావుండల సమక్షంలో తన తల్లి నాగలదేవి ద్వారా వ్యాసపుర అగ్రహారం లో ప్రతిష్టించిన 'అభినవ కేశవ దేవ' ఆలయానికి భూమి, వరి మరియు నూనెలను దానంగా ఇస్తున్నట్లు శక సంవత్సరం 1070 ప్రభవ భాద్రపద శుక్ల పాడ్యమి శుక్రవారం అనగా క్రీ.శ. 1147 ఆగస్టు 29 (నిజ భాద్రపద మాసం) నాడు ఈ శాసనం వేయించినట్లు తెలుస్తున్నది.

1966 నివేదిక ప్రకారం పశ్చిమ చాళుక్య రాజు అయిన జగదేక మల్లుని కాలంలో దండనాయకుడు మల్లిదేవర వ్యాసపుర అగ్రహారంలో నాగిదేవి మరియు త్రికూటనాథ లను ప్రతిష్టించారు. ఈ త్రికూటనాథ లోని దేవుడైన కేశవునికి స్థానికులైన వర్తకులు,గావుండలు పూజాది అర్చన కార్యక్రమాల కోసం భూమిని దానంగా ఇచ్చినట్లు పేర్కొనబడింది.

బాసర లోని శాసనాలలో శాసన సమయం ఖచ్చితంగా పేర్కొంటూ వేయబడిన శాసనాలు రెండే రెండు. ఒకటి పాప హరేశ్వర ఆలయంలోని రెండో తైలపుని శాసనం కాగా రెండోది ఇది. కాగా ఇంతటి విలువైన శాసనం ప్రస్తుతం అందుబాటులో లేదు. ఇది ఎపిగ్రఫీ శాఖ ద్వారా రికార్డ్ చేయబడి ఉండడం వల్ల అందరికీ శాసన వివరాలు తెలుస్తున్నాయి. ఈ శాసనం ద్వారా బాసర కు వ్యాసాపురం అనే పేరు ఉన్నట్లు తెలియడమే కాకుండా ఐదుగురు గావుండలు అనగా గ్రామాధికారులు అని శాసనంలో పేర్కొనడం ద్వారా బాసరకు అనుబంధంగా మరో 5 గ్రామాలు ఉన్నట్లు రుజువు అవుతున్నది. నేటికీ కూడా బాసర ఆరు గ్రామాల కలయిక అని పేర్కొనడం అవి అనుబంధంగా ఉండడం గమనార్హం.

బాసరలోని గాదె హనుమాన్ ఆలయం ముందర ఉన్న శాసనాన్ని ఎపిగ్రఫీ శాఖ 1958-59 వార్షిక నివేదికలో,1966 వార్షిక నివేదికలోనూ పేర్కొంది. ఈ శాసనం 4 పలకలతో ఉంది. 4 వైపులా శాసన పంక్తులు చెక్కబడి ఉన్నాయి. ఈ నాలుగు వైపులా 9 మంది జైనుల చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. ఈ శాసనం జైన గురువు ఛత్రదేవ మునీంద్రుని ప్రశస్తి శాసనం. శాసనం 4 భాగాలలో 2 వైపులా ఆయన గురించే ఉండగా మరో రెండు వైపులలో ఒకవైపు బలదేవ భట్టారకుని గురించి, మరో వైపు అటుపయసెట్టి అనే వైశ్యుని గురించి ఉన్నది. బాసర లో జైనం ఆనవాళ్లకు ఇది కీలక ఆధార శాసనం.ఇది కూడా పశ్చిమ చాళుక్యుల కాలం నాటి శాసనమే.

బాసరలో ఉన్న నల్ల హనుమాన్ ఆలయం వద్ద తెలుగుకన్నడ లిపిలో కన్నడ భాషలో రాయబడిన పశ్చిమ చాళుక్యుల కాలం నాటి ఒక దాన శాసనాన్ని నేను గుర్తించగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం తరపున శ్రీ శ్రీరామోజు హరగోపాల్ గారు దాన్ని పరిష్కరించడం జరిగింది. 'యమనేమ స్వాధ్యాయ ధ్యాన మోనానుష్టాన జపనేమ హెూమ సమాధి సంపన్నుడైన శ్రీమతు తామదత్తి కి దాత రామస్వామి తాను బాసరలో కట్టించిన బసది చేసిన ధర్మ దాన శాసనం ఆచంద్రార్కతారంబరాలు ఉండేంతవరకు 364 దినాలు నిలిచి ఉండాలని కోరుకుంటున్నట్లు శాసనంలో చెప్పబడింది. శాసన పంక్తుల కింద ఆవు,దూడ బొమ్మలు చెక్కబడి ఉన్నాయి. ఈ శాసనం బైరాన్ పల్లి శాసనాన్ని పోలి ఉన్నది. ఇది జైన శాసనం. బాసర లో జైనం ఆనవాళ్లను బలోపేతం చేస్తున్న మరో ముఖ్యమైన శాసనం ఇది.



**రామస్వామి శాసనం**

వ్యాసేశ్వర ఆలయం వద్ద పశ్చిమ చాళుక్యుల కాలం నాటి ఒక అరిగిపోయిన శాసనాన్ని గుర్తించినట్లు ఎపిగ్రఫీ శాఖ తన 1966 వార్షిక నివేదికలో పేర్కొంది. ఇది ప్రస్తుతం కనిపించడం లేదు. కాగా ఈ శాసనం బాసర లో ఉత్సవ నిర్వహణ కోసం వేయించిన దాన శాసనం గా భావిస్తారు. ఈ శాసనం వల్లనే బాసరలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా 3 రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలుస్తోంది[3]. ఈ ఉత్సవాలు ఘనంగా జరిగేవి అని 1961 ఆదిలాబాద్ జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ లో, ఫెయిర్స్ అండ్ ఫెస్టివల్స్ పుస్తకం లోనూ పేర్కొన్నారు.

పదిహేను శాసనాల వల్ల పశ్చిమ చాళుక్యుల పాలన కాలం నాటి అధికారుల వివరాలు, వారు ఉపయోగించిన ద్రవ్యమానము, దానాలు, నిర్మించిన బసదుల గురించి తెలుస్తున్నది. వీరి వల్ల బాసరలో జైన బసదులు నిర్మించబడినవని శాసనాధారాలు లభించినట్లు అయింది. బాసరలో జైన మతం ఉచ్ఛ స్థితిలో ఉందనడానికి ఇవి రుజువులుగా ఉన్నాయి.

**కాకతీయులు వారి సమకాలీకుల కాలం :** కాకతీయులకు ఆద్యుడైన వెన్నరాజు రాష్ట్రకూటుల సామంతునిగా నాందేడ్ ప్రాంతమును,బాసర పరిసరాలను

పాలించెను. కాకతి రుద్రదేవుడు రాజుగా ఉన్న సమయంలో పశ్చిమ చాళుక్యుల రాజ్యమును కాలచూరి బిజ్జలుడు తన పాలనలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశాడు. బాసరలో కాకతీయుల పాలనా కాలానికి గుర్తుగా వారి కాలంలో అధికంగా వేయించిన సమలింగాలలో ఒకటి బాసర లోనూ ఉంది. క్రమంగా బాసర ప్రాంతం వరకు కాలచూరి బిజ్జలుని ప్రాబల్యం ఏర్పడినది. ఇతని మంత్రి బసవేశ్వరుని వల్ల వీరశైవం విజృంభించింది. అనేక జైన ఆలయాలు, బసదులు కూల్చబడ్డాయి. జైన ఆలయాలు శైవ ఆలయాలుగా మార్చబడ్డాయి. బాసరలో కొన్ని ఆలయాలు ఆ క్రమంలోనే శైవ ఆలయాలుగా మారాయి. శైవం లోనూ కాలాముఖ, పాశుపత శాఖలు వ్యాప్తిలోకి వచ్చాయి. మైలారదేవుని ఆలయాలు వెలిశాయి. ఆ కాలంలో ఏకవీర, మైలారదేవుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. బాసరలో కూడా ఈ ఉత్సవాలు జరిగేవి అనడానికి నిదర్శనంగా ఏకవీర ఆలయం ఉండడం, బాసర అనుబంధ గ్రామం మైలాపూర్ లో మైలారదేవుని (ఖండోబా) విగ్రహాలు లభించడం జరిగింది. ఇక్కడ వీరశైవం వ్యాప్తిలో ఉందనడానికి ఇవి నిదర్శనం. అంతే కాకుండా ఇక్కడ అధిక సంఖ్యలో సతిశిలలు లభించాయి. ఇక్కడ సతి ఆచారం ఉండేదనడానికి ఇవి ఆధారం గా ఉన్నాయి. వీటితో పాటు మహిషాసుర మర్దిని విగ్రహాలు లభించడం జరిగింది. ఇవి తాంత్రిక పూజల కోసం చెక్కిన శైలి లో చెక్కబడి ఉన్నాయి.



**సతీ శిల**



**మైలార దేవుడు (ఖండోబా)**



సమ లింగం



మహిషాసుర మర్దిని

కాకతీయుల అనంతర కాలం – వివిధ సాంప్రదాయాల వ్యాప్తి : కాకతీయుల అనంతరం ఈ ప్రాంతం బహమనీ సుల్తానుల పాలన కింద ఉంది. వారి పాలనా కాలంలో ఇక్కడ 15 వ శతాబ్దం ప్రారంభంలో రెండవ దత్త అవతారం గా భావించబడే శ్రీ శ్రీ నృసింహ సరస్వతి తన శిష్య బృందంతో సహా బాసర వచ్చి ఇక్కడ రేణుకా మాత ఆలయం వద్ద ధ్యానం చేసినట్లు గురుచరిత్ర లో పేర్కొనబడింది. ఈ ఆలయం క్రమంగా దత్తాత్రేయ ఆలయంగా మారి ప్రస్తుతం కూడా అదే పేరుతో పిలవబడుతోంది. నృసింహ సరస్వతి రాకతో బాసరలో దత్త సంప్రదాయం నెలకొల్పబడింది. చాలామంది వీర శైవులు దత్త సంప్రదాయం లోకి మారారు. నృసింహ సరస్వతి ఇక్కడకు వచ్చినపుడు ఇక్కడ బహమనీ సుల్తానుల తరపున పనిచేస్తున్న అధికారి సాయందేవుని అధికారిక నివాసం నేటికీ బాసర లో ఉంది.

బహమనీ సుల్తానుల పాలన అనంతరం ఈ ప్రాంతం కుతుబ్ షాహీల పాలనలోకి వెళ్ళింది. కొన్నాళ్లపాటు మొఘలుల పాలన కూడా చవిచూసిన పిదప ఈ ప్రాంతం అసఫ్జాహీల పరమైంది. ఈ సంధి సమయంలో బాసర ప్రాంతంలో ముఖ్యంగా గుడి మీద దండయాత్ర జరిగింది. ఆ సమయంలో బాసర అనుబంధ గ్రామం అయిన రేణుకాపూర్ ఘడి అధికారి అయిన మక్కాజి పటేల్ ధైర్య సాహసాలు ప్రదర్శించి దండయాత్రను అడ్డుకుని ఆలయం పూర్తిగా ధ్వంసం కాకుండా

కాపాడాడు. కానీ ఈ దండయాత్ర లో సరస్వతీ, కాళిక విగ్రహాలు స్వల్పంగా ధ్వంసం కాగా మహాలక్ష్మి విగ్రహం పూర్తిగా ధ్వంసం అయింది. దాని బదులు జైపూర్ నుండి మరో విగ్రహం తెచ్చి ప్రతిష్టించారు. ఈ మక్కాజీ పటేల్ విగ్రహం నేటికీ సరస్వతీ ఆలయం లో చూడవచ్చు.



**మక్కాజి పటేల్ విగ్రహం**

18 శతాబ్దపు ప్రారంభంలో బాసర గ్రామ వాసి అయిన నరహరి మాలు అనే వ్యక్తి నవనాథ భక్తిసార్ అనే గ్రంథాన్ని మరాఠీ లో రచించాడు. ఇది 40 అధ్యాయాల గ్రంథం గా రాయబడింది. ఈయన ఈ పుస్తక రచన చేసిన గుహ నేటికీ బాసరలో సరస్వతీ ఆలయ సమీపంలో గుట్ట మీదే ఉంది. దీన్ని నరహరి మాలు గుహ అంటారు. ప్రస్తుతం వ్యాస గుహగా పిలువబడుతోంది. ఇతని సమాధి నేటికీ గోదావరి ఒడ్డున శివాలయం ఎదురుగా ఉంది. ఇక్కడ నాథ సంప్రదాయం కూడా ప్రాచుర్యం పొందినట్లు ఈ పుస్తకం ద్వారా తెలుస్తోంది.బాసర కు సమీపంలో ఉన్న కోస్లి గ్రామం వద్ద నాథ సంప్రదాయానికి చెందిన నవనాథులలో ఒకరైన కానిఫ నాథుడు ఇక్కడకు వచ్చినట్లు శాసనం ఉన్నది. ఈ శాసనాన్ని శ్రీ కందకుర్తి యాదవరావు గారు గుర్తించడం జరిగింది.

బాసరలో శాసనాలు,శిల్పాలు మాత్రమే కాకుండా సాహిత్యం ద్వారా కూడా చారిత్రక అంశాలు తెలుస్తున్నాయి. బాసర స్థలపురాణం గురించి శేషాచల సూరి అనే విద్వాంసుడు 18 శతాబ్దం చివరలో శ్రీ వాసర మహాసరస్వతి క్షేత్ర మాహాత్మ్యం అనే గ్రంథం రాశాడు. ఇందులో ఇక్కడి అష్ట తీర్థాలుగా పిలువబడే ప్రదేశాల గురించి రాయబడి ఉంది. ఈ గ్రంథం చేతులు మారి బాసర వాసి సరస్వతీ ఆలయ ప్రధాన పూజారిగా ఉండిన శ్రీ శేషుబువా గారి ఇంటికి చేరింది. ఇది ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. ఈయన వంశీకులు దాని ప్రతిని సంరక్షిస్తున్నారు. దీనితో పాటు నృసింహ సరస్వతీ రాక గురించి ఆయన శిష్యుడు నాటి స్థానిక అధికారి అయిన సాయందేవుని వంశీకులు రాసిన గురుచరిత్ర ద్వారా కూడా ఇక్కడి ఆలయాల వివరాలు తెలుస్తున్నాయి. నరహరి మాలు రాసిన నవనాథ భక్తిసార్, విష్ణుదాసు దేవి స్తుతులు, దాసగణు దేవి స్తుతులు కూడా మరిన్ని వివరాలు ఇస్తున్నాయి.

**ముగింపు:** బాసర లోని శాసనాలు బయటపడిన శిల్పాలను గమనిస్తే బాసర గ్రామం అతి పురాతనమైనదని తెలుస్తున్నది. బాసరకు వెయ్యి సంవత్సరాల పూర్వమే వ్యాసపురం అనే పేరు ఉన్నదని కూడా తెలుస్తున్నది. బాసర ఒక గొప్ప జైన మత కేంద్రం అని, జైన బసదులు ఇక్కడ ఉన్నట్లు ఇక్కడి శ్రేష్ఠులు వాటిని నిర్మించి పోషించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. దీని ద్వారా బాసర ఒక జైన బసది అని అత్యంత స్పష్టంగా తెలుస్తున్నది. ఇక్కడ కొత్తగా దొరికిన రెండవ సరస్వతీ విగ్రహం, గోదావరి తీరంలో విద్య కు అధిదేవత గా భావించబడే జైన యక్షిణి విగ్రహం లభించడం ద్వారా బాసర ఒకప్పుడు విద్యాకేంద్రం గా భాసిల్లింది అని భావించవచ్చు. ఇది బసదులు,జైన శైలి సరస్వతీ విగ్రహాలు ఉండడం ఆధారంగా ఒకప్పుడు సరస్వతీ గచ్ఛ గా ఉండి ఉండవచ్చు అని అనిపిస్తున్నది. ఈ కోణంలో మరింత పరిశోధన జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రాష్ట్రకూటుల కాలం నుండి పశ్చిమ చాళుక్యుల కాలం వరకు బాసర ప్రాంతం ఒక భవ్యమైన ప్రదేశంగా వెలుగొందినట్లు ఇక్కడి శాసనాలు చెప్తున్నాయి. శాతవాహనుల కంటే ముందు నుండి మొదలు పశ్చిమ చాళుక్యులు, కాలచూరి రాజులు, కాకతీయుల వరకు సాగిన ఘనమైన చరిత్రకు ఇక్కడి ఆనవాళ్లు సజీవ సాక్ష్యాలు గా నేటికీ నిలిచి ఉన్నాయి.

బాసర లో ఉన్న పలు ఆలయాలు వాటికంటూ ఉన్న ప్రత్యేకతల వల్ల ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా, ధార్మికంగా విశిష్టత సంతరించుకుంది. అయితే బాసరకు ఉన్న చారిత్రక వైభవం అంతకన్నా గొప్పది. ఈ ఘన చరిత వారసత్వాన్ని భావి తరాలవారికి అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు ఇక్కడి చారిత్రక ఆనవాళ్లు కాలగర్భంలో కలిసిపోకుండా చూడవలసిన మరియు వాటిని కాపాడవలసిన గురుతర బాధ్యత మన చరిత్ర సాంస్కృతిక వారసత్వ శాఖ మీదా ఉంది.

**కృతజ్ఞతలు :** ఈ క్షేత్ర పరిశోధనలో వెన్నుతట్టి ప్రోత్సహించిన శ్రీ కందకుర్తి యాదవరావు గారికి, అన్నివిధాలా ముందుండి నడిపించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీ శ్రీరామోజు హరగోపాల్ గారికి, ప్రాథమిక సమాచారం ఇచ్చిన శ్రీ కోవెల శ్రీనివాసచార్యులు గారికి, రిఫరెన్సు పుస్తకాలు అందించిన శ్రీ బంగారు రామాచారి గారికి నా కృతజ్ఞతలు.

## References:

1. తెలంగాణలో క్షేత్ర స్థాయి ఔత్సాహిక పరిశోధకులకు ఊతం ఇస్తూ ప్రోత్సహిస్తున్న “కొత్త తెలంగాణ చరిత్ర బృందం” లో ఒక సభ్యునిగా బాసరలో ఒక విస్తృత స్థాయిలో క్షేత్రపరిశోధన చేయడం జరిగినది.
2. ఈ శాసనాన్ని నేను గుర్తించగా మా బృందం తరపున శ్రీ శ్రీరామోజు హరగోపాల్ గారు పరిష్కరించడం జరిగింది.
3. ఈ శాసనాన్ని పి.వి. పరబ్రహ్మ శాస్త్రి గారితో కలిసి పరిశీలించినట్లు ప్రముఖ చరిత్రకారులు శ్రీ కందకుర్తి యాదవరావు గారు తెలిపారు.

**ఆధార గ్రంథాలు :**

1. ఆదిలాబాద్ జిల్లా సర్వస్వం – బీ.ఎన్. శాస్త్రి, మూసి పబ్లికేషన్స్, హైదరాబాద్, 1990.
2. ఆదిలాబాద్ జిల్లా గెజిటేర్ – ఎం.వి. రాజగోపాల్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1976.

3. నిజామాబాద్ జిల్లా గెజిటేర్, ఎం.వి.రాజగోపాల్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1973.

4. ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆన్యువల్ రిపోర్ట్ ఆన్ ఇండియన్ ఎపిగ్రఫీ ఫర్ 1958–59, ది మేనేజర్ ఆఫ్ పబ్లికేషన్స్, ASI, ఢిల్లీ, 1963.

5. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ రిపోర్ట్ ఆన్ ఎపిగ్రఫీ ఫర్ 1966 – డా. వెంకట రమణయ్య, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1966.

6. డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్ బుక్, ఆదిలాబాద్ 1961 – ఏ. చంద్రశేఖర్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1968.

7. ఫెయిర్స్ అండ్ ఫెస్టివల్స్ ఆఫ్ ఆదిలాబాద్ 1961 – ఏ. చంద్రశేఖర్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1968.

8. కన్నడ ఇంస్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, డా. సీ.ఎస్. వాసుదేవన్, ప్రసరంగ కన్నడ యూనివర్సిటీ, హంపి, 1999.

9. శ్రీ వాసరక్షేత్ర శ్రీ సరస్వతి మహాత్మ్యం, కొదుగుమళ్ళ పరాంకుశాచార్యులు, దేవాదాయ ధర్మదాయశాఖ, వాసర క్షేత్రము, ఆదిలాబాదు జిల్లా, ఆంధ్రప్రదేశ్, 1981.

10. బాసర సరస్వతీ క్షేత్ర సాహిత్యం–పరిశీలన, డా.కోవెల శ్రీనివాసచార్యులు, పరిశోధన గ్రంథం, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్, 2005.

11. శ్రీ వాసర జ్ఞాన సరస్వతీ క్షేత్ర మాహాత్మ్యమ్, శేషాచల సూరి, ఆంధ్రప్రదేశ్ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం మరియు పరిశోధనాలయము, హైదరాబాద్, 2008.

12. వ్యాస ప్రతిష్ఠిత శ్రీ జ్ఞాన సరస్వతి సంపూర్ణ చరిత్రము, యోగేష్ బాసరకర్, స్వీయ ప్రకాశనము, 2011.

13. గురుచరిత్ర గంగాధర సరస్వతి – శ్రీ స్వామి సమర్థ్, స్టెర్లింగ్ పేపర్ బ్యాక్స్, న్యూఢిల్లీ, 1855. పునర్ముద్రణ 2009.

* * *

# TELANGANA HISTORY CONGRESS

## LIST OF LIFE MEMBERS

1 Prof. G.Venkatarajam
2 Mallam Veerender
3 Prof.Arjun Rao K
4 Dr.Jaikishan S
5 Prof. K. Vijaya Babu
6 Naresh Kumar K
7 Saraswathi S
8 Dr.D.Jayasree
9 Ramakrishna Rao KV
10 Prof. Rekha Pande
11 Dr. Suresh Pande
12 Dr. Aravind Kumar
13 Dr. (Ms) Indira
14 Anand Kandakurthi
15 Dr.A.Harishankar
16 Badru A
17 Samson C Watson
18 Narahari R
19 Kishore Sigamalla
20 Dr. G. Tirupati
21 Nagendra Sharma S
22 Dr.Venkatehwarlu K
23 Dr.Kistareddy C
24 Ravi Kumar M
25 Prof. Chandrasekhar Reddy
26 Srinivas Tokala
27 Meeta Joshi
28 Dr. Kumara swamy Akulapelli
29 Dr.Ram Swaroop
30 Abdul Taha
31 Dr.E.Saidulu Goud
32 Dr.Fazalullah Khnan
33 Murali, K
34 Ms.M.Jyothi
35 Dr.Subhash A
36 Dr.Dasari Ranga
37 Sudhakar, K
38 Chandraiah, Ch
39 Raghu Kidambi
40 Srinivasan MA
41 Lalitha K
42 Shiva Prasad K
43 Narsing Rao J
44 SDV Aziz
45 Dr. Bade Saheb K
46 Dr.Srinivas Rao Kotte
47 Dr.Pandaiah K
48 Krishna P
49 Prof. Danish Moin
50 Sampath G
51 Mahesh Guguloth
52 Dr.MD Kareem
53 Aqthar Sulthana
54 Srinivas Boora
55 Babu Rao M
56 Srinivas MA
57 Balu Nayak
58 Vijay Kumar K
59 Balakrishna Goud V
60 Bhanu Prakash U
61 Sunitha Manda
62 Ramdhan G
63 Nageshwar Rao P
64 Pawan Kumar CV
65 Nasreen Begum
66 Dr.Nagalaxmi B
67 Ashok Kumar P
68 Kavitha Cherupalli
69 Abdul Sajid
70 Vinoda L
71 Dr.Anjaiah S
72 Dr.Nagendra P
73 Revathi V
74 Vishnu Ramavath
75 Hemavathi B
76 Dr.Srinivasa Rao M
77 Dr. Jayaram G
78 Dr.Sadanandam P
79 Prof. Manohar Thallapalli
80 Dr. Narra Ekambram
81 Dr. Yakaiah
82 Dr. Konda Srinivasulu
83 Tulasi K

84 Raju Vemula
85 Vijay Tummu
86 Dr. Raheem Mohd
87 Bukya Ushan
88 Gugulothu Ramesh Babu
89 Gopaldas Sampath
90 Dr. Shivakumar J
91 Sreenivas Theegala
92 Etikala Aruna
93 Dr. Ginjala Yadhava Reddy
94 Dr. Osman Pasha
95 Jayapal Kadari
96 Parasharamulu V
97 Dr. Raju Balgoori
98 Dr. T. Dayakar rao
99 Mallesh V
100 Veeranna Kommineni
101 Dr. D. Surya kumar
102 Vasanta Etikala
103 Mallikarjuna Sasala
104 Dr. G.V Ramakrishna Rao
105 Dr. B.Srinivas
106 Dr. KVS Narender
107 Minhaz Noorin
108 Dr. Rajkumar Chiliveru
109 Dr. D.Srinivas
110 Eslavatu Chandu
111 Dharavath Venkanna
112 Dr. A. Raghuvender
113 Dr. Boda Hathiram
114 Dr. Gopalaxmi Kanapathi
115 Dr. P. Ramakrishna
116 Dr. B. Erya
117 Dr. K. Rajaiah
118 Dr. R. Venkatrajam
119 Anandakumar Undeti
120 Dr. Guguloth Ravi
121 Dr. Banoth Somulu
122 Dr. Kolipaka Srinivas Somaiah
123 Dr. Srinivas Rao Vaddanam
124 Dr. G. Anjaiah
125 Dr. Md. Sharif
126 Dr. NR Giridhar
127 Prof. Adapa Sathyanarayana
128 Dr. L Indira Devi
129 Sudhakar Rayila
130 Dr. B. Lavanya
131 Prof. N. Kanakaratnam
132 Prof. B. Babu Rao
133 Srilaxmi K
134 Prof. K.P.Rao
135 Dr.S.K. Aruni
136 Kanneboyina Venkateswarlu
137 Dr. N. Amrutha Rani
138 Anuradha Reddy P
139 Damodhar Rao Musham
140 Suresh Bandari
141 Dr. B. John Robert
142 Dr. A. Renuka Devi
143 Kandakurti Yadava Rao
144 Sajjad Shahid
145 Prof. Deepak Kumar
146 Dr. M. Madan Babu
147 Srisailam M
148 Prof Ramakrsihna P
149 Dr NS Ramachandra Murthy
150 KVL Narsimha Rao
151 Dr. Sanganabhatla Narsaiah
152 Dr. Bandi Kalyani
153 Dr. N. Venkateswarlu
154 Dr. Gandra Mahesh
155 Dr. Patha Ashok
156 Sreelatha G
157 Dr. B. Brahmaiah
158 Dr. Kommula Sharath
159 Thirupathi Potharaveni
160 Dr. Mandala Sambaiah
161 Dr. Nalla Mallaiah
162 Dr. G. Dayakar
163 Dr. Ch. Ravindra Babu
164 Dr. S. Jayakumar
165 Dr. Boorla Chandra Shekhar
166 Vidyasagar S
167 Kondaveeti Gopi Varaprasad Rao
168 Dr.N.Gopal
169 Dr.Saidulu Bhukya

170 Balagam Ram Mohan
171 Sreenu M
172 Dr.Bhinnuri Manohari
173 Dr.Md.Mubeenuddin
174 Dr.Nageshwar Joolu
175 Ahobilam Karunakar
176 Md.Naseeruddin
177 Dr.Bandi Srinivas
178 Vittal S
179 Ramachary B
180 Ganta Vijayalaxmi
181 Nagajyothi Bakki
182 Prabhakar Potharaju
183 Meenaiah Chaganti
184 Shekhar G
185 Hussain M
186 Syed Meer Abul Hassan
187 Kusuma Suryakiran
188 Ramesh Ramanatham
189 Dr.Bandi Muralidhar Reddy
190 Udaya Bhanu S
191 Narsingu Kotaiah
192 Prasad KSN
193 Chandrakanth M
194 Nagendra Kumar T
195 Dr. Ms. A. Shyamala
196 Sreekanth T
197 Mudavath Saida
198 Srinivasa Rao Kasni
199 Anitha E
200 Ramarao Halavath
201 Dr A. Bhaskar Rao
202 Srinivas Jakoju
203 Krishna Pagidipally
204 Sravan Kumar M
205 Saumalatha Bandi
206 Haribabu Arepalli
207 Maloth Devender
208 Boini Srinivas Rao
209 K.Badesaheb
210 E.Somla
211 Kadem Sathish
212 Dr. B.John Robert
213 I.Neela
214 B.Sharada
215 P.Ashok Kumar
216 Bhupathi M
217 Abdul Sajid
218 Ramachary T
219 Radhika P
220 Shaik Syed Miya
221 Narsaiah, B
222 Dharavat Venkanna
223 Prabhakar P
224 Dr. Gopalaxmi Janapati
225 Shekhar G
226 Ranjith Kumar A.
227 Dr. B. Erya
228 Dr. K. Rajaiah
229 Sri Syed Meer Abul Hussain
230 Dr. Katta Srinivasa Rao
231 M. Shravan Kumar
232 Prof. A. Vijaya kumar Babu
233 Dr. Madan Babu Muppidi
234 Prof. Y. Sudershan Rao
235 Dr. Kasani Srinivasa Rao
236 Dr. N. Venkateswarlu
237 Vijay Kumar Tumu
238 Dr. Raheem Mohd
239 Prof. R. Chandrasekhar Reddy
240 Dr. Yadhava Reddy Ginjala
241 Dr. Osman Pasha
242 Parasu Ramulu V
243 Geetha Kurumelli
244 Dr. Raja Reddy
245 Ashwini K
246 Prasada Rao T
247 Minhaz Noorin
248 Dr. Rajkumar Chiliveru
249 Dr. Srinivas
250 Islavatu Chandu
251 Anitha Kumari K
252 Dr Shaik Mahaboob Pasha
253 Dr Nagaraju P
254 Ganga Devi B
255 Dr.Sudakshina Bollepally

*With Best Compliments from*



**Smt. ANURADHA PINGLE REDDY**

**Daughter of Sri Chilam Sreeram Bhoopal &**

**Smt Snehalatha Bhoopal**

**&**

**Great Grand Daughter of Maharani Chilam Janaki Bai**



**Sri Chilam Sreeram Bhoopal**

Hyderabad Civil Service - IAS

Samasthan Sirnapally



**Smt Chilam Snehalatha Bhoopal**

D/o Bollampally Ranga Reddy

Samasthan Sirnapally

*WITH BEST COMPLIMENTS*

From:

T. VENKAT RAMDEV

Managing Director

RHYLONS

**COROMANDEL INDUSTRIAL GASES PVT. LTD.**

**MANUFACTURE OF COMPLETE RANGE OF INDUSTRIAL GASES**

Regd.Off : 8-2-338/5, "Sharada Kripa", 2nd Floor,
Panchavati Colony, Road No.3,
Banjara Hills, Hyderabad – 500034. Telangana.

Factory: Plot No. 10&13, 'D' Block Expansion, I.D.A, Autonagar,
Visakhapatnam – 530012., A.P.

Plot No. 1&2, APIIC Industrial Area, 5th Cross Road, Ramanayyapeta,
Kakinada – 533005., A.P